RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers

05 జూలై 2025 శనివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:31

## దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్దాలే..

### ప్రధాని మోదీలాగా ఇందిరా గాంధీ భయపడలేదు

### క్షమాపణలు చెప్పడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పని

### ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో ఖర్గే



హైదరాబాద్, జులై 04 : ప్రధాని మోదీలాగా ఇందిరా గాంధీ భయపడ లేదని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే గుర్తు చేశారు. ఎవరు వచ్చినా బంగ్లాదేశ్‌కు స్వాతంత్రం ఇస్తామని ఇందిరాగాంధీ ప్రకటించారని.. అదే పని ఆమె చేసి చూపించారన్నారు. క్షమాపణలు చెప్పడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పని అంటూ అయన ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లే.. కేంద్రంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరుతుందని ఏఐసీసీ అధ్యక్షులు, ఎంపీ మల్లికార్జున్ ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్దాలేనన్నారు. దేశానికి ప్రధాని మోదీ, కేంద్ర హెూమ్ శాఖ మంత్రి అమిత్ షా చాలా చాలా చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.కానీ వాళ్లు ఈ దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమిటని సూటిగా ప్రశ్నించారు. నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. ఇప్పటి వరకు ప్రధాని మోదీ 42 దేశాలు తిరిగారని గుర్తు చేశారు. కానీ ప్రజలు చనిపోతున్నా.. మణిపూర్ రాష్ట్రానికి మాత్రం ఆయన వెళ్లలేదని మండిపడ్డారు. పాకిస్థాన్‌ను ఏదేదో చేస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించారన్నారు. కానీ ఎందుకు ఏం చేయలేదని మోదీ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. పాకిస్తాన్‌పై యుద్ధం చేయకుండా.. మిమ్మల్ని ఎవరు ఆపారంటూ సందేహం వ్యక్తం చేశారు.ప్రధాని మోదీలాగా ఇందిరా గాంధీ ప్రధానిగా భయపడ లేదన్నారు. ఎవరు వచ్చినా బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం కల్పిస్తామని ఇందిరాగాంధీ ప్రకటించారని.. అదే పని ఆమె చేసి చూపించారన్నారు. క్షమాపణలు చెప్పడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పని అంటూ అయన ఎద్దేవా చేశారు. రాజ్యాంగం నుంచి లౌకిక అనే పదాన్ని తీసి వేయాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. సెక్యులర్ అనే పదం రాజ్యాంగంలోనే లేదని బీజేపీ చెపుతుందన్నారు.రాజ్యాంగం నుండి లౌకిక పదాన్ని తీసేయారని తాను చాలెంజ్ చేస్తున్నానని ఈ సందర్భంగా ఖర్గే ప్రకటించారు. సెక్యులర్ అనే పదం బీజేపీ ప్రణాళికలో రాసుకున్నారని వివరించారు. సెక్యులర్ అనే పదంతో మీకు ఇబ్బంది ఉంటే మీ పార్టీ ప్రణాళిక నుంచి తీసివేయాలని బీజేపీ అగ్రనేతలకు ఖర్గే బహిరంగ సవాల్ విసిరారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందంటే.. అది కార్యకర్తల కృషి ఫలితమేనని స్పష్టం చేశారు. రేవంత్, భట్టి, మంత్రులు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేశారన్ని వివరించారు. కేసీఆర్, బీజేపీ కలిసి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అడ్డుకుంటున్నారన్నారు. కానీ తెలంగాణ ప్రజలు మాత్రం ఈ రెండు పార్టీలను ఓడించారని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని గతంలో తాను చెప్పానని వివరించారు. కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణలో 50కిపైగా కేంద్ర సంస్థలు వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణకు ఈ 11 ఏళ్లలో ఏం ఇచ్చారంటూ ప్రధాని మోదీని ఈ సందర్భంగా ఖర్గే సూటిగా ప్రశ్నించారు.

## ఢిల్లీలో ఉండే మోడీ అయినా, గల్లీలోని కేడీ అయినా..

### రైతు సంక్షేమం విషయంలో తేల్చుకునేందుకు రండి, సవాళ్లకు సిద్ధం

### బీఆర్ఎస్, బీజేపీ నేతలకు సీఎం రేవంత్ రెడ్డి గట్టి సవాల్



హైదరాబాద్ జూలై 4 బీఢిల్లీలో ఉండే మోడీ అయినా, గల్లీలోని కేడీ అయినా.. రైతు సంక్షేమం విషయంలో తేల్చుకునేందుకు రండి, సవాళ్లకు సిద్ధమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలకు గట్టి సవాల్ విసిరారు. కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసి, వ్యవసాయాన్ని దండుగ నుంచి పండుగగా మార్చిన ఘనత తమదంటూ రేవంత్ రెడ్డి గర్వంగా వెల్లడించారు. 24 గంటల ఉచిత కరెంట్, రుణ మాఫీ సహా రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో రైతుల శ్రేయస్సు కోసం చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు రేవంత్ సవాల్ చేశారు. రైతుల బాగు కోసం ఎవరు ఎంత చేశారో తేల్చుకునేందుకు రావాలని కోరారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు, పథకాలను అమలు చేస్తోందన్నారు సీఎం. అనేక కష్టాలు ఎదురైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం నిలబడి, సమస్యలను అధిగమించి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించే దిశగా పనిచేస్తోందన్నారు.

రైస్ ఉత్పత్తి, కొనుగోలు

ఈ క్రమంలో తెలంగాణ రైతులు ఈ ఏడాది 2 కోట్ల మెట్రిక్ టన్నుల రైస్‌ను ఉత్పత్తి చేసినట్లు సీఎం గుర్తు చేశారు. ప్రజా పాలనలో ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతులకు సరైన ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కేవలం 9 రోజుల వ్యవధిలో రూ. 9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రైతులకు ఆర్థిక భరోసాను అందించడమే కాకుండా, వ్యవసాయాన్ని ఒక పండుగగా మార్చిందని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ సరఫరా చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయం, రైతు సంక్షేమం, ఆర్థిక పునరుద్ధరణ కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న సామాజిక న్యాయ విజయ భేరి సభలో సీఎం ఈ మేరకు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతోపాటు అనేక మంది కాంగ్రెస్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి కుట్రలు..



ఈ దేశంలో ప్రస్తుతం ఒక సైదాంతిక పోరాటం జరుగుతుంది రాజ్యాంగాన్ని రక్షించాలని కాంగ్రెస్, ఇండియా కూటమి ఒక పక్కన, రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి, ఎన్డీఏ కూటమి మరో పక్కన పోరాటం చేస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం ఆయన ఎల్బీ స్టేడియంలో పిసిసి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సామాజిక న్యాయ సభలో ప్రసంగించారు. గ్రామ శాఖ అధ్యక్షులతో సాక్షాత్తు ఏఐసిసి అధ్యక్షులు నేరుగా మాట్లాడేందుకు పిసిసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరిగాయని తెలిపారు. భారత రాజ్యాంగం అంటే అది కేవలం ఒక పుస్తకం కాదు కొన్ని దశాబ్దాలుగా శతాబ్దాలుగా ఈ దేశ ప్రజల ఆలోచనలు, పూజ్య బాపూజీ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, పూలే ఆలోచనలని రాజ్యాంగంలో పొందుపరిచి ప్రజల అవసరాల కోసం రూపొందించిన ఒక అద్భుత గ్రంథం భారత రాజ్యాంగం అని తెలిపారు. భారత రాజ్యాంగమే లేకపోతే ఈ దేశంలో పేదలు ,సామాన్యులు, గిరిజనులు, దళితులకు, బలహీన వర్గాలకు ఎటువంటి హక్కులు ఉండేవి కావు హక్కులు కేవలం రాజులు, రాజ్యాధికారం అనుభవించే కొద్ది మంది పెద్దలకు మాత్రమే దక్కేవి అన్నారు. అటువంటి పరిస్థితుల్లో దేశంలోని ప్రతి పౌరునికి సమాన హక్కులు, గౌరవాన్ని కల్పిస్తూ ఈ దేశ సంపద, అవకాశాలు దేశంలోని ప్రజలందరికీ సమానంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీజీ, బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన అద్భుత గ్రంథం రాజ్యాంగం అన్నారు. ఇంతటి పవిత్ర గ్రంధాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా ముందుకు పోతున్నారు, రాజ్యాంగాన్ని నిలబెట్టుకోవడమే మనందరి భవిష్యత్తు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

భారత రాజ్యాంగానికి చిన్న ఇబ్బంది జరిగిన దేశంలోని సామాన్యులు హక్కులు కోల్పోయే పరిస్థితి ఈ దేశంలో దాపురిస్తాయి అన్నారు. అద్భుత గ్రంథమైన రాజ్యాంగ స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర ప్రజల అందరి ఆశీర్వాదంతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఈరోజు వరకు ఆ సామాజిక న్యాయ సూత్రాన్ని అమలు చేసేందుకు అనేక రకాల సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్రంలో తీసుకువచ్చిందని డిప్యూటీ సీఎం వివరించారు.

రాష్ట్రంలోని ప్రతి గ్రామం నుంచి వచ్చిన పార్టీ నేతలు ప్రజా ప్రభుత్వం ఏడాదిన్నర కాలంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు.

పది సంవత్సరాలపాటు ఈ రాష్ట్రాన్ని పరిపాలించిన టిఆర్ఎస్ అడ్డగోలుగా దోపిడీకి పాల్పడింది, బిజెపి ఈ రాష్ట్ర ప్రజలను పట్టించుకోలేదు ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జీర్ణించుకోలేక అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు.

కొన్ని లెక్కల ద్వారా ఆ రెండు పార్టీలకు సరైన సమాధానం చెప్తామన్నారు. 2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు ప్రకటిస్తే అపహాస్యం చేసిన వారికి బుద్ధి చెప్పేలా రాష్ట్ర రైతాంగ సోదరులను రుణ విముక్తులను చేసేందుకు అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రెండు లక్షల రుణమాఫీ కింద 69 లక్షల రైతు కుటుంబాల పక్షాన 21,832 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకర్లకు చెల్లించిందని తెలిపారు.

రైతు భరోసా కింద అన్నదాతలకు

దాన్ని నిలబెట్టుకుంటేనే మనందరికీ భవిష్యత్తు

రాజ్యాంగం ఒక పుస్తకం కాదు అద్భుత గ్రంథం

సామాజిక న్యాయ సూత్రం ఎజెండాగా రాష్ట్రంలో పరిపాలన

అభివృద్ధిని జీర్ణించుకోలేక ప్రజా ప్రభుత్వం పై బీఆర్ఎస్, బిజెపి బురదజల్లే ప్రయత్నం

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపగడపకు తీసుకువెళ్లండి

౨-సామాజిక న్యాయ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మిగతా 2లో

ప్రజాబలం

05 జూలై 2025 శనివారం

# సహకారం సమాజ అభివృద్ధికి మార్గం

ప్రపంచం నేడు అనేక సంఘర్షణల మధ్య సామాజిక సమగ్రత కోల్పోతున్న తరుణంలో, సమానత్వాన్ని, సమిష్టి ప్రయోజనాన్ని, సమాజ సంక్షేమాన్ని ప్రాతినిధ్యం వహించే వ్యవస్థ సహకార మొక దారి చూపుతుంది. ప్రతి సంవత్సరం జూలై మొదటి శనివారం రోజున ప్రపంచ మంతటా అంతర్జాతీయ సహకార దినోత్సవం జరుపు కుంటారు. ఈ సంవత్సరం, 2025లో, జూలై 5న ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతోంది. ఇది కేవలం ఒక ఉత్సవం కాదు%ౕ% సహకార భావనను మరింత విస్తరించేందుకు, సామాజిక భద్రతకు, ఆర్థిక సమానత్వానికి మార్గదర్శకంగా నిలిచే రోజుగా భావించాలి. సహకార భావనకు వాస్తవంగా భారతీయ సమాజంలో చక్కటి ఆదర్శాలున్నాయి. ఉమ్మడి వ్యవస్థలు, గ్రామ సభల సహకార జీవన విధానం, సహపంక్తి భోజనాలు, కలిసికట్టుగా వ్యవసాయం ౦ ఇవన్నీ ప్రాచీన భారత సహకార మౌలిక భావనలే. ఆధునిక సహకార ఉద్యమం మాత్రం 19వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో జన్మించింది. 1844లో రోచ్డేల్ పట్టణంలో పలువురు కార్మికులు కలిసి ఏర్పాటు చేసిన "రోచ్డేల్ సొసైటీ ఆఫ్ ఈక్విటబుల్ పైనీర్స్" ఆధునిక సహకార ఉద్యమానికి పునాది వేసింది. వారు ప్రవేశ పెట్టిన ప్రజాస్వామిక నియంత్రణ, స్వచ్ఛంద సభ్యత్వం, లాభాల సమాన పంపిణీ, శిక్షణ, విద్య వంటి సూత్రాలు నేటి సహకార విధానాలకు మార్గదర్శక మయ్యాయి. ప్రపంచ స్థాయిలో సహకారాల సమన్వయానికి ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ అలయన్స్ అనే సంస్థ 1895లో ఏర్పడింది. ఇది ప్రస్తుతం 110 కంటే ఎక్కువ దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రపంచ సహకార వేదిక. ×జూ, ఐక్యరాజ్య సమితి సంయుక్తంగా 1995లో ప్రారంభించిన అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూలై మొదటి శనివారానికి కేటాయించింది. వాస్తవానికి ప్రపంచం లోని విపత్తుల సమయంలో, సహకార సంస్థలు తమ సభ్యులకు ఆర్థిక, మానసిక, వృత్తి పరంగా అండగా నిలిచిన ఉదాహరణలు అనేకం. భారత దేశంలో సహకార భావన వ్యవస్థీకృతంగా 1904లో బ్రిటిష్ ప్రభుత్వం రూపొందించిన సహకార క్రెడిట్ సంఘాల చట్టంతో ప్రారంభమైంది. తర్వాత 1912, 1969, 2002లో అనేక చట్టాలు రూపు దిద్దు కున్నాయి. స్వాతంత్ర్యానంతరం సహకార ఉద్యమానికి కొత్త ఊపొచ్చింది. గ్రామీణ వ్యవసాయ అభివృద్ధికి, ప్రజల ఆర్థిక స్వావలంబనకు ఇది కేంద్ర బిందువుగా నిలిచింది. 1954లో భారత ప్రభుత్వం సహకారాలను అభివృద్ధికి కీలక పునాది చేసుకోవాలని నినాదించింది. 1991 తర్వాత ఉదారీకరణ వల్ల కొన్ని సహకార సంస్థలు వెనకబడ్డా.. నేటికీ ఈ వ్యవస్థ ఎంతో మంది చిన్న రైతులకు, కార్మికులకు, మహిళలకు, గృహనిర్మాణ సంఘాలకు మార్గదర్శకంగా నిలుస్తోంది.

సహకార ఉద్యమానికి శాశ్వత గుర్తింపు నిచ్చిన మహానుభావుడు డాక్టర్ వర్గీస్ కురియన్. ఆయనే భారత పాల విప్లవానికి శిల్పి. అమూల్ అనే గుజరాత్ పాల సహకారాన్ని స్థాపించి దేశ వ్యాప్తంగా లక్షలాది గోరక్షక రైతులను ఆర్థికంగా నిలబెట్టాడు. భారత్‌ను ప్రపంచ అగ్ర పాల ఉత్పత్తి దేశంగా తీర్చిదిద్దాడు. ఆయన చూపించిన సహకార నమూనా వ్యవసాయం, డెయిరీ రంగాల లోనే కాదు, గ్రామీణ అభివృద్ధి లోనూ ఆదర్శంగా నిలిచింది. లాభం కోసం కాదు, సభ్యుల సంక్షేమం కోసం సాగే కార్యకలాపాలే అసలైన సహకార లక్ష్యంగా ఆయన విశ్వసించాడు. ఇక ప్రాంతీయ స్థాయిలోనూ సహకార విజయాల కోసము ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. మహారాష్ట్రలోని షుగర్ కోఆపరేటివ్‌లు గ్రామీణ ఆదాయాన్ని పెంచే వనరులుగా మారాయి. గుజరాత్‌లో అమూల్, బనాస్కాంతా, మేహసానా డెయిరీలు ప్రపంచ స్థాయిలో నిలిచాయి. కేరళలో "కుడుంబశ్రీ" సహకార వేదికలుగా మహిళా సాధికారతకు మార్గం చూపుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విజయ డెయిరీ, తిరుమల డెయిరీ సహకార డెయిరీలు రైతుల పక్షంగా నిలుస్తున్నాయి. అలాగే గ్రామీణ బ్యాంకింగ్, పాడి పరిశ్రమ, గృహ నిర్మాణ సహకారాలు వేలాది కుటుంబాలకు జీవనాధారం అయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా 3 మిలియన్లకు పైగా సహకార సంస్థలు ఉన్నాయంటేనే వాటి ప్రభావాన్ని అంచనా వేసుకోవచ్చు. ఇవి 12 కోట్ల మందికి పైగా ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నాయి. భారత్‌లో 8 లక్షలకు పైగా సహకార సంస్థలు, 30 కోట్లకు పైగా సభ్యులతో ఈ రంగం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లా సహకార బ్యాంకులు, గృహనిర్మాణ సంఘాలు, మార్కెటింగ్ సహకార సంస్థలు – ఇవన్నీ సామూహిక శక్తిని ఎలా ప్రదర్శించగలవో చూపిస్తున్నాయి. 2021లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సహకార మంత్రిత్వ శాఖ ఈ రంగాన్ని మరింత బలోపేతం చేస్తోంది. దీని ద్వారా సహకార సంఘాల మధ్య సమన్వయం, పారదర్శకత, నూతన పునరాగమనం సాధ్యమవుతోంది. సహకార రంగంలో డిజిటల్ పరిష్కారాలు, నూతన ప్రణాళికలు అమలవుతున్నాయి. ముఖ్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను మల్టీ–సర్వీస్ సెంటర్లుగా అభివృద్ధి చేయడం, ఉత్పత్తి–వితరణలో వాటి పాత్ర పెంపు వంటి కార్యక్రమాలు సాగుతున్నాయి.

వ్యక్తిగత ప్రయోజనం కన్నా సమిష్టి ప్రయోజనం గొప్పదని ఈ దినోత్సవం మనకు గుర్తుచేస్తుంది. సహకార సంస్థలు మనకు నేర్పిన పాఠం – నమ్మకం, సమానత్వం, పరస్పర సాయంతో ముందుకు సాగటం. ఈ విలువలను మన జీవితాల్లో పాటించి, సహకార ఉద్యమాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన అవసరం నేడు మరింత ఎక్కువగా ఉంది. సహకారం అనేది కేవలం సంస్థ వ్యవస్థ మాత్రమే కాదు – అది జీవన పద్ధతి. మనం జీవన విధానాన్ని మార్చు కుంటేనే సమాజంలో స్థిరత్వం, సమానత్వం, సాధికారత సాధ్యం అవుతుంది. జూలై 5న జరుపుకునే అంతర్జాతీయ సహకార దినోత్సవం మనకు ఓ మార్గదర్శకం. ఇది మనకు సామూహిక శక్తిని గుర్తు చేస్తుంది. సమాన హక్కులు, నైతిక విలువలు, ప్రజా పాలన, ఆత్మనిర్భరత అనే లక్ష్యాలవైపు మన ప్రయాణాన్ని మళ్లిస్తుంది. సహకారం అనేది సమాజాన్ని అంధకారం నుంచి వెలుగులోకి తీసుకెళ్లే శక్తివంతమైన సాధనం. ఈ దినోత్సవం సందేశం ౦ "ఒక్కడే కాదు%ౕ% పలువురు కలిసినప్పుడు మార్పు సాధ్యం.. సహకారమే శాశ్వత అభివృద్ధికి మార్గం".

# నీట్ యూజీ 2025 ఫలితాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటీషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ జూలై 4 : నీట్ యూజీ–2025 ఫలితాలను మళ్లీ రిలీజ్ చేయాలని కోరుతూ దాఖలైన పిటీషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఓ ప్రశ్నలో తప్పు తలెత్తిన నేపథ్యంలో ఆ ఫలితాలను మళ్లీ ప్రచురించాలని కోరుతూ పిటీషన్ దాఖలైంది. జస్టిస్ పీఎస్ నర్సింహా, ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్‌పై తీర్పునిచ్చింది. రెండు రోజుల క్రితమే ఇలాంటి పిటీషన్‌ను తిర్కసరించినట్లు ధర్మాసనం తెలిపింది. వ్యక్తిగత పరీక్షలతో డీల్ చేయలేదని కోర్టు చెప్పింది. మల్టిపుల్ కరెక్ట్ ఆన్సర్లు ఉన్న విషయాన్ని అంగీకరిస్తామని, కానీ లక్షల మంది రాసిన పరీక్షల్లో జోక్యం చేసుకోలేమని, ఇదేమీ వ్యక్తిగ కేసు కాదు అని, వేల మంది విద్యార్థులు దీని వల్ల ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్నట్లు సుప్రీంకోర్టు చెప్పింది.నీట్ యూజీ పరీక్ష పత్రంలో తప్పుడు ప్రశ్న వచ్చిందని, ఆ తప్పును సరి చేసి, మళ్లీ ఫలితాలను రిలీజ్ చేయాలని కొందరు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కౌన్సింగ్ ప్రక్రియను ఆపేందుకు స్టే ఇవ్వాలంటూ కోర్టును కోరారు. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ ప్రవేశ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

# రాహుల్ చేసిన ద్రోహంపై నిలదీసేందుకు వచ్చిన నిరుద్యోగులను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ జూలై 4 : ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన ద్రోహంపై నిలదీసేందుకు వచ్చిన నిరుద్యోగులను అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో సచివాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఊదరగొట్టిన సీఎం రేవంత్ రెడ్డికి నిరుద్యోగుల కష్టాలు కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు.అశోక్ నగర్ చౌరస్తాలో రాహుల్ గాంధీని పిలిపించి మరీ నిరుద్యోగులతో చాయ్ పే చర్చ పెట్టిన రేవంత్‌కు గద్దెనెక్కిన తరువాత జాబ్ క్యాలెండర్ అసలు గుర్తే లేదా..? చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు తెలంగాణ వ్యాప్తంగా అనేక జిల్లాల్లో నిరుద్యోగులు హైదరాబాద్ రాకుండా ముందుగానే నిర్బంధించడమే దారుణమైతే, ఇవాళ సచివాలయానికి గోడు చెప్పుకునేందుకు వచ్చిన వారిని కూడా అరెస్టు చేయడం దుర్మార్గం అని కేటీఆర్ మండిపడ్డారు.యూత్ డిక్లరేషన్ పేరిట ఢిల్లీ పెద్దలను పిలిపించి మరీ మోసం చేసిన రేవంత్ ఏడాదిన్నర కాలంలో పట్టుమని పదివేల ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వకపోవడం నిరుద్యోగులకు వెన్నుపోటు పొడవడమే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రక్రియ పూర్తి చేసిన 60 వేల ఉద్యోగాలకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి చేతులు దులుపుకున్న చేతకాని ముఖ్యమంత్రిని నిరుద్యోగులు ఎప్పటికీ క్షమించరు. ఓవైపు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలు ఇంకెప్పుడు అని నిరుద్యోగులు ఎదురుచూస్తుంటే, మరోవైపు నిరుద్యోగులు నోటిఫికేషన్లే వద్దంటున్నారని బుకాయించడం కాంగ్రెస్ సర్కారు దిగజారుడుతనానికి నిదర్శనం అని కేటీఆర్ ఫైర్ అయ్యారు.ఏడాదిలోనే జాబ్ క్యాలెండర్‌లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని మాటిచ్చి మోసం చేసిన ముఖ్యమంత్రికి నిరుద్యోగుల ఉసురు తగలడం ఖాయం. చలో సచివాలయం కార్యక్రమాన్ని చేపట్టిన నిరుద్యోగులను అక్రమంగా అరెస్టుచేసి వారి గొంతులు నొక్కలేరు. వెంటనే వారందరినీ బేషరతుగా విడుదల చేసి ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను ఇప్పటికైనా నిలబెట్టుకోవాలి. లేకపోతే రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించి రేవంత్ సర్కారు మెడలు వంచుతాం.. కాంగ్రెస్ సర్కారు చేసిన ద్రోహాన్ని గడపగడపకూ తీసుకెళ్లి ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని దోషిగా నిలబెడతాం అని కేటీఆర్ హెచ్చరించారు.

# ఆత్మనిర్భర్ కు కోల్ ఇండియా అధిక ప్రాధాన్యం: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్ జూలై 4 : ఆత్మనిర్భర్ కు కోల్ ఇండియా అధిక ప్రాధాన్యం ఇస్తోందని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఖనిజాల ఉత్పత్తిలో కోల్ ఇండియా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కోల్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో కిషన్ రెడ్డి ప్రసంగించారు. స్థానికల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా కోల్ ఇండియా చర్యలు చేపట్టిందని, అత్యాధునిక సాంకేతికత వినియోగించి ఖనిజాల ఉత్పత్తి జరుగుతుందని తెలియజేశారు. ఖనిజాల తవ్వకంలో కోల్ ఇండియా పారదర్శకంగా వ్యవహరిస్తోందని, 500 మినరల్స్ బ్లాక్స్ లో లీజ్ రెన్యువల్ సులభతరం చేసిందని చెప్పారు. లీజ్ రెన్యువల్ కు సింగిల్ విండో సిస్టం అందుబాటులోకి తెచ్చిందని, అరుదైన ఖనిజాల ఉత్పత్తిలోకి కోల్ ఇండియా అడుగు పెట్టిందని కిషన్ రెడ్డి ప్రశంసించారు.

# రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి కుట్రలు..

మొదటి పేజీ తరువాయి

పెట్టుబడి సాయం కోసం కేవలం తొమ్మిది రోజుల్లో 9,000 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేశాం అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. సన్నధాన్యం సాగు చేసే రైతులకు ప్రోత్సాహకంగా క్వింటాకు 500 చొప్పున బోనస్ చెల్లించాం, రైతుల ఖాతాలో డబ్బులు వేశామని తెలిపారు.రాష్ట్రంలోని 42 లక్షల మంది రైతాంగ సోదరులకు ఇన్సూరెన్స్ కోసం రైతుల పక్షాన ప్రభుత్వమే 2,181 కోట్లు చెల్లించిందని తెలిపారు. అకాల వర్షాలతో పంట నష్టం జరిగితే పది సంవత్సరాలపాటు పరిపాలించిన టిఆర్ఎస్ నేతలు పట్టించుకోలేదు కానీ ప్రజా ప్రభుత్వం రాగానే 260 కోట్లు విడుదల చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకువచ్చింది ఈ పథకం కింద రాష్ట్రంలో 29 లక్షల పంప్ సెట్ల గాను రైతుల పక్షాన ప్రభుత్వం ఇప్పటివరకు 17 వేల కోట్లు విద్యుత్ సంస్థలకు కట్టింది అన్నారు. భూమిలేని నిరుపేద ప్రజానీకానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ప్రతి సంవత్సరం 12,000 వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. చేయూత పథకం కింద వివిధ రకాల పెన్షన్ దారులకు 43 లక్షల మందికి ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం 17,958 చెల్లించిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి పేదవానికి ఇల్లు ఉండాలన్న ఆలోచనతో ఐదు లక్షల రూపాయలు వెచ్చించి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నామని తెలిపారు. మొదటి దశలో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్ల చొప్పున 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం అన్నారు.

200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ వాడుకునే గృహజ్యోతి పథకంతో ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోని 80% మందికి కరెంటు బిల్లు కట్టే పని లేకుండా పోయింది అన్నారు. గృహ జ్యోతి పథకం కింద పేదల పక్షాన ప్రభుత్వం 2,110 కోట్లు విద్యుత్ సంస్థలకు చెల్లించిందని డిప్యూటీ సీఎం తెలిపారు. 500 కే ఎల్పిజి గ్యాస్ సిలిండర్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 641 కోట్లు పేదల పక్షాన గ్యాస్ సంస్థలకు చెల్లించిందని తెలిపారు. పేదలు, బడుగు బలహీన వర్గాలు అనారోగ్యానికి గురైతే వైద్యం అందక ఇబ్బందులు పడొద్దు అనే ఉద్దేశంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ ఐదు లక్షల పరిమితిని 10 లక్షలకు పెంచాం, ఈ పథకం కింద రాష్ట్రంలోని 93 లక్షల కుటుంబాలకు ఉచితంగా వైద్య సహాయం అందుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వడ్డీ లేని రుణాలను ద్వాక్రా మహిళలకు పంపిణీ చేస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి సంవత్సరం 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు అందించాం అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 93 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుంది పేదల పక్షాన ప్రభుత్వమే ఈ పథకం కోసం 13,500 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. నిరుపేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభిస్తున్నాం, ఒక్కో పాఠశాలను 25 ఎకరాల్లో 200 కోట్లు వెచ్చించి నిర్మిస్తున్నామని తెలిపారు. ఒకేసారి 105 స్కూల్స్ మంజూరు చేశాం రాష్ట్ర చరిత్రలో ఈనాడు ఇలాంటి సంఘటనలు జరగలేదని తెలిపారు. అటవీ హక్కుల చట్టం కింద రాష్ట్రంలోని పేద గిరిజనులకు 6.70 లక్షల ఎకరాలను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేయగా ఆ భూములన్నిటిని సాగులోకి తెచ్చేందుకు ఇందిరా సౌర గిరిజన వికాస పథకం కింద 12,500 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు ఈ పథకం కింద గిరిజన రైతులకు సోలార్ పంప్ సెట్లు, డ్రిప్పు, స్ప్రింక్లర్లను ఏర్పాటుచేసి ఉద్యాన పంటలు సాగు చేసేందుకు మొత్తం ఉచితంగా రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. కేవలం సంవత్సరంన్నర కాలంలో ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తట్టుకోలేక ఏడుస్తూ విమర్శలు చేసే వారి గురించి కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికి ప్రచారం చేయాలి, ప్రజల కోసమే ఈ ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

# అసలు మీరు అధికారంలోకి ఎలా వస్తారో మేమూ చూస్తాం ..

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్ట్రాంగ్ వార్నింగ్



అమరావతి జూలై 4 బీవైసీపీ నాయకులకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. 2029లో అధికారంలోకి వస్తే కూటమి నాయకుల అంతుచూస్తామని వైసీపీ నాయకులు అంటున్నారని ఆయన ప్రస్తావించారు. అసలు మీరు అధికారంలోకి రావాలి కదా.. మీరు అధికారంలోకి ఎలా వస్తారో మేమూ చూస్తామని హెచ్చరించారు. ప్రకాశం జిల్లా నరసింహపురంలో తాగునీటి పథకానికి పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. వైసీపీ నాయకులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా కూటమి పార్టీల మధ్య విబేధాలపై పవన్ కల్యాణ్ స్పందించారు. కూటమిలో తనకు, చంద్రబాబుకు మధ్య స్పష్టత ఉందని తెలిపారు. ఎవరి పాత్ర ఏంటనేది తమకు స్పష్టంగా తెలుసని అన్నారు. కూటమిలో కొన్ని విబేధాలు ఉంటే ఉండొచ్చని.. నాయకులు తిట్టుకుంటూ పొడుచుకుంటూ ఉండకూడదని సూచించారు. తమపై ఎంతో నమ్మకంతో ఏపీ ప్రజలు బాధ్యత పెట్టారని తెలిపారు. కూటమిలో ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ కాదని అన్నారు. ఒకరిని ఒకరు గౌరవించుకోవాలని సూచించారు. తాము ఏ పార్టీని తగ్గించి మాట్లాడలేదని స్పష్టం చేశారు. అన్ని వేళ్లు ఒకలా ఉండవని.. కానీ అన్ని వేళ్లూ కలిస్తేనే పిడికిలి అని తెలిపారు.వ్యక్తిగతంగా తనకు ఎవరిపై కక్ష ఉండదని పవన్ కల్యాణ్ తెలిపారు. గత ప్రభుత్వం జల జీవన్ మిషన్‌ను పట్టించుకోలేదని అన్నారు. రౌడీయిజం, గూండాయిజంతో భయపెట్టి వేధించారని ఆరోపించారు. మంచినీటిని అందించాలన్న ధ్యాస కూడా గత పాలకులకు లేదని విరుచుకుపడ్డారు. గత పాలకులు లక్షల కోట్లు అప్పులు పెడితే వాటన్నింటినీ తట్టుకుని ఇవాళ ముందుకెళ్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో ఎక్కడ ఖాళీ భూములు కనిపించినా వాటిని దోచేశారని ఆరోపించారు. ఆక్రమణకు గురైన ఆలయ భూములను తిరిగి వెనక్కి తీసుకునే ప్రక్రియ ప్రారంభించామని, వాటికి రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని స్పష్టం చేశారు.

# సమరభేరి సక్సెస్ తో కాంగ్రెస్ క్యాడర్ లో నయా జోష్

**సామాజిక న్యాయ సమరభేరి సభ గ్రాండ్ సక్సెస్..**
**జన సంద్రంగా మారిన హైదరాబాద్..**
**50 వేలకు పైగా పాల్గొన్న గ్రామ కాంగ్రెస్ నేతలు...**
**ట్రాఫిక్ జామ్ సభస్థలికి చేరుకోలేకపోయిన వందలాది వాహనాలు.**
**సామాజిక న్యాయం నినాదాన్ని జనంలోకి తీసుకెళ్లడంలో కాంగ్రెస్ సక్సెస్**
**అంతా తానై నడిపించిన టీపీసీసీ చీఫ్..**



తెలంగాణ కాంగ్రెస్ నేతృత్వంలో ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన సామాజిక న్యాయ సమరభేరి సభ విజయవంతంగా ముగిసింది.
టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు వేలాదిగా గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరై ప్రాంగణాన్ని జనసంద్రంగా మార్చారు.
ఈ సభకు ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు రాష్ట్ర మంత్రులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని, నైతిక బలాన్ని ఈ సభ మరోసారి రుజువు చేసినట్లైంది. గ్రామీణ స్థాయి నుండి వందలాది బస్సులు, వాహనాల్లో కార్యకర్తలు సభకు తరలివచ్చారు.
ప్రతి నియోజకవర్గం నుండి బండి వెనుక బండి కట్టి తరలివచ్చిన తీరుతో సభకు విశేష ఆకర్షణగా నిలిచింది.
సభ సక్సెస్ చేసేందుకు పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముందుగానే ఉపాధ్యక్షులను, ప్రధాన కార్యదర్శులను నియోజక వర్గాలకు బాధ్యులుగా నియమించి క్షేత్రస్థాయి పరిశీలన చేయడంతో విజయవంతం అయిన సభ..

ఈ సభ విజయవంతం కావడంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పాత్ర ముఖ్యమైంది. అధ్యక్ష హెూదాలో తొలి భారీ సభను ఘనంగా



నిర్వహించి తన నాయకత్వ ప్రతిభను చాటారు. సభలో మల్లికార్జున్ ఖర్గే, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, మహేష్ గౌడ్ ప్రసంగాలు హైలెట్‌గా నిలిచాయి. ప్రజల సమస్యలు, సామాజిక న్యాయం పట్ల కాంగ్రెస్ నిబద్ధతను వారు స్పష్టంగా వ్యక్తీకరించారు. మొత్తం మీద సామాజిక న్యాయభేరి గ్రాండ్ సక్సెస్ తో హస్తం పార్టీ నేతల్లో జోష్ నెలకొంది.

**సామాజిక న్యాయ సమరభేరి సభలో టీపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ**
మల్లికార్జున ఖర్గే చాలా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది..
దేశ రాజకీయాల్లో ఇద్దరు సీనియర్ లు ఉన్నారు అందులో ఒకరు శరద్ పవర్ మరొకరు మల్లికార్జున ఖర్గే.
కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుతం నాయకత్వం వహిస్తున్న ప్రజానాయకుడు, పోరాటానికి ప్రతీక, వెనుకబడిన వర్గాలకు ప్రేరణ మల్లికార్జున్ ఖర్గే గారు
సామాన్య స్థాయి నుంచి పార్టీ అత్యున్నత స్థాయికి చేరిన ఖర్గే గారి జీవితం కృషి, నిబద్ధత, అంకితభావానికి చిరుజ్ఞానం
కర్ణాటకలోని బీదర్‌లో ఒక దళిత కుటుంబంలో జన్మించిన ఖర్గే గారు, బాల్యంలోనే మత కలహాల్లో తల్లిని కోల్పోయారు. ఆ ఘటన ఆయనను జీవితాంతం సెక్యులరిజం, సామాజిక న్యాయం, సామరస్యానికి ప్రతీకగా నిలిచేలా మలిచింది. విద్యార్థి దశ రాజకీయాలు, కార్మిక సంఘాల ఉద్యమాల వరకు ఖర్గే గారు ఎప్పుడు కూడా ప్రజలతో సంబంధాలను కొనసాగిస్తూ వస్తున్నారు
ఖర్గే గారు వరుసగా తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా, అనంతరం లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా ఎన్నుకోబడ్డారు. రైల్వే, కార్మిక, సామాజిక న్యాయం వంటి కీలక 'సొలిల్లద సర్దార"గా గుర్తింపు పొందిన ఖర్గే గారు ప్రజానాయకుడిగా.. పార్టీ పట్ల అంకితభావానికి ప్రతీకగా నిలిచారు.
దేశ చరిత్రలో మొదటిసారిగా గ్రామ స్థాయి అధ్యక్షులు మొదలుకొని రాష్ట్ర స్థాయి కార్యవర్గ సభ్యులకు దిశా నిర్దేశం చేయడానికి ఖర్గే వచ్చారు



కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి కార్యాక్రమానికి విచ్చేసిన ఆల్ ఇండియా కాంగ్రెస్ కమీటీ అధ్యక్షులు మల్లిఖార్జున్ కార్గే ని మర్యాదపూర్వకంగా కలిసిన ఖైరతాబాద్ శాసన సభ్యులు దానం నాగేందర్



**లక్డీకాపూల్ లో మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ,సీఎం రేవంత్ రెడ్డి ,డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్,మంత్రులు శ్రీధర్ బాబు,కోమటిరెడ్డి వెంకటరెడ్డి,పొన్నం ప్రభాకర్,రోశయ్య కుటుంబ సభ్యులు.**



శుక్రవారంనాడు శ్రీకాంత్ యాదవ్ టీపీసీసీ మీడియా కోఆర్డినేటర్ నేతృత్వంలో యాసీన్ ,ఖదీర్ ,దాసరి రాజ్ కూమార్ సన్నీ రెడ్డి తదితరులతో ఎల్బీ స్టేడియంలో ఈరోజు కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గోన్నారు.



శుక్రవారంనాడు ఎల్బీ స్టేడియంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి లో పాల్గోన్న శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తదితరులు పాల్గోన్నారు

# కార్మికులకు మరణశాసనం లేబర్‌కోడ్స్

1991లో వచ్చిన సరళీకృత ఆర్థిక విధానాలు, కేంద్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేక వైఖరి, ప్రయివేటీకరణ పోకడల్ని నిరసిస్తూ, కార్మిక హక్కుల్ని కాపాడటం కోసం పది కేంద్ర కార్మిక సంఘాలు నాటి నుండి నేటి వరకు దేశవ్యాప్తంగా 21 సమ్మెలు నిర్వహించాయి. ప్రధాన రంగాల ప్రయివేటీకరణ, విదేశీ పెట్టుబడి ఆహ్వానాన్ని వ్యతిరేకిస్తూ మొదటి దేశవ్యాప్త సమ్మె 29 నవంబర్ 1991లో మొదలైంది. కార్మికులకు అధిక వేతనాలు, సామాజిక భద్రత కల్పించడం, కార్మిక చట్టాల్లో సంస్క రణలకు వ్యతిరేకంగా జరిగిన దేశవ్యాప్త సమ్మెల్లో కార్మికులు ప్రతియేటా పాల్గొంటు న్నారు. అంతేకాక ఉద్యోగ భద్రత, పెన్షన్ హక్కును డిమాండ్ చేస్తూ కార్మికులు సమ్మెలు నిర్వహిస్తున్నారు. 2020 నవంబర్ 26న జరిగిన దేశవ్యాప్త సమ్మెలో 25 కోట్ల మంది అనగా 250 మిలియన్ల కార్మికులు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమ్మె ద్వారా తమ నిరసన తెలియజేశారు. ఇది ప్రపంచంలో జరిగిన అతిపెద్ద సమ్మెల్లో ఒకటని జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలు అభివర్ణించాయి. 2019 జనవరి 8-9 తేదీల్లో జరిగిన రెండు రోజుల సమ్మె, 2022 మార్చి 28-29 తేదీల్లో జరిగిన సమ్మెలు, బ్యాంకింగ్, రవాణా, ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రభావితం చేశాయి. కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక కార్మికుల హక్కుల కోసం పోరాడే శక్తివంతమైన వేదికగా నిలుస్తున్నది. జులై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె కూడా అందులో భాగం కానుంది.

ప్రస్తుతం మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులను బానిసత్వంలోకి నెట్టి వేసే లక్ష్యంతో 29 కార్మిక చట్టాల్ని రద్దు చేసి, వాటిస్థానంలో నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేసేందుకు అడుగులు వేస్తున్నది. ఫ్యాక్టరీల్లో, పని ప్రదేశంలో యూనియన్లు లేకుండా చేయటమే లక్ష్యంగా, కార్మికవర్గాన్ని నిరాయుధుల్ని చేయడమే ధ్యేయంగా ఈ లేబర్ కోడ్స్ అని స్పష్టమవుతున్నది. 2002లో అప్పటి వాజ్‌పారు ప్రభుత్వం 2వ లేబర్ కమిషన్‌ను రవీంద్రవర్మ నేతృత్వంలో నియమించి 44 కార్మిక చట్టాల స్థానంలో లేబర్ కోడ్స్‌ను తీసుకురావాలని ప్రతిపాదించింది. ప్రస్తుత మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, చట్టవిరుద్ధ విధానాలు దాదాపు అన్ని కూడా 2వ లేబర్ కమిషన్ సిఫార్సులను పోలి ఉండటాన్ని గమనిస్తే అప్పటినుండి యజమానులకు అనుకూలంగా, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాయ పూనుకున్నదన్న విషయం అవగతమవుతున్నది. 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వానికి వామపక్ష పార్టీల సహకారం ఉండటం వల్లన లేబర్‌కోడ్స్‌ను తీసుకురావడానికి వెనుకడుగు వేసింది. 2014లో తిరిగి అధికారంలోకి వచ్చిన బీజేపీ నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చి వాటి ప్రక్రియను ప్రారంభించింది. కార్మిక సంఘాల సమ్మెలు, పోరాటాల వలన వెంటనే అమలు చేయడానికి ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. 2019లో మూడోసారి అధి కారం చేపట్టిన తర్వాత పార్లమెంట్‌లో వేతనాల కోడ్‌ను పాస్ చేయించుకుంది. 2020లో మిగిలిన మూడు పారిశ్రామిక సంబం ధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్స్‌ను ఆమోదించుకుంది. మూడు వ్యవ సాయ నల్లచట్టాలు పార్లమెంటులో ప్రవేశపెట్టగా అప్పటి ప్రతిపక్ష పార్టీల పార్లమెంట్ సభ్యులు వాటికి నిరసనగా వాకౌట్ చేసిన సమయంలో ఈ లేబర్ కోడ్స్‌ను దొడ్డిదారిలో ఆమోదింపజేసుకుంది.

ఈ లేబర్‌కోడ్స్‌ను సరిగ్గా పరిశీలిస్తే కార్మిక వర్గంపై ప్రత్యక్ష దాడిచేసి వారి హక్కుల్ని హరించేందుకు ఉద్దేశించిన విధంగా ఇవి రూపొందించబడ్డాయి. దేశ సహజ వనరులను, ప్రజలను దోచుకోవడానికి, కార్పొరేట్ యాజమా న్యాలకు లాభాలు కట్టబెట్టడానికి, కార్మికులను మరింత దోపిడీ చేసేలా ఉన్నాయి. ఈ ప్రమాదాన్ని పసిగట్టిన కార్మికులు, సంఘాలు కార్మికులతో కలిసి నిరంతర పోరాటాలు, ఆందోళనలు, ప్రతిఘటనలు చేయడం వల్ల ఈ నాలుగేండ్ల నుంచి ఈ లేబర్‌కోడ్స్‌ని అమలు చేయటంలో కేంద్రం కాస్త వెనుక్కు తగ్గింది. అయితే 2025లో ఈ లేబర్ కోడ్స్‌ను ఎలాగైనా అమలు చేయలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. ఇప్పటికే మోడీ ప్రభుత్వం "జన విశ్వాస్" అనే చట్టంలోని నిబంధనల ప్రకారం అనేక చట్టాల కింద కార్పొరేట్లకు సంబంధించి 180 నేరాలను నేరరహితం చేసింది. ఈ చట్టాలను ఉల్లంఘించినందుకు యజమానులకు జైలు శిక్షలు విధించే నిబంధనలను ఈ లేబర్ కోడ్స్‌లో ఉపసంహరించింది. 2025 కేంద్ర బడ్జెట్‌లో కూడా మరో 100 నేరాలను నేర రహితం చేసింది. "శ్రమ సమాధాన్", "శ్రమ సువిధ పోర్టల్"లు యజమానులు కార్మిక చట్ట ఉల్లంఘనలను సులభతరం చేయడానికి, ఫిర్యాదు ఆధారిత తనిఖీలను ఈ లేబర్ కోడ్స్ ద్వారా రద్దు చేసింది.

మరోవైపు కార్మికులు పోరాడి సంపాదించు కున్న హక్కులను కాలరాస్తూ సమిష్టి బేరసారాల చర్యలను లేబర్‌కోడ్స్ తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నది. కార్మికులు వారి సంఘాలు సమిష్టిగా ఫిర్యాదు చేయడం లాంటి వాటిని వ్యవస్థీకృత నేరంగా పరిగణించాలని పేర్కొంటు న్నది. ఫలితంగా నాన్ బెయిలబుల్ శిక్షలతో సహా పోలీసు చర్యలకు దారి తీసే ప్రమాదం కూడా ఉంది. ఈ లేబర్ కోడ్స్ అమలు చేయడానికి ముందుగానే గేట్ మీటింగులు, డిపార్ట్‌మెంటల్ సమావేశాలు, కరపత్రాల పంపిణీ, మెమొరాం డాలు అందజేయటం లాంటి ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను, హక్కులను ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల్లో, సంస్థల్లో ఇప్పటికే నిషేధించింది. ఫిక్స్‌డ్ టర్మ్ ఉపాధిని తీసుకురావడం ద్వారా ఉద్యోగ భద్రతతో పాటు అనేక సౌకర్యాలు అందచేయకుండా చూడటమే దీని ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తున్నది. శాశ్వత ఉద్యోగి, ఉపాధి అనేది ఒకప్పటి విషయం. ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్, అప్రెంటీస్‌లు, ఇంటర్న్‌షిప్‌లు మొదలైన విధానాల ద్వారా కార్మికులను కేంద్రం నియమిస్తున్నది. అంతేకాక ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ సౌకర్యాలను కూడా కార్మికులకు దూరం చేసే రూల్స్‌ను ఈ లేబర్‌కోడ్స్‌లో పొందుపరిచింది. ఇది ట్రేడ్ యూనియన్‌లను బలహీనపరచడానికి, యూనియన్లను తొలగించడానికే అనేది స్పష్టమవుతున్నది. దీనిద్వారా కార్మికుల్లో ఒక భయానక వాతావరణాన్ని సృష్టించే పథకం చాపకింద నీరులా మోడీ సర్కార్ అనుసరిస్తున్నది. లేబర్ కోడ్స్ అమలు అంటే మొత్తం పరిపాలనలో కార్పొరేట్ పెట్టుబడిదారీ వర్గం విధానాల అమలుకు ఎలాంటి అడ్డం కులు లేకుండా కొనసాగించుకోవడానికి, యథేచ్ఛగా లాభాలు ఆర్జించటానికేనన్నది స్పష్టమవుతున్నది. యూనియన్ల రహిత పని ప్రదేశాల ఏర్పాటు, కార్మికుల సమిష్టి చర్యలను నిర్వీర్యం చేసి వారిని నిరాయుధులను చేయడమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తున్నది. కార్మికుల హక్కుల్ని కాలరాసే మరణ శాసనాలుగా ఈ లేబర్‌కోడ్స్ పనిచేయ నున్నవి. అందుకే ఈనెల 9న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను గతంలో నిర్వహించిన సమ్మెల్లో ఒకటిగా చూడకూడదు. లేబర్ కోడ్స్ అమలును తీవ్రంగా తిప్పికొట్టడానికి ప్రతిఘటనా, పోరాటాల ప్రారం భంగా ఈ సమ్మెను చూడాలి. పెట్టుబడి దారీ విధానాన్ని తరిమేయడంలో కార్మిక వర్గం మరింత మెలకువతో ముందుండాలి. నయా ఉదార వాదానికి వ్యతిరేకంగా, ఐక్యపోరాటాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకుని వెళ్లాలి. ఈ సమ్మె రెండవ దశ పోరాటానికి ప్రారంభం మాత్రమేనని దేశ ప్రజానీకానికి తెలియజేయాలి.

# సుపరిపాలనలో పవన్ ఎక్కడ

విజయవాడ, జూలై 4, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఏడాది గడుస్తున్నా ఇంత వరకూ తన పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం కాలేదు. జనసేన ఆవిర్భావ సభలో వారిని వేదికపై కలవడమే తప్పించి అడపా దడపా అప్పుడప్పుడు వేర్వేరుగా కలుస్తున్నారు తప్పించి పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశాన్ని ఏర్పాటు చేయలేదు. నియోజకవర్గంలో వారికి ఎదురవుతున్న ఇబ్బందులతో పాటు ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపై కూడా ఫీడ్ బ్యాక్ తీసుకునే ప్రయత్నం చేయకపోవడం ఇప్పుడు జనసేనలో చర్చనీయాంశంగా మారింది. టీడీపీ అధినేత చంద్రబాబు వరసగా పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమవుతూ వారికి కార్యక్రమాలను ఇస్తూ క్షేత్రస్థాయిలో యాక్టివ్ చేస్తుంటే పవన్ కల్యాణ్ మాత్రం ఆ పనికి పూనుకోకపోవడాన్ని కొందరు నేతలే ప్రశ్నిస్తున్నారు. 2024 లో జరిగిన ఎన్నికల్లో జనసేన హండ్రెడ్ పర్సెంట్ సక్సెస్ రేట్ సాధించింది. 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసి విజయం సాధించింది. అయితే అనేక చోట్ల తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జులతో జనసేన ఎమ్మెల్యేలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల వారి మాటలను అధికారులు కూడా వినడం లేదన్న వార్తలు వస్తున్నాయి. నియోజకవర్గంలో ఉన్న నామినేటెడ్ పదవులను కూడా తమ ప్రమేయం లేకుండా టీడీపీ నేతలు భర్తీ చేసుకుంటున్నారని కొందరు నేరుగానే ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యేల నుంచి క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అడిగి తెలుసుకుని వాటిని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత పవన్ కల్యాణ్ పైనే ఉంది. . కానీ పవన్ కల్యాణ్ మాత్రం నిత్యం బిజీగానే ఉంటున్నారు. తాను ఒక పార్టీ చీఫ్ అన్న విషయాన్ని మర్చిపోయి ఎమ్మెల్యేలతో టచ్ మి నాట్ గా వ్యవహరిస్తే జరుగుతున్న విషయాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నిస్తున్నారు. కేవలం కొందరు ఇచ్చే ఫీడ్ బ్యాక్ తోనే జనసేనాని ముందుకు వెళితే భవిష్యత్ లో రాజకీయంగా ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఎమ్మెల్యేలతో మూడు గంటల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడే తీరిక లేని పవన్ కల్యాణ్ ఇక రాజకీయాలు ఏం చేస్తారని సొంత పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యేలు ఎవరితో చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలని కోరుతున్నారు

## రాయచోటిలో స్లీపర్ సెల్స్...

కడప, జూలై 4, అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉగ్రవాదుల స్థావరాలపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. అబూబకర్ సిద్ధిఖీ, మహ్మద్ అలీ అనే ఇద్దరు ఉగ్రవాదులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి పేలుడు పదార్థాలు, మూడు నగరాల మ్యాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు 'అలూమా' అనే సంస్థకు చెందినవారని, దేశంలో పేలుళ్లకు కుట్ర పన్నారని డీఐజీ తెలిపారు. ఈ కేసులో వారి కుటుంబ సభ్యుల పాత్రపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. అసలు ఈ ఉగ్రవాదుల వెనుక ఎవరున్నారు?అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉగ్రవాదుల స్థావరాల ఏర్పాటు అంశం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంపై తాజాగా కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కీలక సమాచారం వెల్లడించారు. పోలీసులు ఈ అంశంపై దర్యాప్తు చేస్తున్నారని ఆయన తెలిపారు. తమిళనాడు ఐబీ పోలీసులు.. అబూబకర్ సిద్ధిఖీ, మహ్మద్ అలీ అనే ఇద్దరు ఉగ్రవాదులను రాయచోటిలో అరెస్టు చేశారు. 'అలూమా' అనే ఉగ్రవాద సంస్థకు చెందిన వీరు దేశంలోని మూడు నగరాల్లో పేలుళ్లకు కుట్ర పన్నినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం పోలీసులు ఈ కేసుకి సంబంధించి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.డీఐజీ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ.. రాయచోటిలో నిందితులకు సహకరిస్తున్న వారిపై విచారణ చేస్తున్నామని చెప్పారు. దాదాపు 50 ఐఈడీలు (పేలుడు పదార్థాలు) తయారు చేసేందుకు కావాల్సిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఐసిస్, అలూమా సంస్థలు ఒకే విధమైన ఆలోచనలతో పనిచేస్తాయని ఆయన అన్నారు. అలూమా అనేది దక్షిణ భారతదేశంలో అతిపెద్ద ఉగ్రవాద సంస్థ అని ఆయన పేర్కొన్నారు. తమిళనాడు పోలీసులు ఇచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తు కొనసాగుతోందని డీఐజీ పేర్కొన్నారు. రాయచోటిలో కొత్త వారిని చేర్చుకుని, వారికి శిక్షణ ఇచ్చినట్లు ఇప్పటివరకు నిర్ధారణ కాలేదని ఆయన స్పష్టం చేశారు.పేలుడు పదార్థాలు ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై విచారణ చేస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కేసుపై ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు కూడా పనిచేస్తున్నాయి. '20 ఏళ్లయినా చట్టం నుంచి తప్పించుకోలేరనడానికి ఇది నిదర్శనం" అని డీఐజీ అన్నారు. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత దేశంలో ముష్కర మూకల భరతం పడుతోన్న దర్యాప్తు సంస్థలు.. పలు కుట్రలను భగ్నం చేస్తున్నారు.ఉగ్రవాదుల కుటుంబ సభ్యులకు పేలుడు పదార్థాల గురించి తెలుసా? లేదా? అనే విషయంపై అనుమానాలు ఉన్నాయని డీఐజీ తెలిపారు. వారికి తెలిసే చేశారా లేదా అనేది విచారణలో తెలుస్తుందని ఆయన అన్నారు. సాంకేతిక నైపుణ్యం కలిగిన ఈ ఉగ్రవాదులు రాయచోటిలో స్థిరపడిన తర్వాత.. 2013 బెంగళూరు మల్లేశ్వరంలో జరిగిన పేలుళ్లలో వీరి ప్రమేయం ఉందని ఆయన చెప్పారు. నిందితుల నుంచి పేలుడు పదార్థాలతో పాటు ఫ్యూయల్ ఆయిల్ కలిపిన అమ్మోనియం నైట్రేట్, గన్ పౌడర్‌లు, దేశంలోని మూడు ప్రధాన నగరాలు, రైల్వే నెట్‌వర్క్‌ల మ్యాప్‌లు దొరికాయని ఆయన వివరించారు.అబూబకర్ సిద్ధిఖీ భార్య షేక్ సైరాభాను, మహ్మద్ అలీ భార్య షేక్ షమీమ్‌లపై కూడా పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో వారిని కడప కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ కేసుకి సంబంధించి పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# కొత్త స్ట్రాటజీలో జగన్



విజయవాడ, జూలై 4, వైసీపీ అధినేత వైఎస్ జగన్ వేగం పెంచారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తి కావడంతో ఇక జనంలోకి వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. అలాగే కొత్త నేతలకు కూడా అవకాశం కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీ నుంచి వెళ్లిపోయిన వారిని ఇక పార్టీలోకి తిరిగి తీసుకోకుండా వారి స్థానంలో యువనేతలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. అందులో భాగంగానే నిన్న జరిగిన పార్టీ యువజన విభాగం నేతలతో జరిగిన సమావేశంలో మంచి నేతలను గుర్తించి పార్టీలోకి తీసుకు రావాలని అనడం కూడా అందులో భాగమేనని అంటున్నారు. కొన్ని నియోజకవర్గాలలో ఇప్పటి వరకూ ఇన్ ఛార్జులను నియమించకపోవడంతో కొత్త వారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది.వైసీపీ ఖచ్చితంగా ఈ సారి అధికారంలోకి వస్తుందని భావిస్తున్న జగన్ అందుకు అనుగుణంగా కార్యకర్తలకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. యువజన విభాగాన్ని పటిష్టం చేయడంతో పాటు పార్టీ అనుబంధ విభాగాలను కూడా మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. కేసులకు భయపడి వెనుకంజ వేయవద్దని పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని భరోసా ఇస్తూ ఇక ఎఫెన్స్ లో వెళ్లేందుకు జగన్ నిర్ణయించుకుంటున్నట్లు తెలిసింది. అందుకే యువకులతో పాటు విద్యార్థి విభాగాన్ని కూడా బలోపేతం చేయడంతో పాటు మహిళ విభాగాన్ని కూడా మరింతగా శక్తిమంతం చేసి అధికార పార్టీకి కంటి మీద కునుకు లేకుండా చేయాలన్న యోచనలో ఉన్నారు.. త్వరలోనే వైఎస్ జగన్ వైసీపీ విద్యార్థి విభాగం, మహిళ విభాగం నేతలతో కూడా సమావేశం అయ్యే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరొక వైపు జగన్ తాను స్వయంగా సమస్యలపై జిల్లాలను పర్యటిస్తూ పార్టీకి మరింత హైప్ తేవాలని ప్రయత్నిస్తున్నారు. ఏ చిన్న అవకాశం వచ్చినా ఏ వర్గాన్ని దూరం చేసుకోకుండా దగ్గరకు తీసుకునే యత్నంలోనే జగన్ ఉన్నట్లు కనపడుతుంది. గుంటూరులో మిర్చిరైతులు, పొదిలిలో పొగాకు రైతులకు గిట్టుబాటు ధరల కోసం వెళ్లి వారితో మాట్లాడిన జగన్ తాజాగా ఈనెల 9న చిత్తూరు జిల్లా మామిడి రైతులతో కూడా సమావేశం కానున్నారు. ఇలా జిల్లా పర్యటనలతో పాటు మరొకవైపు పార్టీ అనుబంధ విభాగాలపై కూడా ఫోకస్ పెట్టారు. వైసీపీ సోషల్ మీడియా వింగ్ ను కూడా బలోపేతం చేసే దిశగా జగన్ ప్రయత్నాలు ప్రారంభించారు. సోషల్ మీడియా వారియర్స్ పై అక్రమ కేసులు పెడుతున్నారని, అయినా బెదరకుండా పనిచేసిన వారికి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతూ వస్తున్నారు. వైసీపీకి సోషల్ మీడియా బలం ఎక్కువ అన్న నేపథ్యంలో ఇటీవల అక్రమ కేసులతో కొంత వెనకబడి ఉండటాన్ని గమనించిన జగన్ ఆ దిశగా వారికి ధైర్యాన్ని కల్పించి, కేసులు వస్తే తాము అండగా ఉంటామని చెబుతున్నారు. మొత్తం మీద పార్టీ నేతలపై జగన్ ఆధారపడకుండా ఇక అనుబంధ విభాగాలను బలోపేతం చేసి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు కనపడుతుంది.

# ల్యాండ్ పూలింగ్.. కండిషన్స్ అప్లై...

విజయవాడ, జూలై4, ఏపీ రాజధాని అమరావతి కోసం కొత్తగా చేపట్టనున్న భూ సమీకరణకు నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాజధాని అభివృద్ధికి సీఆర్డీఏ పరిధిలో చేయనున్న భూ సమీకరణకు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత భూ సమీకరణ (రూపకల్పన, అమలు) నిబంధనలు 2025 గెజిట్లో నిబంధనలను నోటిఫై చేస్తూ ఏపీ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ జీఓ నంబర్ 118 జారీ చేశారు. రాజధాని అమరావతి పరిధిలోని 217 చదరపు కిలోమీటర్లు మినహా సి ఆర్ డి ఏ మొత్తం ప్రాంతానికి ఈ నిబంధనలు వర్తిస్తాయి. 2014లో అమరావతికి ప్రకటించిన నిబంధనలను దాదాపుగా తాజా భూసేకరణకు వర్తింపజేస్తున్నారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, అన్ని ఇతర అవసరమైన ప్రాజెక్టుల వంటి అవసరమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్మించడానికి, భూమి సేకరణ విధానం స్వచ్ఛంద పథకంగా రూపొందించారు. ఇది భూ యజమానులు, రాష్ట్రం/అధికార సంస్థ మధ్య పరస్పర ఏకాభిప్రాయం ఆధారంగా ఉంటుంది. ఇది భూమి సేకరణకు ఒక ప్రత్యేకమైన పద్ధతి 'ల్యాండ్ పూలింగ్ పథకం' అమలు చేస్తారు.ల్యాండ్ పూలింగ్ పథకం అనేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ రూపొందించిన పథకం, భూసేకరణ, పునరావాసం, పునరావాసంలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు చట్టం, 2013లోని సెక్షన్ 107 ఽ 108 కింద అనుమతి కారణంగా. ల్యాండ్ పూలింగ్ పథకంలో పాల్గొనే భూ యజమానులు అప్పగించిన కారణంగా, ం‌ఖ అఖీఆం చట్టం, 2014లోని సెక్షన్ 48(1) కింద రాష్ట్రం/అధికారికి ప్రాతినిధ్యం వహించే కాంపిటెంట్ అథారిటీ ఇచ్చిన అంగీకారంతో అందించిన భూమిలోని టైటిల్ రాష్ట్రం/అధికారానికి అనుకూలంగా బదిలీ కానుంది. ంఖ అఖీఆం చట్టం, 2014లోని సెక్షన్ 43(4)(జీ) కింద అంగీకరించిన అభివృద్ధి పథకం ప్రకారం, పునర్నిర్మించిన ప్లాట్‌ను అదే ప్రాంతంలో లేదా ఏదైనా ఇతర సమీపంలో భూమి యజమానికి అనుకూలంగా కేటాయించనున్నారు. చట్టంలోని సెక్షన్ 43(5) ఽ (6) ప్రకారం ల్యాండ్ పూలింగ్ పథకం కోసం ఏదైనా ప్రాంతం ఉద్దేశ్యాన్ని ప్రభుత్వమే గుర్తించి తెలియజేస్తే, అథారిటీ ఆమోదం అవసరం లేదు.కమిషనర్ ల్యాండ్ పూలింగ్ పథకాన్ని కొనసాగించడానికి అథారిటీని గుర్తించి ఆమోదం పొందిన తర్వాత, కమిషనర్/ అధికారి చట్టంలోని సెక్షన్ 55(4) కింద తన ఉద్దేశ్యాన్ని ప్రకటించడానికి నోటిఫికేషన్ ఎలో సూచించిన ఫార్మాట్‌లో సెక్షన్ 55(5) కింద అభ్యంతరాలను ఆహ్వానించారు.

- పురపాలక శాఖ పట్టా భూములు మెట్ట భూములైతే అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో ఎకరానికి 1000 గజాల నివాస స్థలంతో పాటు 250 గజాల కమర్షియల్ ప్లాట్ ఇస్తారు.
- జామ, నిమ్మ, సపోటా వంటి పండ్ల తోటలున్న భూములకు లక్ష రూపాయలు చొప్పున కేవలం ఒక్కసారి పరిహారం చెల్లిస్తారు.
- జరీబు భూములు ఇచ్చే వారికి ఎకరానికి 1000 చదరపు గజాల నివాసం స్థలంతో పాటు 450 చదరపు గజాల కమర్షియల్ ప్లాట్ స్థలం ఎసైన్డ్ భూములకు, శివాయ్ జమేదార్స్, అభ్యంతరం లేని, అభ్యంతరం ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించి సాగు చేస్తున్న వారికి కేటగిరీల వారీగా వేర్వేరు ప్యాకేజీలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.
- ఒకవేళ పట్టా భూములు 1954 కి ముందు, ఆ తర్వాత ఎసైన్ చేసిన భూములు, మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితుల భూములకు మాత్రమే కౌలు చెల్లిస్తారు. మిగతా కేటగిరీల భూములకు ఎలాంటి కౌలు చెల్లించరు.
- మెట్ట భూములకు తొలి ఏడాదికి ఎకరానికి రూ.30 వేలు, జరీబు భూములకు రూ.50 వేల చొప్పున కౌలు చెల్లిస్తారు. రెండో ఏడాది నుంచి ముందు ఏడాది ఇచ్చిన దాంట్లో ఏటా 10 శాతం అధికంగా చెల్లిస్తారు. అనధికారిక లేఅవుట్లలోని స్థలాలకు 65 శాతం పరిహారం గానీ, గరిష్టంగా 500 చదరపు గజాల భూమి గానీ పరిహారంగా ఇస్తారు. సీఆర్‌డీఏ/డీటీసీపీ లేదా వీజీటీఎం-ఉడా అనుమతితో వేసిన లేఅవుట్లతో పాటు గ్రామకంఠం, అగ్రహారం, అబాది, విలేజ్ సైట్‌లను తాజా భూ సేకరణ నుంచి మినహాయిస్తారు. బలహీనవర్గాల కోసం ఇళ్లు నిర్మించిన కాలనీలను, విస్తరించిన గ్రామ కంఠాలను మినహాయిస్తారు. అయితే భూసమీకరణ నిర్ణయం ప్రకటించే నాటికి ఉన్నవాటినే పరిగణనలోకి తీసుకుంటారు. భూములు తీసుకునే గ్రామాల్లోని వ్యవసాయ కూలీలు, భూమి లేని నిరుపేదలకు నెలకు రూ.5 వేల చొప్పున 10 సంవత్సరాల పాటు పింఛను ఇస్తారు.

# జగన్ తోనే వంశీనా...

విజయవాడ, జూలై 4,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వల్లభనేని వంశీ జైలు నుంచి బెయిల్ పై విడుదలైన సంగతి తెలిసిందే. సుమారు 138 రోజుల అనంతరం ఆయనకు జైలు నుంచి విముక్తి లభించింది. ఆయనపై నమోదైన 11 కేసులకు సంబంధించి.. బెయిల్ లభించింది. దీంతో నిన్ననే ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. జైలు బయట మాజీ మంత్రి పేర్ని నాని, వైసీపీ ఎమ్మెల్సీ తలశీల రఘురాం ఆత్మీయంగా స్వాగతం పలికారు. భారీ కాన్వాయ్ నడుమ విజయవాడలోని నివాసానికి చేరుకున్నారు వల్లభనేని వంశీ మోహన్. మరోవైపు ఈరోజు వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డిని కలుసుకున్నారు వంశీ. ఆయన వెంట భార్య పంకజశ్రీ కూడా ఉన్నారు. ఈరోజు తాడేపల్లి లోని జగన్ నివాసానికి వచ్చి కలిశారు. ఈ సందర్భంగా జైలు జీవితం, తాజా పరిణామాలపై ఆయనతో మాట్లాడారు.2019 ఎన్నికల్లో టిడిపి( నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వల్లభనేని వంశీ మోహన్ అనూహ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. అలా వెళ్లిన నాటి నుంచి చంద్రబాబుతో పాటు లోకేష్ ను వ్యక్తిగతంగా టార్గెట్ చేశారు. నిత్యం అనుచిత వ్యాఖ్యలతో రాజకీయ సంచలనాలకు కేంద్ర బిందువు అయ్యారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కొద్ది రోజులపాటు గ్యాప్ వచ్చింది. నియోజకవర్గానికి దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది. ఇటువంటి పరిస్థితుల్లో వల్లభనేని వంశీ మోహన్ గతంలో చేసిన వ్యాఖ్యలపై వరుసగా కేసులు నమోదయ్యాయి. దీంతో పోలీసులు ఫిబ్రవరి 17న వల్లభనేని వంశీ మోహన్ ను అరెస్టు చేశారు. ఆయన అరెస్టు జరిగిన తర్వాత జగన్మోహన్ రెడ్డి నేరుగా జైలుకు వెళ్లి పరామర్శించారు. ఇప్పుడు విడుదల కావడంతో అధినేత జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.వరుసగా కేసులు నమోదు కావడం. దాదాపు 5 నెలల పాటు జైలు జీవితం గడపడంతో మధ్యలో అనారోగ్యానికి గురయ్యారు వల్లభనేని వంశీ మోహన్. కోర్టులకు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకున్న ప్రతిసారి ఆయనపై.. మరో రకమైన కేసులు నమోదు చేసేవారు. అయితే చివరకు అన్ని కేసుల్లోనూ బెయిల్ రావడంతో నిన్ననే విజయవాడ జైలు నుంచి విడుదలయ్యారు వంశీ. దీంతో అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# మళ్లీ వైసీపీ గూటికి విజయసాయి

నెల్లూరు, జూలై 4, వైసీపీలోకి విజయసాయిరెడ్డి వస్తారా? అందుకు అవసరమైన చర్చలు సాగుతున్నాయా? జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసారా? విజయసాయిరెడ్డి సైతం మొగ్గు చూపారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇటీవల పార్టీ ముఖ్య నేత జగన్మోహన్ రెడ్డి వద్ద ఇదే విషయాన్ని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉందని.. విజయసాయి రెడ్డి లాంటి నేత ఉంటే బాగుంటుందని.. విజయసాయిరెడ్డిని పార్టీలోకి పెద్దమంటూ ఆయన ప్రతిపాదన పెట్టినట్లు సమాచారం. అయితే సాయి రెడ్డి వస్తే తనకు ఎటువంటి అభ్యంతరం లేదని జగన్మోహన్ రెడ్డి చెప్పినట్లు ప్రచారం సాగుతోంది. ఒకవేళ విజయసాయిరెడ్డి వైసీపీలోకి వస్తే అది సంచలన అంశంగా మారనుంది.వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబంతో విజయసాయి రెడ్డికి సుదీర్ఘ అనుబంధం ఉంది. ఆ కుటుంబ ఆడిటర్ గా ఉండే విజయసాయిరెడ్డి జగన్మోహన్ రెడ్డికి దగ్గరయ్యారు. ఆయన పరిశ్రమలకు సంబంధించి అన్ని కార్యకలాపాలను చూసుకునేవారు. అందులో భాగంగానే జగన్ పై వచ్చిన అవినీతి కేసుల్లో కూడా విజయసాయిరెడ్డి నిందితుడిగా మారారు. జగన్మోహన్ రెడ్డి తో పాటు 16 నెలల పాటు జైలు జీవితం కూడా అనుభవించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు, ఆ పార్టీ విస్తరణ, కేంద్ర పెద్దలతో సాన్నిహిత్యం, పార్టీని అధికారంలోకి తీసుకుని రావడం వెనుక విజయసాయిరెడ్డి కృషి ఉంది. అయితే 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత విజయసాయిరెడ్డి అనూహ్యంగా పార్టీకి గుడ్ బై చెప్పారు. అయినా సరే ఎక్కడా జగన్మోహన్ రెడ్డి పై వ్యతిరేకంగా మాట్లాడలేదు.వైయస్సార్ కాంగ్రెస్( పార్టీ సైతం విజయసాయి రెడ్డికి ఎనలేని ప్రాధాన్యం ఇచ్చింది. 2014లో 67 సీట్లతో గౌరవప్రదమైన ప్రతిపక్ష హోదాను దక్కించుకుంది. దీంతో తొలి రాజ్యసభ పదవిని దక్కించుకున్నారు విజయసాయిరెడ్డి. అది మొదలు కేంద్ర పెద్దలతో సాన్నిహిత్యం పెంచుకున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ తో పాటు జగన్మోహన్ రెడ్డి కోసం కేంద్ర పెద్దలకు సాగిలాలు పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా విజయసాయిరెడ్డి ప్రాధాన్యం పెరిగింది. పార్టీతో పాటు ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించారు. అయితే అనూహ్యంగా సజ్జల రామకృష్ణారెడ్డి పాత్ర పెరిగి.. విజయసాయిరెడ్డి ప్రాధాన్యతను తగ్గించారు. ఒకానొక దశలో పార్టీకి గుడ్ బై చెబుతారన్న క్రమంలో మళ్లీ దగ్గరకు తీసుకుని నెల్లూరు పార్లమెంట్ సీటు ఇచ్చారు. అయితే అక్కడ విజయసాయి రెడ్డికి ఓటమి ఎదురైంది.ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చాలా రకాల కేసులు విజయసాయిరెడ్డికి ఎదురయ్యాయి. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో జగన్ చుట్టూ విజయసాయి రెడ్డికి వ్యతిరేకంగా కోటరి పెరిగింది. దీనిని తట్టుకోలేక పోయారు విజయసాయిరెడ్డి. ఒకవైపు కేసులు ఎదురు కావడం.. ఇంకోవైపు ప్రాధాన్యత తగ్గడంతో పార్టీకి గుడ్ బై చెప్పారు. ఇకనుంచి ఏ పార్టీలో చేరనని.. వ్యవసాయం చేసుకుంటానని చెప్పుకొచ్చారు. కానీ తరచూ రాజకీయ వ్యాఖ్యానాలు చేస్తూ.. తనలో ఇంకా రాజకీయ ఆసక్తి తగ్గలేదని సంకేతాలు పంపారు.తొలుత విజయసాయిరెడ్డి బిజెపిలో చేరుతారని పెద్ద ఎత్తున ప్రచారం నడిచింది. కానీ అటువంటిదేమీ జరగలేదు. అయితే వైసిపి హయాంలో జరిగిన కేసులకు సంబంధించి వాంగ్మూలం ఇచ్చారు ప్రత్యేక దర్యాప్తు బృందం ఎదుట. దీనిపై జగన్మోహన్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు కూడా. అయినా సరే విజయసాయిరెడ్డి జగన్ విషయంలో ఎటువంటి విమర్శలు చేయలేదు. అయితే ఇప్పుడు విజయసాయిరెడ్డిని పార్టీలోకి తెస్తే బాగుంటుందన్న సీనియర్ నేతల అభిప్రాయాన్ని జగన్ ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విజయసాయిరెడ్డి తో వైసీపీ కీలక నేత చర్చలు జరుపుతున్నారని.. త్వరలో ఆయన రావడం ఖాయమని వైసిపిలో ప్రచారం జరుగుతుంది. ఒకవేళ ఆయన కానీ వైసీపీలోకి వస్తే ఇదో సంచలన అంశంగా మారే అవకాశం ఉంది.

# అందుబాటులోకి రైల్వే వన్ యాప్

విజయవాడ, జూలై4,రైలు ప్రయాణికుల కోసం రైల్వే శాఖ మరో యాప్ ను తీసుకువస్తోంది. ఇది సమగ్రమైన యాప్ అని, రైల్వేలకు సంబంధించిన అన్ని సేవలను ఇందులో పొందవచ్చని చెబుతోంది. దీని పేరు 'రైల్ వన్'. ఈ యాప్ ద్వారా టికెట్ బుకింగ్స్ నుంచి ఫుడ్ ఆర్డర్ ల వరకు వివిధ సేవలు పొందవచ్చు.భారతీయ రైల్వే జూలై 1, మంగళవారం రైలు ప్రయాణీకుల అన్ని సేవలనను అందించే ప్రత్యేకమైన వన్-స్టాప్ సొల్యూషన్ యాప్ 'రైల్ వన్' ను ప్రారంభించింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కొత్త సాఫ్ట్ వేర్ అప్లికేషన్ రైల్ వన్ ను ప్రారంభించారు. ఇది భారతీయ రైల్వేల కొరకు కీలక సమాచార వ్యవస్థలను అభివృద్ధి చేస్తుంది. అమలు చేస్తుంది. నిర్వహిస్తుంది.ఆండ్రాయిడ్, ఐఫోన్ యూజర్లకు అందుబాటులో రైల్వేకు సంబంధించిన అన్ని సందేహాలు, ప్రయాణికుల అవసరాలకు వన్ స్టాప్ ప్లాట్ ఫామ్ గా ఉపయోగపడేలా ఈ కొత్త 'రైల్ వన్' యాప్ ను రూపొందించారు. బహుళ సేవలను ఒకే ఇంటర్ ఫేస్ లోకి అనుసంధానించడం ద్వారా ప్రయాణీకుల సౌకర్యాన్ని పెంచడం కూడా దీని లక్ష్యం.రైల్ వన్ ప్రస్తుతం ఆండ్రాయిడ్ మరియు ఐఫోన్ వినియోగదారులకు అందుబాటులో ఉంది. ఆండ్రాయిడ్ కస్టమర్లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి, ఐఫోన్ కస్టమర్లు ఐఓఎస్ యాప్ స్టోర్ నుండి ఈ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. యాప్ హోలిస్టిక్ ప్యాకేజీని అందిస్తుంది. ఈ యాప్ లో సరుకు రవాణా రైలు సర్వీసు ఎంక్వైరీలకు సంబంధించిన ఫీచర్లు కూడా ఉన్నాయి. "ఇది అన్ని సేవలను ఒకే చోట కలిగి ఉండటమే కాకుండా సేవల మధ్య ఇంటిగ్రేటెడ్ కనెక్టివిటీని అందిస్తుంది, వినియోగదారులకు భారతీయ రైల్వే సేవల యొక్క సమగ్ర ప్యాకేజీని ఇస్తుంది" అని మంత్రిత్వ శాఖ తెలిపింది. రైల్ వన్ ఒకే సైన్-ఆన్ సదుపాయాన్ని కూడా కలిగి ఉంది, ఇది వినియోగదారులు బహుళ పాస్ వర్డ్ లను గుర్తుంచుకునే భారాన్ని తగ్గిస్తుందిబుకింగ్స్ కోసం ఇప్పటికే రైల్ కనెక్ట్ లేదా యూటీఎస్ మొబైల్ అప్లికేషన్లను ఉపయోగిస్తున్న వ్యక్తులు అదే క్రెడెన్షియల్స్ ను ఉపయోగించడానికి ఈ యాప్ అనుమతిస్తుంది. వారు తమ ప్రస్తుత యూజర్ నేమ్ మరియు పాస్ వర్డ్ ఉపయోగించి రైల్ వన్ లోకి లాగిన్ కావచ్చు. యాప్ అందించే సేవల జాబితా రిజర్వ్ మరియు అన్ రిజర్వ్ డ్ టికెట్ల బుకింగ్ ప్లాట్ ఫాం టికెట్ల బుకింగ్ రైళ్ల గురించి ఆరా తీయడం పిఎన్ ఆర్ స్థితిని తనిఖీ చేయడం ప్రయాణ ప్రణాళికలో సహాయపడుతుంది రైల్ మదద్ సేవలను సులభంగా యాక్సెస్ చేసుకోవచ్చు. మీ రైలులో ఆహారాన్ని ఆర్డర్ చేయవచ్చు.భారతీయ రైల్వే ప్రయాణికులు ప్రస్తుతం టికెట్ల బుకింగ్ కోసం రైల్ కనెక్ట్, ఆహారాన్ని ఆర్డర్ చేయడానికి ఐఆర్సిటిసి ఇ-క్యాటరింగ్, ఫీడ్బ్యాక్ అందించడానికి రైల్ మదద్, అన్రిజర్వ్ టికెట్ల కొనుగోలు కోసం యుటిఎస్ మరియు రైలు కదలికలను పర్యవేక్షించడానికి నేషనల్ ట్రైన్ ఎంక్వైరీ వంటి యాప్ల ద్వారా వివిధ సేవలను పొందుతున్నారు. రైల్ వన్ ద్వారా ఇవన్నీ ఒకే యాప్ మాధ్యమం ద్వారా పొందవచ్చు.

# బీహార్ ఘట్ బంధన్ తో మజ్లీస్ బంధం

పాట్నా, జూలై 4, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ తిరిగి అధికారంలోకి రాకుండా నిరోధించడమే లక్ష్యంగా తమ పార్టీ బీహార్‌లోని ప్రతిపక్ష మహాఘటబంధన్ నాయకులను సంప్రదించిందని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆదివారం తెలిపారు. తమ రాష్ట్ర పార్టీ చీఫ్ అఖ్తరుల్ ఇమాన్, కాంగ్రెస్, ఆర్జేడీ, ఇతరులతో కూడిన మహాఘట్బంధన్ నాయకులను సంప్రదించారని, బీజేపీ, దాని మిత్రదేశాలకు వ్యతిరేకంగా పోరాడటానికి ఆసక్తిని వ్యక్తం చేశారని ఒవైసీ అన్నారు. "మా రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్, మహాఘట్బంధన్‌లోని కొంతమంది నాయకులతో మాట్లాడారు, బీహార్‌లో బిజెపి లేదా ఎన్డీఏ తిరిగి అధికారంలోకి రావాలని మేం కోరుకోవడం లేదని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు.ఇప్పుడు బీహార్‌లో ఎన్డీఏ తిరిగి అధికారంలోకి రావాలా? వద్దా? అనేది ఈ రాజకీయ పార్టీలపైనే ఆధారపడి ఉంది" అని ఒవైసీ తెలిపారు. బీహార్‌లోని సీమాంచల్ ప్రాంతంలో బలమైన ఉనికిని కలిగి ఉన్న ఎంఐఎం 2022లో దాని ఐదుగురు ఎమ్మెల్యేలలో నలుగురులో చేరడంతో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. తమ పార్టీ సీమాంచల్ నుంచే కాకుండా బయట కూడా అభ్యర్థులను నిలబెడుతుందని ఒవైసీ అన్నారు. "వారు (మహాఘట్‌బంధన్) తమతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా లేకుంటే, తాము ప్రతిచోటా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నాం.." అని ఆయన అన్నారు. అంతకుముందు బీహార్‌లో ఓటర్ల జాబితాల "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్"ను వ్యతిరేకిస్తూ ఒవైసీ భారత ఎన్నికల సంఘానికి లేఖ రాశారు."ఇది చట్టబద్ధంగా ప్రశ్నార్థకమైన చర్య అని, ఇది రాబోయే ఎన్నికలలో నిజమైన ఓటర్లకు స్వరం లేకుండా చేస్తుంది" అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. "ఓటరు జాబితాలో నమోదు కావడానికి, ప్రతి పౌరుడు ఇప్పుడు వారు ఎప్పుడు, ఎక్కడ జన్మించారో నిరూపించే పత్రాలను మాత్రమే కాకుండా, వారి తల్లిదండ్రులు ఎప్పుడు, ఎక్కడ జన్మించారో కూడా చూపించాల్సి ఉంటుంది. ఉత్తమ అంచనాలు కూడా జననాలలో మూడింట ఒక వంతు మాత్రమే నమోదు అయ్యాయని చెబుతున్నాయి. చాలా ప్రభుత్వ పత్రాలు లోపాలతో నిండి ఉన్నాయి" అని ఆయన ఎక్స్‌లో తెలిపారు. అలాంటి ప్రక్రియ నిర్వహించడం వల్ల పేదలు ఓటర్ల జాబితా నుండి తొలగించబడతారని, ఇది వారి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమేనని కూడా ఆయన వాదించారు.

# ఏపీ కేంద్రంగా ఉగ్రకార్యాకలాపాలు

విజయవాడ, జూలై 4, భారత దేశంలో ఉగ్రవాదులు అంటే గుర్తుకు వచ్చేది జమ్మూ కశ్మీర్, తర్వాత రాజస్థాన్, పంజాబ్, ఢిల్లీ, ముంబై గుర్తొస్తాయి. కానీ, ప్రస్తుతం దేశమంతా ఉగ్రవాదులు విస్తరిస్తున్నారు. అయితే ఇంతకాలం ప్రశాంతం అనుకున్న ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా పట్టుబడుతున్న ఉగ్రవాదులు తెలుగువారు ఉలిక్కిపడేలా చేస్తున్నారు. ఈ ఘటనలతో ఆంధ్రప్రదేశ్ ఉగ్రవాదుల ఆశ్రయంగా మారిందా అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మే నెలలో విజయనగరంలో ఇద్దరు ఉగ్రవాదులను ఎన్ఐఏ అరెస్టు చేసింది. పేలుళ్లకు కుట్ర పన్నిన సమయంలో పక్కా సమాచారంతో ఇద్దరిని అరెస్టు చేశారు. దీంతో ప్రశాంతంగా ఉండే విజయనగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇక తాజాగా రాయలసీమలోని అన్నమయ్య జిల్లాలో మరో ఇద్దరు ఉగ్రవాదులు పట్టుపడ్డారు. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్‌లో కలకలం రేపింది. 30 ఏళ్లుగా పరారీలో ఉన్న ఇద్దరు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులు, అబూబక్కర్ సిద్దీక్(60), మొహమ్మద్ అలీ అలియాస్ యూనుస్ (కేరళలోని మేళపలయం), తమిళనాడు యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్), ఆంధ్రప్రదేశ్ పోలీసుల సహకారంతో జూన్ 30న అరెస్టయ్యారు. వీరు 1995లో చెన్నైలో హిందూ మున్నాని కార్యాలయంలో బాంబు పేలుడు, నాగూరులో పార్సిల్ బాంబు దాడి, 1999లో చెన్నై, తిరుచ్చి, కోయంబత్తూరు, కేరళలో ఏడు చోట్ల బాంబు దాడులు, 2011లో ఎల్.కే. అద్వానీ రథయాత్ర సమయంలో పైపు బాంబు దాడి కుట్రతో సహా అనేక ఉగ్రవాద కార్యకలాపాల్లో నిందితులుగా ఉన్నారు.అబూబక్కర్ సిద్దీక్, మొహమ్మద్ అలీ అలియాస్ యూనుస్ రాయచోటిలో మారువేషంలో జీవనం సాగిస్తున్నారు. సిద్దీక్ స్థానియ యువతిని పెళ్లి చేసుకుని ఇక్కడే అందరితో కలిసిపోయాడు. స్థానికులతో పరిచయాలు పెంచుకున్నాడు. చీరల వ్యాపారం చేస్తున్నాడు. మహ్మద్ అలీ మరో చిరు వ్యాపారం చేస్తున్నాడు. స్థానికులు వీరి గురించి తెలియకుండా సహకారం అందిస్తూ వచ్చారు.చెన్నై ఇంటెలిజెన్స్ బ్యూరో, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రెండు నెలల పాటు వీరిపై నిఘా పెట్టాయి. స్థానిక పోలీసుల సహాయంతో వీరిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు తర్వాత వీరిని తమిళనాడుకు తరలించారు, అక్కడ మరింత దర్యాప్తు జరుగుతోంది. ఈ ఘటన స్థానికుల్లో భయాందోళన కలిగించింది. ఇంతకాలం ఉగ్రవాదులు తమ మధ్య సాధారణంగా తిరుగుతూ ఉండటం షాక్‌కు గురిచేసిందిఆంధ్రప్రదేశ్ ఉగ్రవాదులకు ఆశ్రయంగా మారుతోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాయచోటి వంటి చిన్న పట్టణాల్లో ఉగ్రవాదులు మారువేషంలో దాక్కున్న సంఘటనలు బయటపడటంతో జాతీయస్థాయిలో చర్చనీయాంశమైంది.ఆంధ్రప్రదేశ్‌లో గతంలోను పలుమార్లు ఉగ్రవాదులు పట్టుబడ్డారు. 2007లో హైదరాబాద్‌లోని మక్కా మసీదు వద్ద జరిగిన బాంబు పేలుళ్లు, 2013లో దిల్‌సుఖ్‌నగర్ బాంబు దాడులలో భారతీయ ముజాహిదీన్ (ఐఎమ్) వంటి సంస్థలతో సంబంధం ఉన్న ఉగ్రవాదులు పట్టుబడ్డారు. ఈ ఘటనలలో ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు ఉగ్రవాదులకు తాత్కాలిక ఆశ్రయంగా ఉపయోగపడినట్లు దర్యాప్తులో తేలింది. 2014?16 మధ్య, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి ఇస్లామిక్ స్టేట్‌తో సంబంధాలున్న కొందరు వ్యక్తులు గుర్తించబడ్డారు. ఎన్ఐఏ. దర్యాప్తులో గుంటూరు, నెల్లూరు వంటి ప్రాంతాలలో ఐఎస్ రిక్రూట్‌మెంట్ కార్యకలాపాలకు సంబంధించిన కొందరు అనుమానితులు అరెస్టయ్యారు. మదనపల్లి, రాజమండ్రిలో కూడా ఉగ్రవాదులను ఎన్ఐఏ అరెస్టు చేసింది. జమ్మూ కశ్మీర్‌కు చెందిన ఉగ్రవాది గతంలో మదనపల్లికి చెందిన యువతిని పెళ్లి చేసుకుని ఇక్కడే స్థిరపడ్డాడు. చాలాకాలం తర్వాత అతడిని ఎన్ఐఏ గుర్తించింది. ఎల్‌కే.అధ్వానీ హత్యకు యత్నించిన ఉగ్రవాదులను 2013లో రాజమండ్రిలో పోలీసులు అరెస్టు చేశారు.ఆంధ్రప్రదేశ్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు ప్రధానంగా జమ్మూ కాశ్మీర్ లేదా ఇతర ఉత్తర రాష్ట్రాలతో పోలిస్తే తక్కువగా ఉన్నప్పటికీ విజయనగరం, రాయచోటి వంటి సంఘటనలు రాష్ట్రంలో నిఘా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి.

# టూరిస్ట్ స్పాట్ కు కర్రెగట్టు

రాయ్ పూర్, జూలై 4, (న్యూస్ పల్స్) ఊటీని సందర్శించడానికి దేశవ్యాప్తంగా పర్యాటకులు ఆసక్తి చూపిస్తుంటారు. ప్రపంచవ్యాప్తంగా కూడా సందర్శకులు వస్తూ ఉంటారు. అయితే తెలంగాణ వాసులు ఇకపై వేసవికాలంలోనే కాదు.. ఏ కాలంలో కూడా ఊటీ వెళ్లాల్సిన అవసరం లేదు. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఊటీని అందుబాటులోకి తీసుకురానుంది. తెలంగాణలో ఉన్న కర్రెగుట్టల ప్రాంతాన్ని కేంద్రం పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేయనుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తయినట్టు తెలుస్తోంది. ఇటీవల ఈ ప్రాంతంలో మావోయిస్టులను కేంద్రం ఎరివేసింది. చాలా రోజులపాటు కేంద్ర బలగాలు ఈ ప్రాంతంలో తిష్ట వేశాయి. మావోయిస్టులను భారీ సంఖ్యలో హతమార్చాయి. మంటూ వేసవిలో మావోయిస్టుల ఏరివేతను అత్యంత విజయవంతంగా చేపట్టాయి. దీంతో ఈ ప్రాంతం మావోయిస్టుల నుంచి కేంద్ర బలగాల చేతిలోకి వచ్చింది. ఇక్కడ కొండలు, చెట్లు, జలపాతాలు అద్భుతంగా ఉన్న నేపథ్యంలో.. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలని కేంద్రం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఆ దిశగా ప్రణాళికలను రూపొందించినట్టు సమాచారం.కర్రెగుట్టల ప్రాంతంలో వాతావరణం అద్భుతంగా ఉంటుంది. ఒకరకంగా ఇది ఊటీ లాగానే ఉంటుంది. ఊటీకి మించిన గుహలు ఎక్కడ ఉన్నాయి. ఇక జలపాతాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అడవులయితే అత్యంత దట్టంగా ఉంటాయి. ఇక్కడ వాతావరణం వేసవిలో కూడా అద్భుతంగా ఉంటుంది. అందువల్లే ఈ ప్రాంతాన్ని తెలంగాణ ఊటీ లాగా మార్చాలని కేంద్రం భావిస్తున్నట్టు తెలుస్తోంది.. దీనికి సంబంధించి కేంద్ర హోం శాఖ మంత్రి కూడా సంకేతాలు ఇచ్చినట్టు సమాచారం. అయితే ఈ ప్రాంతం దట్టమైన అడవి మధ్యలో ఉన్న నేపథ్యంలో పర్యాటకులకు భద్రత కల్పించే బాధ్యత కూడా కేంద్రం తీసుకుంటుందని తెలుస్తోంది. ఇక్కడ అతిపెద్ద సాయుధ బలగాల శిక్షణ కేంద్రాన్ని నిర్మించాలని కేంద్రం భావిస్తున్నట్టు తెలుస్తోంది..ఇక్కడి వాతావరణం విభిన్నంగా ఉండడం.. మండువేసవిలోనూ చల్లగా ఉండడంవల్ల.. పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కేంద్ర భావిస్తున్నట్లు తెలుస్తోంది.. ఇక్కడ భారీగా రహదారులు నిర్మించాలని.. పర్యాటకులకు అనుకూలంగా ఉండే విధంగా హోటల్స్, రిసార్టులు నిర్మించాలని కేంద్రం భావిస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఇతర హంగులు కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది.. ఒకప్పుడు ఈ ప్రాంతం మావోయిస్టులకు పెట్టని కోట కాబట్టి ప్రతి ఐదు కిలోమీటర్ల కు ఒకటి చొప్పున ఫార్వర్డ్ ఆపరేషన్ బేస్ నిర్మించాలని కేంద్రం భావిస్తున్నట్టు సమాచారం. అయితే ఈ ప్రాంతంలో స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలు కూడా భద్రత కల్పిస్తాయని సమాచారం. మరికొద్ది రోజుల్లో ఈ ప్రాంతం అభివృద్ధికి సంబంధించి కేంద్రం స్పష్టమైన ఆదేశాలు ఇస్తుందని తెలుస్తోంది.

# అమెరికా విషయంలో ఆచితూచి అడుగులు

న్యూఢిల్లీ, జూలై 4, (న్యూస్ పల్స్) రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500% పన్నులు విధిస్తామన్న అమెరికా బెదిరింపులపై కేంద్ర మంత్ర జైశంకర్ స్పందించారు. ఈ అంశం భారత్ ప్రయోజనాలపై ప్రభావం చూపుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన భద్రత విషయంలో భారత్ తన నిర్ణయం తీసుకుంటుందని, అమెరికా చర్యలను గమనిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవడంపై అమెరికా ఆంక్షలు విధిస్తే భారత్ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.ఆంక్షలు కొనసాగుతున్నా రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తామనే అమెరికా బెదిరింపులపై భారత విదేశాంగా శాఖ మంత్రి ఎస్ జైశంకర్ స్పందించారు. వాషింగ్టన్ డీసీలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రష్యాతో వ్యాపారం కొనసాగిస్తున్న దేశాలపై అమెరికా విధించబోయే 500 శాతం దిగుమతి సుంకాలపై ఆందోళనలను వ్యక్తం చేశారు. అమెరికా కాంగ్రెస్ సభ్యుడు లిండ్సే గ్రాహమ్ ప్రవేశపెట్టిన కొత్త బిల్లును దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "లిండ్సే గ్రాహమ్ ప్రతిపాదించిన బిల్లు అమెరికా కాంగ్రెస్ చర్య అయితే అది భారత ప్రయోజనాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున మేం దానిని గమనించాల్సిందే" అని జైశంకర్ పేర్కొన్నారు.ఇంధన భద్రతల విషయంలో భారత్‌కు ఉన్న ప్రయోజనాలను మేము ఆయనకు (గ్రాహమ్) స్పష్టంగా వివరించాం... ఈ సమస్య ఎదురైనప్పుడు తగిన విధంగా స్పందిస్తాం" అని ఆయన అన్నారు. అమెరికా రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ఇటీవల ఏబీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ:. "రష్యా నుంచి ఉత్పత్తులు కొంటూ ఉక్రెయిన్‌కు సహాయం చేయకుంటే అప్పుడు మీ ఉత్పత్తులపై 500 శాతం దిగుమతి సుంకాన్ని విధిస్తాం" అని చెప్పారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ బిల్లును ఆమోదించినట్లు గ్రాహమ్ వెల్లడించారు. ఈ బిల్లుకు ఇప్పటికే 84 మంది సెనేటర్లు సంతకం చేశారు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చలు సాగుతున్న వేళ ట్రంప్ బెదిరింపులకు దిగారు.ఫిబ్రవరి 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర మొదలైన తర్వాత.. ఆ దేశంపై అమెరికా, పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించాయి. దీంతో రష్యా చమురుకు డిమాండ్ తగ్గిపోవడంతో తక్కువ ధరకే విక్రయించడానికి రష్యా ముందుకొచ్చింది. ఈ చమురును రాయితీపై భారత్ దిగుమతి చేసుకుంటోంది. మే 2025 నాటికి, రోజుకి 1.96 మిలియన్ బ్యారెళ్ల రష్యా చమురును భారత్ దిగుమతి చేసుకుంది. ఈ మార్పుతో రష్యా చమురు, భారత మొత్తం ముడి చమురు దిగుమతుల్లో 1 శాతం నుంచి 44 శాతానికి పెరిగింది. ఇది అమెరికాకు అత్యంత ఆందోళనకర విషయం కావచ్చు.కాగా, దీనిపై విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందిస్తూ.. "భారత్-అమెరికా సంబంధాల విషయంలో మేమే నిర్ణయం తీసుకుంటాం.. పాకిస్థాన్ కాదు" అని పేర్కొంటూ ఇటీవల భారత్ పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందంపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కాగా, ఈ బిల్లు అమెరికా పార్లమెంటులో మ దారి తీసే అవకాశమున్నా, భారత్ మాత్రం తన జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రతల విషయంలో స్పష్టమైన దృక్కోణాన్ని చూపించింది. అమెరికా సరైన దౌత్యపరమైన మార్గాన్ని ఎంచుకుంటుందా? లేక వాణిజ్య యుద్ధానికి దిగుతుందా? అనేది త్వరలో తేలనుంది.

# కేటీఆర్ ను బుక్ చేసిన అర్వింద్ కుమార్

హైదరాబాద్, జూలై 4 నార్మల్ కేసు కాదు.. ఆ ఒక్క రేసుతో.. సర్కారు కోట్లు లాస్ అయింది. అందుకే.. కేస్ అయింది. స్టేట్ మొత్తం ఇంత డిస్కషన్ నడుస్తోంది. లొట్టపీస్ కేసు అని కేటీఆర్ ఎంత మొత్తుకున్నా.. ఏసీబీ మాత్రం పీస్ పీస్‌గా కేస్‌ని ఒలిచి.. ఒలిచి విచారిస్తోంది. ఇప్పటికే.. ఫార్ములా ఈ-కారు రేసులో కేటీఆర్ స్టేట్‌మెంట్ రికార్డ్ చేసింది ఏసీబీ. కేటీఆర్ స్టేట్ మెంట్ ఆధారంగా అరవింద్ కుమార్ విచారణ కొనసాగుతోంది. హెచ్ ఎండీఏ అకౌంట్ నుంచి నిబంధనలకు విరుద్ధంగా రూ. 55 కోట్ల నిధుల మళ్లించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆయన చెప్పిన విషయాల ఆధారంగానే.. ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌ని కూడా ప్రశ్నించింది ఏసీబీ. ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ఏసీబీ విచారణ చేసింది. 6గంటలపాటు ఆయనను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. ఈ కేసుకు సంబంధించి మూడోసారి ఆయన విచారణకు వచ్చారు. ఫార్ములా వ కార్ రేస్ కేసులో నిధుల బదలాయింపులో అరవింద్ కుమార్ కీలక పాత్ర పోషించారని ఏసీబీ గుర్తించింది. గతంలో కేటీఆర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఏసీబీ ఆయనపై ప్రశ్నలు కురిపించినట్టు తెలుస్తోంది. అరవింద్ కుమార్ హెచ్ఎండీఏ డైరెక్టర్‌గా పనిచేస్తూ నిధులను మళ్లించినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. కేబినెట్ అనుమతి లేకుండా నిధులను బదలాయించినందుకు ఏసీబీ కేసు నమోదు చేసింది. కేటీఆర్ ఆదేశాలతోనే తాను ఫార్ములా-ఈ రేస్ కోసం నిధులు విడుదల చేశానని చెప్పారు ఐఏఎస్ అర్వింద్ కుమార్. ఖాతా నుంచి.. కంపెనీకి నిధుల మళ్లింపులో.. తన ప్రమేయం లేదన్నారు. కేటీఆర్.. స్వయంగా వాట్సాప్ ద్వారా కి నిధులు విడుదల చేయాలని ఆదేశించారన్నారు అర్వింద్ కుమార్. ఇందులో.. తనకెలాంటి వ్యక్తిగత స్వార్థం లేదన్నారు. బిజినెస్ రూల్స్, ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలని.. తాను కేటీఆర్‌కు చెప్పానని.. అయినప్పటికీ.. కంపెనీకి వెంటనే నిధులు విడుదల చేయాలని.. మిగతా విషయాలు తాను చూసుకుంటానని చెప్పారని.. అర్వింద్ కుమార్ వెల్లడించారు. మొత్తం.. 45 కోట్ల 71 లక్షల రూపాయల్ని.. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ద్వారా.. బ్రిటన్ పౌండ్స్ రూపంలో చెల్లించామన్నారు.. ఈ ఫార్ములా-ఈ రేస్ కేసులో.. అర్వింద్ కుమార్, కేటీఆర్ దోబూచులాట ఆడుతున్నట్లు కనిపిస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే.. కేటీఆర్ ఏమో ఈ వ్యవహారంలో అర్వింద్ పేరు చెబుతున్నారు. ఆయనేమో.. కేటీఆర్ పేరు చెబుతున్నారు. దాంతో.. ఈ ఫార్ములా పంచాయతీ ఇప్పట్లో తెగుతుందా? అనే డౌట్ కొడుతోంది. అసలు.. ఫార్ములా-ఈ రేసు కేసులో ఏం జరిగింది? కేటీఆర్ ఆదేశాల మేరకే ఇదంతా జరిగిందా? లేక.. కేటీఆర్ చెబుతున్నట్లు ఇది అర్వింద్ కుమార్ డెసిషనేనా?

## తుంగభద్రకు భారీ వరద ఉద్ధృతి ,20 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల,

కర్నూలు తుంగభద్ర జలాశయానికి వరద ఉద్ధృతి క్రమంగా పెరుగుతోంది. దీంతో అధికారులు 20 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. తుంగభద్ర నీటి నిల్వ సామర్థ్యం 105 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయంలో 77 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి 56 వేల క్యూసెక్కుల వరద జలాశయంలో చేరుతుండగా.. 20 గేట్ల ద్వారా అంతే మొత్తంలో నీటిని శ్రీశైలం జలాశయానికి విడుదల చేశారు.

# నిరుద్యోగులకు గుడ్ న్యూస్

హైదరాబాద్, జూలై 4 తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగులకు మరో ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేసేందుకు టీజీపీఎస్సీ సమాయాత్తమవుతోంది. పాఠశాల విద్యాశాఖ పరిధిలో దాదాపు 24 డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల (డిప్యూటీ ఈఓ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు 110 అధ్యాపకులు, 8 పీడీ పోస్టులు సైతం ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ తెలిపింది. ఈ పోస్టుల భర్తీకి త్వరలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు విద్యాశాఖ ఇప్పటికే టీజీపీఎస్సీకి అందించింది. నిజానికి, పాఠశాల విద్యాశాఖ పరిధిలో డిప్యూటీ ఈఓలు, ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలలు, ఎస్సీఈఆర్టీలోని అధ్యాపకులు, సీనియర్ అధ్యాపకులతోపాటు మొత్తం 134 పోస్టులను టీజీపీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ 2022లోనే అనుమతి ఇచ్చింది.ఇందులో 24 డిప్యూటీ ఈఓ, 110 అధ్యాపక, సీనియర్ అధ్యాపక పోస్టులు ఉన్నాయి. ఈ 134 పోస్టులతో పాటు తాజాగా దోమలగూడలోని ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీల్లో 8 ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) పోస్టులు భర్తీ చేసేందుకు కమిషన్‌కు ప్రతిపాదనలు అందాయి. మొత్తంగా 142 పోస్టులకు త్వరలోనే 5 వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.ఉమ్మడి తెలంగాణ పరిధిలో మొత్తం 72 డిప్యూటీ ఈఓ పోస్టులు ఉండేవి. ఒక్కో రెవెన్యూ డివిజన్‌కు ఒకటి చొప్పున గతంలో కేటాయించారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాలో రెవెన్యూ డివిజన్లు రెండే ఉన్నప్పటికీ.. జనాభా, పాఠశాలలు సంఖ్య ఎక్కువగా ఉన్నాయి. దీంతో హైదరాబాద్ ఒక్క జిల్లాకే ఏకంగా 12 పోస్టులు రానున్నాయి. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో రెవెన్యూ డివిజన్లు పెరిగాయి. దీంతో 28 పోస్టులను మంజూరు చేయాలని 2 రోజుల క్రితం పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం 33 జిల్లాలకు కలిపి కేవలం 12 డీఈఓ పోస్టులే ఉన్నాయి. అదనంగా మరో 21 పోస్టులను మంజూరు చేయాలనీ ప్రతిపాదనలు చేశారు. మొత్తంగా త్వరలోనే 28 డిప్యూటీ ఈఓ, 21 డీఈఓ పోస్టుల భర్తీకి ప్రకటన రానుంది

# కేసీఆర్ హెల్త్ స్టేబుల్



హైదరాబాద్, జూలై 4, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నట్టుండి అస్వస్థతకు గురై ఆసుపత్రిలో యశోద ఆసుపత్రిలో చేరారు. ఆయనకు జ్వరం, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం, సోడియం స్థాయిలు తగ్గడం వంటి సమస్యలు ఉన్నాయని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నప్పటికీ, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్ ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర అస్వస్థతతో గురువారం సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చేరారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యుల బృందం ఒక అధికారిక హెల్త్ బులిటెన్‌ను విడుదల చేసింది. బులిటెన్ ప్రకారం.. కేసీఆర్ తీవ్ర జ్వరంతో ఆసుపత్రికి వచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం.. ఆయనకు రక్తంలో చక్కెర స్థాయిలు గణనీయంగా పెరిగాయని (హై బ్లడ్ షుగర్), అలాగే సోడియం స్థాయిలు గణనీయంగా పడిపోయాయని (తక్కువ సోడియం లెవెల్స్) నిర్ధారించారువైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసీఆర్‌కు నిర్వహించిన మిగిలిన అన్ని వైద్య పరీక్షల నివేదికలు సాధారణంగానే ఉన్నాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని పేర్కొన్నారు. అయినప్పటికీ, డయాబెటిస్‌ను నియంత్రణలోకి తీసుకురావడానికి.. శరీరంలోని సోడియం స్థాయిలను సమతుల్యం చేయడానికి ఆయనను క్లోజ్ అబ్జర్వేషన్‌లో ఉంచి, నిరంతరం చికిత్స అందిస్తున్నారు. ఆయన వయసు, గతంలో ఎదుర్కొన్న తుంటి గాయం వంటి ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని, వైద్యులు అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కేసీఆర్ వెంట ఆయన సతీమణి శోభ, కుమారుడు కేటీఆర్, మేనల్లుడు హరీశ్ రావు, అలాగే సంతోష్ రావు వంటి కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వెళ్లారు.కేసీఆర్ అస్వస్థత వార్త తెలిసిన వెంటనే.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఆయన సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్యులు, అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కేసీఆర్ ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్‌కు అత్యుత్తమ చికిత్స అందించాలని సీఎం రేవంత్ రెడ్డి వైద్యులకు సూచించారు. ఆయన త్వరగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అంతేకాకుండా.. కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరారు.గత ఏడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయినప్పటి నుంచి కేసీఆర్ ప్రజా జీవితంలో అంతగా చురుకుగా కనిపించడం లేదు. ఆయన గతంలో ప్రదర్శించిన దూకుడు, ఉత్సాహం ప్రస్తుతం తగ్గింది. ఇటీవల వరంగల్‌లో జరిగిన పార్టీ బహిరంగ సభలోనూ ఆయన ప్రసంగం పార్టీ శ్రేణుల్లో మునుపటి ఉత్సాహాన్ని నింపలేకపోయింది. ఇటీవల జరిగిన పరిణామాలు ఆయనను ఎన్నో ఇబ్బందులకు గురిచేశాయి.కేసీఆర్ డ్రీమ్ ప్రాజెక్టుగా భావించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై వస్తున్న తీవ్ర అవినీతి ఆరోపణలు, ప్రాజెక్టులోని కొన్ని భాగాలకు ఇటీవల సంభవించిన నష్టం వంటి అంశాలు ఆయనకు మరింత మానసిక భారాన్ని చేకూర్చాయి. దీనిపై న్యాయ విచారణలు జరుగుతుండటం, ప్రజల్లో దీనిపై పెరిగిన వ్యతిరేకత ఆయన ప్రతిష్టను దెబ్బతీశాయి. గతంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు కూడా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు హాజరయ్యారు.ఈ పరిణామాలు, అధికారం కోల్పోయిన తర్వాత ఎదురయ్యే సవాళ్లు, కేసుల భయం, పార్టీని తిరిగి నిలబెట్టుకోవాల్సిన బాధ్యత, గత ప్రభుత్వ ఆర్థిక విధానాలపై వస్తున్న విమర్శలు వంటివన్నీ కేసీఆర్ ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఆయన త్వరగా కోలుకోవాలని తన పార్టీ కార్యకర్తలు, అభిమానులు కోరుతున్నారు.

# మాకు మంత్రి పదవి ఇవ్వండి సార్ ప్లీజ్

**మల్లికార్జున్ ఖర్గేకి పోటాపోటీ నివేదికలు అందించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు**

**ఖర్గేను కలిసి తమ అభ్యర్థనలు వినిపించిన ఎమ్మెల్యేలు మల్రెడ్డి రంగారెడ్డి, ప్రేమ్ సాగర్ రావు, బాలు నాయక్, రామ్మోహన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి**

హైదరాబాద్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖార్గేను పలువురు ఎమ్మెల్యేలు కలిసారు. ఎమ్మెల్యేలు మల్రెడ్డి రంగారెడ్డి, ప్రేమ్ సాగర్ రావు, బాలు నాయక్, రామ్మోహన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి అయనను కలిసి మాకు మంత్రి పదవి ఇప్పించడని నివేదికలు ఇచ్చారు.

అత్యధిక జనాభా ఉన్న హైదరాబాద్?రంగారెడ్డి జిల్లాలో మంత్రి లేకపోవడం ఇదే మొదటిసారని మల్రెడ్డి రంగారెడ్డి తెలిపారు. బంజారాల్లో 80% మంది కాంగ్రెస్ కి మద్దతుగా నిలిచారని, అయినా తనకు మంత్రి పదవి ఇవ్వలేదని బాలు నాయక్ అన్నారు.

రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వారిలో మంత్రి పదవి లేనిది తానొక్కడికే అని న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి విన్నవించుకున్నారు.

పార్టీ సీనియర్గా తనకు అవకాశం ఇవ్వాలని సుదర్శన్ రెడ్డి నివేదికలు అందజేయగా, ఖర్గే మాత్రం ఎవరికీ ఎలాంటి హామీ ఇవ్వకుండా అందరి అభ్యర్థనలను విన్నారు.

# గులాబీలో చీలక ఆనవాళ్లు..




హైదరాబాద్, జూలై 4 బీఆర్ఎస్ లో చీలిక స్పష్టంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ లో కేసీఆర్ తర్వాత కేటీఆర్ నాయకత్వాన్ని తాను అంగీకరించే ప్రశ్నే లేదని కల్వకుంట్ల కవిత స్పష్టం చేస్తున్నారు. ఓ టీవీ చానల్ కు ఇచ్చిన పాడ్ కాస్ట్‌లో తన అభిప్రాయాలను స్పష్టంగా చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ నిర్మాణంలో తన పాత్ర ఉందని.. ఇక ముందు కూడా ఉంటుందని.. బీఆర్ఎస్ పార్టీ తనదని కవిత వ్యాఖ్యానించారు. కవిత చేసిన వ్యాఖ్యలు ఆమె రాజకీయ పయనం విషయంలో ఎంత స్పష్టంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చని రాజకీయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తనను బీఆర్ఎస్ పార్టీకి దూరం చేసే కుట్ర జరుగుతోందని కవిత అంటున్నారు. బీఆర్ఎస్ పార్టీలో కీలకంగా ఉంటున్న తన అనుచరుల్ని పార్టీ ఆఫీసులోకి రానివ్వడం లేదన్నారు. కవిత మనుషులకు తెలంగాణ భవన్ లో పనేమిటని ప్రశ్నిస్తున్నారని ఆమె అంటున్నారు. పార్టీలో ప్రస్తుతం తనను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆమె నేరుగానే చెబుతున్నారు. కొత్త పార్టీ ఆలోచనల్లేవు అని బలంగా చెప్పారు కానీ.. బీఆర్ఎస్ పార్టీ తనదేనని అంటున్నారు. పార్టీలో తనకెదురైనా.. ఎదురవుతున్న పరిస్థితులు.. తండ్రి కేసీఆర్ కూడా పట్టించుకోవడం లేదని కవిత పరోక్షంగా చెప్పారు. కేటీఆర్‌తో తనకు మాటలు లేవన్న విషయాన్ని అంగీకరించారు. పార్టీ విషయాలను ఇంటర్నల్‌గా మాట్లాడాలని కేటీఆర్ అంటున్నారని..తాను ఇంటర్నల్ గా మాట్లాడినవన్నీ బయటకు వస్తున్నాయన్నారు. తాను రాసిన లేఖ బయటకు ఎలా వచ్చిందని కవిత .. నేరుగా కేటీఆర్‌ను ప్రశ్నించారు. తనను పార్టీకి దూరం చేసేందుకు ఓ శక్తి బలంగా ప్రయత్నిస్తోందని కవిత అనుమానాలు వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలపై తనపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారం, ట్రోల్స్ గురించి తండ్రి కేసీఆర్‌కు చెప్పానని.. ఈ ట్రోలింగ్ ను ఆపాలని కఠిన చర్యలు తీసుకోవాలని కోరానన్నారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కవిత చెబుతున్నారు. ఫోన్ ట్యాప్ విషయంలో తన సన్నిహితులకు సిట్ అధికారులు ఫోన్లు చేసి.. వాంగ్మూలం ఇవ్వాలని కోరారన్నారు. ఫోన్ ట్యాపింగ్ జరిగి ఉంటుంది కానీ దానికి తన తండ్రి కేసీఆర్ కు సంబంధం ఉందని అనుకోవడం లేదని.. ఆయన గొప్పవారన్నారు. సమయమే అన్నింటికీ జవాబు చెబుతుందన్నారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయన్న వ్యాఖ్యలపైనా పరోక్షంగా ఆ దెయ్యాలు ఎవరో చెప్పుకొచ్చారు. నాయకత్వ రేసులో తాను ఉంటానని కవిత స్పష్టంగా చెబుతున్నారు. కేసీఆర్ తర్వాత కేటీఆరే నాయకుడని ఇప్పటి వరకూ క్యాడర్ అనుకుంటున్నారు. కానీ కవిత మాత్రం తాను కూడా పోటీ పడతానని అంటున్నారు. జాగృతిని బలోపేతం చేయడం వెనుక అదే వ్యూహం ఉందని భావిస్తున్నారు. కవిత పట్టుదల చూస్తుంటే.. బీఆర్ఎస్ లో రానున్న రోజుల్లో పరిస్థితులు అంత సానుకూలంగా ఉండే పరిస్థితులు లేవని భావిస్తున్నారు

# చంద్రబాబే.. అందరికి బూచి...




హైదరాబాద్, జూలై 4, తెలంగాణ పాలిటిక్స్‌కి చంద్రబాబు బూచి పట్టుకున్నట్టు అనిపిస్తుంది జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే. ఆ పార్టీ ఈ పార్టీ అని కాకుండా తెలంగాణకు సంబంధించిన నేతలు చంద్రబాబును ఒక సాకుగా చూపిస్తూ తమ రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని వరుసగా స్టేట్‌మెంట్స్ ఇస్తూ వస్తున్నారు. పైకి మామూలు కామెంట్స్‌లా కనిపిస్తున్నా నిజానికి వీటి వెనక ఆయా పార్టీల పెద్ద వ్యూహమే కనిపిస్తోంది అంటున్నారు ఎనలిస్ట్ లు.తెలంగాణకు చెందిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు 45 టీఎంసీల నీటి కేటాయింపుపై అభ్యంతరం చెబుతున్న ఏపీ మరోవైపు బనకచర్ల కట్టుకుంటామని చెప్పడమేంటని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కేంద్రంతో భాగస్వామిగా ఉన్నంత మాత్రాన తెలంగాణకు చంద్రబాబు అన్యాయం చేస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఎంత వరకైనా పోరాడతామని రేవంత్ రెడ్డి సహా మంత్రులు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో వివరించే ప్రయత్నం చేశారు. ఒకవైపు బనకచర్లతో తెలంగాణకు ఎలాంటి నష్టం జరుగదు, కేవలం వరద సమయంలో గోదావరి మిగులు జలాలను మాత్రమే వాడుకుంటామని చంద్రబాబు చెబుతున్నా తెలంగాణ సీయం మాత్రం పదేపదే బనకచర్లపై అభ్యంతరాలు చెబుతున్నారు.బీఆర్ఎస్ వాదన మరోలా ఉంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ వారు ఏపీ సీఎం చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారు. చంద్రబాబు గోదావరి నీటిని ఏపీకి దోచుకెళ్ళి పోవాలని చూస్తున్నా రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదంటూ ఆ పార్టీ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి లాంటి వాళ్ళు ఘాటుగా స్పందిస్తున్నారు. అంతే కాకుండా ఇటీవల బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా రామచందర్‌రావు ఎన్నిక వెనుక చంద్రబాబు ప్రభావం ఉందని ఃఖీూ సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రచారం చేస్తున్నాయి. డీకే అరుణ, ఈటెల రాజేందర్, రాజా సింగ్ లాంటి వాళ్ళను పక్కనబెట్టి చంద్రబాబు అనుకూలుడైన రామచందర్‌రావుకి ఆ పదవి ఎలా ఇస్తారంటూ ప్రచారం జరుగుతోంది. నిజానికి చంద్రబాబు రామచంద్రరావు మధ్య అలాంటి సాన్నిహిత్యం ఉన్నట్టు కనిపించదు.బిజెపి కూడా తెలంగాణలో చంద్రబాబు ముద్ర పడకుండా ఉండడం కోసం తీవ్ర విమర్శలు చేస్తూ వస్తోంది. నాలుగేళ్లు గడిస్తే చంద్రబాబు ఇంట్లోంచి లేవలేడని అలాంటప్పుడు ఆయన ప్రభావం తమపై ఎందుకు ఉంటుందని బిజెపి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి గట్టిగా విమర్శించారు. తమ పార్టీకి అధ్యక్షుడ్ని నియమించాలంటే చంద్రబాబు సాయం తీసుకోవాల్సిన అవసరం లేదని తమ అధిష్టానానికి లేదని కిషన్ రెడ్డి లాంటి సీనియర్ నేతలు వాళ్ల చెబుతూ వస్తున్నారు. తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారు : తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డితెలంగాణలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారని కాంట్రాక్టులు ప్రాజెక్టులు అన్నీ వాళ్ళ చేతుల్లోనే ఉన్నాయని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ఆరోపించడం తాజాగా సంచలనమైంది. మంచిగా చెబితే వాళ్ళు మాట వినరని అలాంటి వాళ్లకు నల్లా కనెక్షన్లు, కరెంట్ కనెక్షన్‌లూ కట్ చేయాలని తీవ్రమైన విమర్శలు చేశారాయన.విచిత్రంగా పార్టీలకు అతీతంగా అందరూ చంద్రబాబుని తెలంగాణలో టార్గెట్ చేయడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. దీని వెనుక తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్ళీ పైకి తీసుకువచ్చి ఓటర్ పోలరైజేషన్ చేయడం కోసం జరుగుతున్న ఒక ప్రయత్నంగా ఎనలిస్టులు చెబుతున్నారు. త్వరలో తెలంగాణలో జిహెచ్ఎంసి లాంటి ఎన్నికలు జరగబోతున్నాయి. అక్కడ సెటిలర్ల ఓట్లు పార్టీల వారీగా చీలిపోయినా తెలంగాణ ఓటింగ్ మాత్రం తమకే దక్కాలని అన్ని పార్టీలు కోరుకుంటున్నాయి. ఇటీవల చంద్రబాబు ఇచ్చిన కొన్ని ఇంటర్వ్యూల్లో తెలంగాణలో పోటీ చేసే అంశంపైన దృష్టి పెడుతున్నట్టు తెలిపారు. దానితో అలర్ట్ అయిన తెలంగాణ పొలిటికల్ పార్టీలు ముందుగానే తెలంగాణ ఓటర్లను తమవైపు ఆకర్షించడం కోసం రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది. అందుకే జరుగుతున్న ప్రతి రాజకీయ పరిణామాన్ని చంద్రబాబుతో ముడిపెట్టి లబ్ధి పొందాలని తెలంగాణలోని పొలిటికల్ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ పరిణామాలు ఇంకెన్ని మలుపులకు దారి తీస్తాయో చూడాలి.

# కొండా పెత్తనం కోసమేనా



వరంగల్ , జూలై 4,కొండా కుటుంబం పంచాయతీ వరంగల్ లో కొనసాగుతూనే ఉంది. గత కొద్ది రోజులుగా వరంగల్ లోని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర ఎమ్మెల్యేలకు, కొండా కుటుంబానికి మధ్య పొసగడం లేదు. డైరెక్ట్ వార్ కు దిగారు. దీంతో వరంగల్ లో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో చులకనగా మారిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. కొండా మురళి ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ లోకి వచ్చిన నేతలపై చేసిన కామెంట్స్ కలకలం రేపాయి. పార్టీకి రాజీనామా చేయకుండా వచ్చి పెత్తనం చేస్తున్నారని, గతంలో వీరి వల్ల అనేక మంది అధికారాన్ని కోల్పోయారని కూడా వ్యాఖ్యానించారు. ఈ పంచాయతి కాంగ్రెస్ క్రమశిక్షణ ముందుకు వచ్చింది. క్రమశిక్షణ కమిటీ ఎదుటకు హాజరయిన కొండా మురళి లేఖ రాయడం మరో సంచలనానికి కారణమయింది. ముందే టిక్కెట్లు ప్రకటించుకున్నారా? మళ్లీ వ్యాఖ్యలతో... దీంతో వరంగల్ లోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమావేశమై పార్టీ నాయకత్వానికి లేఖ రాశారు. కొండా మురళి వల్ల పార్టీ పరిస్థితి మరింత దిగజారుతుందని చెప్పారు. సొంత పార్టీ నేతలపై కొండా మురళి చేసిన విమర్శలను కూడా వీడియోలు, పత్రిక క్లిప్పింగ్ లను సమర్పించారు. కొండా మురళి పై చర్యలు తీసుకోవాలని కరారు. బస్వరాజు సారయ్య ఏకంగా కొండా మురళిపై పార్టీ హైకమాండ్ కు లేఖ రాశారు. మరోవైపు తాను గత ఎన్నికల్లో పదహారు ఎకరాలు అమ్మి 70 కోట్ల రూపాయలు ఖర్చు చేశానని కొండా మురళి చేసిన వ్యాఖ్యలు కూడా కలకలం రేపాయి. దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్ తో పాటు పార్టీ హైకమాండ్ కు కూడా కొందరు ఫిర్యాదు చేయడానికి రెడీ అవుతున్నారు. కొండా మురళి దంపతులు పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ ను కలిశారు. తాను బీసీ వర్గానికి చెందిన నాయకుడినని, తాను వరంగల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో గెలిపించుకుని వస్తానని కొండా మురళి తర్వాత మీడియా ఎదుట వ్యాఖ్యానించారు. తాను ఎవరికీ భయపడబోనని, తనపై కొందరు కావాలని కుట్ర చేస్తున్నారన్న కొండా మురళి పార్టీ హైకమాండ్ నిర్ణయం తనకు శిరోధార్యం అంటూనే తన కుమార్తె పరకాల టిక్కెట్ ను కోరుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. అది ఆమె వ్యక్తిగతమని అన్నారు. ఈ నెల 5వ తేదీ లోపు కొండా మురళిపై చర్యలు తీసుకోకుంటే తాము హైకమాండ్ దృష్టికి తీసుకెళతామని వరంగల్ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. మొత్తం మీద కొండా ఎపిసోడ్ కొనసాగుతూనే ఉన్నట్లుంది.

మళ్లీ కాంట్రవర్సీ

వరంగల్ కు చెందిన కొండా మురళి ఫ్యామిలీ ఎక్కడ ఉన్నప్పటికీ కాంట్రవర్సీకి కేరాఫ్ గా ఉంది. కొండా సురేఖ మంత్రి పదవిలో ఉంటూ కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇటీవల అనేక సందర్భాల్లో కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు వివాదంగా మారాయి. టాలీవుడ్ హీరోల కుటుంబం పై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు నాడు పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టాయి. అదే సమయంలో తర్వాత మంత్రులుగా ఉన్న వాళు లంచాలు తీసుకోనిదే ఏ పనిచేయరని చేసిన వ్యాఖ్యలు కూడా సొంత పార్టీలో నేతలకు కన్నెర్రకు కారణమయ్యాయి. ఇక తాజాగా కొండా మురళి చేసిన వ్యాఖ్యలతో మరోసారి కాంగ్రెస్ పార్టీలో కలకలం రేపింది. సొంత పార్టీ నేతలనే కొండా మురళి లక్ష్యంగా చేసుకుని మాట్లాడారుకొండా మురళి వరంగల్ లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ సిగ్గుంటే పార్టీ మారినప్పుడు పదవులుకు రాజీనామాలు చేయాలని చేసిన వ్యాఖ్యలు సూటిగా తగిలిన నేతలు రాజకీయంగా ఇబ్బందులు పడుతున్నారు. సుదీర్ఘకాలంగా మంత్రిగా పనిచేశానని చెప్పుకునే నేతలు వారు గతంలో పనిచేసిన పార్టీలను భ్రష్టు పట్టించారన్నారు. నాడు తెలుగుదేశం లో చంద్రబాబు నాయుడిని, తర్వాత బీఆర్ఎస్ లో కేసీఆర్ ఓటమికి కారణమయ్యారని కొండా మురళి కడియం శ్రీహరిని ఉద్దేశించి అన్నారని ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరి దీనిని కూడా ఆగం చేస్తున్నారని ఆయన చేసిన వ్యాఖ్యలు కడియం శ్రీహరితో పాటు రేవూరి ప్రకాశ్ రెడ్డి, బస్వరాజు సారయ్య వంటి వారు కొండా మురళి వ్యాఖ్యలకు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. వీరంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యం సన్నిహితులే. మూడు టిక్కెట్లు తమకు అంటూ... ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని ఉద్దేశించి కూడా కొండా మురళి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 75 ఏళ్ల ముసిలోడు పరకాలకు వచ్చాడని, దరిద్రమైన నాయకుడని, నా రెండు కాళ్లు పట్టుకుని గెలిపించమని అడిగితే తాను సాయం చేశానని కొండా మురళి అన్నారు. అంతటితో ఆగకుండా వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తన కూతురు సుస్మిత ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని, తాను కూడా ఎమ్మెల్సీ అవుతానని, కొండా సురేఖ కూడా వరంగల్ తూర్పు నుంచి పోటీ చేస్తారని కొండా మురళి తనకు తానే టిక్కెట్లను డిక్లేర్ చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. దీంతో ఈరోజు కొండా మురళి తమపై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా కడియం శ్రీహరి, నాయని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి సమావేశమై హైకమాండ్ కు ఫిర్యాదు చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. మొత్తం మీద మరోసారి కొండా కుటుంబం ట్రబుల్ లో పడిందనే చెప్పాలి

# సోషలిస్ట్, సెక్యులర్ పదాలు తొలగించాలా..?

భారత దేశం అంటేనే లౌకిక దేశంగా పేరు. ఇపుడా లౌకిక అనే పదాన్నే తీసెయ్యాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయ్. అలాగని ఇది అందరి నుంచీ కాదు.. ఒక సెక్షన్ నుంచి మాత్రమే ఈ తరహా డిమాండ్ వినవస్తోంది. రాజ్యాంగ పీఠికలో సోషలిస్ట్, సెక్యులర్ పదాలు తొలగించాలి దత్తాత్రేయ హ్పసబెలే. రాజ్యాంగ పీఠికలోని సోషలిస్ట్, సెక్యులర్ పదాలను తొలగించాలని ఖీూా నేత చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి.

ఎమర్జెన్సీ సమయంలో ఈ పదాలను కాంగ్రెస్ బలవంతంగా చేర్చిందని, దీనిపై చర్చ జరగాలని దత్తాత్రేయ హ్పసబెలే చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, ఆరెస్సెస్ మాస్క్ తొలిగిపోయిందని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

బీజేపీ, ఆరెస్సెస్.. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తీసుకురావాలని చూస్తున్నాయని.. రాహుల్ గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. ఇందుకు కొనసాగింపుగా ఉపరాష్ట్రపతి ధన్కర్ సైతం ఇదే వాయిస్ వినిపించారు. రాజ్యాంగ పీఠికలో సోషలిస్ట్, లౌకిక అనే పదాలను జోడించడం సనాతన స్ఫూర్తికి విరుద్దమని అన్నారాయన. 1975లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన అత్యవసర పరిస్థితి దేశ రాజ్యాంగానికే చీకటి కాలమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ అన్నారు. సోషలిస్ట్, సెక్యులరిస్ట్ పదాలు ప్రవేశికలో ఉండాలా వద్దా? అనే దానిపై చర్చ జరగాలని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబెలే చెప్పిన రెండు రోజుల తర్వాత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఈ వ్యాఖ్యలు చేయడంతో ఇదో చర్చనీయాంశమైంది. దిగారు. అంతే కాకుండా సనాతన ధర్మానికి విరుద్ధం అన్న కామెంట్లు సైతం చేశారు. సరిగ్గా ఇదే సమయంలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సైతం ఇదే అంశంపై కామెంట్ చేశారు. కేంద్ర వ్యవసాయ మంత్రి అయిన శివరాజ్ సింగ్.. భారతదేశంలో సోషలిజం అవసరం లేదని అన్నారు. లౌకిక వాదం మన సంప్రదాయం కాదని అన్నారు. ఎమర్జెన్సీలో వీటిని చేర్చారనీ.. ఇది అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలో భాగం కానే కాదని అన్నారాయన. భారత్ మే సమాజ్ వాద్ కీ జరూరత్ నహీ హై, ధర్మ నిరపేక్ష్ హమార సంస్కృతి కా మూల్ నహి హై.. ఔర్ ఇస్లీయే పర్ జరూర్ విచార్ హోనా చాహియే.. అన్నారు. దీనర్ధమేంటంటే.. భారతదేశంలో ఈ రకమైన పదాలు మనకు అవసరం లేదని అన్నారు చౌహాన్. కాబట్టి, దీనిపై చర్చించాలి అన్నది ఈ వ్యాఖ్యల సారాంశం. ఒకరకంగా చెబితే.. ఇది ఆర్ఎస్ఎస్ పిలుపునకు పరోక్ష మద్దతుగా భావిస్తున్నారు. లౌకిక వాదం మనది కాదన్న అస్సాం సీఎం హిమంత. ఇక ఇదే అంశంపై మరొక నేత కూడా కామెంట్ చేశారు. ఆయనే.. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ. సోషలిజం, లౌకికవాదం మనవి కావు. పాశ్చాత్య భావనలని, ఈ పదాలకు భారత నాగరికతలో స్థానం లేదని అన్నారు. మీరు కాస్త గట్టిగా ఆలోచిస్తే మన అస్తిత్వ సవాళ్లకే మనం అవకాశమిస్తున్నామని.. ఇదొక చీడ పురుగుగా దేశాన్ని పట్టి పీడిస్తోందని అన్నారు ఉప రాష్ట్రపతి. ఇది వేల సంవత్సరాల నాగరికతను కించ పరుస్తోందని.. ఈ సెక్యులరిజం అన్నది మనదైన సంప్రదాయాన్ని తక్కువ చేసుకోవడం తప్ప మరొకటి కాదని అన్నారు ధన్కర్. ఇది సనాతన ధర్మానికే పూర్తి అవమానకమని కామెంట్ చేశారు ధన్కర్. ఉపరాష్ట్రపతి ధన్కర్ కి రచయిత, మాజీ కర్ణాటక ఎమ్మెల్సీ వీరయ్య రాసిన సంకలనం అంబేద్కర్ సందేశాలు అనే పుస్తకం తొలి కాపీ అందించారు. ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ జగదీప్ ధన్కర్ ఈ కామెంట్లు చేశారు. ఆర్ఎస్ఎస్ అగ్ర నేత నుంచి ఉపరాష్ట్రపతి వరకూ ఈ తరహా కామెంట్లు చేయడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతోంది కాంగ్రెస్. తర్వాత మురుగన్ మానాడు సభలోనూ పవన్ సరిగ్గా ఇలాంటి సెక్యులరిస్టు కామెంట్లు చేశారు. ఇది గత కొంతకాలంగా భారతదేశంలో వినిపిస్తున్న మాట. ఆ మాటకొస్తే మొన్న పూనేకి చెందిన లా స్టూడెంట్ శర్మిష్ట పనోలీ విషయంలోనూ సరిగ్గా ఇలాగే కామెంట్ చేశారు పవన్. దేశంలో సెక్యులరిజం అంటే అది హిందుత్వ వాదులను అనడానికి మాత్రమే పనికొచ్చే ఒకానొక వెసలుబాటు కాదని కామెంట్ చేశారాయన. ఈ ధోరణి వెనక రాజ్యాంగంలోని ఈ సెక్యులరిస్ట్ పదాలే కారణమన్నది వీరందరి వాదనగా తెలుస్తోంది. 1976లో అత్యవసర పరిస్థితి సమయంలో 42వ రాజ్యాంగ సవరణలో భాగంగా లౌకిక, సోషలిస్ట్ అనే రెండు పదాలను ప్రవేశికలో చేర్చారు. అత్యవసర పరిస్థితి తర్వాత అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం 42వ సవరణ ద్వారా రాజ్యాంగంలో చేసిన అనేక ఇతర మార్పులను తిప్పికొట్టినప్పటికీ, అది సోషలిస్ట్, సెక్యులరిస్ట్ అనే పదాలను అలాగే ఉంచింది. వాస్తవానికి, 2014లో నరేంద్ర మోడీ నేతృత్వంలో బిజెపి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, నాటి బిజెపి అధ్యక్షుడు అమిత్ షా 2015లో పార్టీ లైన్‌ను స్పష్టం చేశారు. నేటి పీఠిక అలాగే ఉండాలని బిజెపి విశ్వసిస్తుంది. దానిని మార్చాల్సిన అవసరం లేదని అన్నారు. బేసిగ్గా చూస్తే ఇప్పటి వరకూ భారత్ కి రక్షణ కవచం ఈ లౌకిక వాదమే. పాకిస్థాన్ లా ఒక మత తత్వ దేశంగా భారత్ మారితే.. దాని విస్తృత రూపం రేపటి రోజున మరొక విధంగా మారే అవకాశం లేక పోలేదు. కానీ బీజేపీ చూస్తుంటే భారత్ ని లౌకిక వాదం నుంచి పక్కకు తప్పించేందుకు తీవ్ర యత్నాలు చేస్తున్నట్టే కనిపిస్తోందని అంటారు రాజ్యాంగ నిపుణులు. ఏం పాకిస్థాన్ మన నుంచి విడిపోయి ఇస్లామిక్ కంట్రీగా మారినపుడు మన దేశం హిందూ దేశం ఎందుకు కాకూడదన్నది రెగ్యులర్ గా సంఘ్ పరివార్ సభ్యులు వేసే ప్రశ్న. వీరి ఆలోచన ప్రకారం భారత దేశం ఇప్పటి వరకూ లౌకిక వాదం, సామ్యవాదం ద్వారా నష్టపోయినట్టుగానే చెప్పాల్సి ఉంటుంది. సోషలిస్ట్, సెక్యులర్ పదాలు తొలగిస్తే ఏం జరుగుతుంది? ఒక వేళ సోషలిస్ట్, సెక్యులర్ అనే పదాలు తొలిగిస్తే ఏం జరుగుతుంది? అని చూస్తే అది దేశ స్వరూప స్వభావాలను పూర్తిగా మార్చే అవకాశం కనిపిస్తోంది. రాజ్యాంగ సూత్రాలు, విలువలు కూడా బొత్తిగా మారిపోయే ఛాన్సుంది. అంతే కాదు సామాజిక, ఆర్థిక సమానత్వం.. మత స్వేచ్ఛ వంటి అంశాలపై ఇది తన తడాఖా చూపించవచ్చని అంటారు రాజ్యంగ నిపుణులు. ఒక వేళ సోషలిస్ట్ అనే పదం తొలగిస్తే.. దేశ సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం తయారు చేసిన రాజ్యాంగ లక్ష్యాన్నిది బలహీనపరుస్తుంది. సంపద, వనరుల సమాన పంపిణీ, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఇది తీవ్ర ప్రభావం చూపవచ్చని హెచ్చరిస్తారు కొందరు నిపుణులు. సెక్యులర్ అనే పదం తొలగిస్తే, మతపరమైన స్వేచ్ఛ కూడా కోల్పోయే ప్రమాదముంది. మతం ప్రాతిపదికన వివక్షకు వ్యతిరేకంగా ఉన్న రాజ్యాంగ సూత్రం మరింత ఇరుకున పడుతుంది. ప్రభుత్వం కూడా మతం పరంగా పక్షపాత ధోరణిని అవలంబించే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ రెండు పదాల కారణంగా దేశంలో సామాజిక న్యాయం.

ఈ రెండు పదాలు రాజ్యాంగ ప్రవేశికలో చేర్చడం ద్వారా, భారత రాజ్యాంగం సమగ్రత, లౌకికవాదం.. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నట్టు కనిపిస్తుంది. వీటిని తొలగిస్తే, రాజ్యాంగ విలువలు మరింత పలుచనయ్యే అవకాశం కనిపిస్తోందని అంటారు రాజ్యాంగనిపుణులు. ఇతర దేశాలు కూడా ఈ మార్పును గమనించి, భారతదేశంతో సంబంధాలు నెరిపే విధానాన్ని మార్చుకోవచ్చు.

ముఖ్యంగా ఇతర దేశాలలో లౌకికవాదం, సామాజిక న్యాయం పట్ల ఆసక్తి ఉన్నవారిలో మన పట్ల ఇప్పటి వరకూ ఉన్న ధోరణి మారవచ్చు. సోషలిస్ట్, సెక్యులర్ పదాలను తొలగిస్తే, భారత రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలు, విలువలు దెబ్బతినే అవకాశం ఉంది. సామాజిక- ఆర్థిక- సమానత్వం- మతపరమైన స్వేచ్ఛ వంటి అంశాలపై ప్రతికూల ప్రభావం చూపేలా తెలుస్తోంది. అందుకే రాహుల్, దత్తాత్రేయ అన్న వెంటనే తీవ్రంగారియాక్టయ్యారు.

## ఫ్రిజ్ ఎందుకు పేలుతుంది..

హైదరాబాద్, జూలై 4, హైదరాబాద్‌లోని సనత్‌నగర్ రాజానగర్ ప్రాంతంలో గురువారం ఫ్రిజ్ పేలిన ఘటన కలకలం రేపింది. ఓ ఇంట్లో ఉన్న రిఫ్రిజిరేటర్ అకస్మాత్తుగా పెద్ద శబ్దంతో పేలిపోవడంతో ఇంట్లో మంటలు చెలరేగాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ప్రాణాపాయం జరగలేదు. కానీ ఈ ఘటన మనందరికీ ఒక స్పష్టమైన హెచ్చరిక. మన ఇళ్లలో రోజూ నిత్యవసరాల కోసం వాడే ఫ్రిజ్ కూడా ప్రమాదానికి దారి తీయగలదన్న విషయాన్ని ఇది రుజువు చేసింది. భారీ శబ్దం.. ఈ ఘటనలో ఇంటి సభ్యులు తెల్లవారుజామున ఫ్రిజ్ నుంచి గట్టిగా పేలుడు శబ్దం విన్నారని చెప్పారు. వెంటనే అక్కడ మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన వారు వెంటనే ఇంటి నుంచి బయటికి పరుగులు తీశారు. ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందగానే ఫైర్ టెండర్, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశాయి. ప్రాథమికంగా అధికారులు ఈ పేలుడు ఫ్రిజ్‌లోని కంప్రెసర్ వల్ల జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. పూర్తి కారణాలు తెలియజేయడానికి దర్యాప్తు కొనసాగుతోంది. ఎలా పేలుతుంది? ఇక్కడ అసలు ప్రశ్న ఎమిటంటే ఫ్రిజ్ ఎలా పేలుతుంది? రిఫ్రిజిరేటర్ అనే పరికరం మనకు రోజూ ఉపయోగపడుతుంటుంది. అది శబ్దం చేయదు, ప్రమాదకరంగా కూడా కనిపించదు. కానీ పక్కాగా ఉపయోగించకపోతే.. అది కూడా ముప్పుగా మారవచ్చు. ముఖ్యంగా కంప్రెసర్ సమస్యలు, గ్యాస్ లీక్, వోల్టేజ్ ఫ్లక్చుయేషన్స్ వల్ల ఫ్రిజ్‌లో పేలుడు సంభవించే అవకాశముంది. కంప్రెసర్ ఓవర్‌హీట్ అయినప్పుడు లేదా గ్యాస్ అధికంగా జమైపోయినప్పుడు, ఏ చిన్న షార్ట్‌సర్క్యూట్ లేదా స్పార్క్ కూడా ప్రమాదానికి దారి తీయగలదు. ఇలా చేస్తే సేఫ్.. ఇలాంటి ప్రమాదాలు నివారించాలంటే కొన్ని భద్రతా చర్యలు తప్పనిసరి. ముందుగా, నాణ్యమైన బ్రాండ్‌కి చెందిన ఫ్రిజ్‌ను మాత్రమే కొనుగోలు చేయాలి. చీప్ బ్రాండ్లు, నకిలీ వస్తువులు లోపభూయిష్టంగా తయారవుతాయి. ఫ్రిజ్‌కు ప్రత్యేకంగా ఒకే ప్లగ్ పాయింట్ కల్పించాలి. మల్టీ ప్లగ్‌లలో టీవీ, వాషింగ్ మెషీన్, మైక్రోవేవ్ వంటివి కలిపి వాడటం ప్రమాదకరం. వోల్టేజ్ సమస్యలు ఉండే ప్రదేశాల్లో స్టాబిలైజర్ వాడటం ఉత్తమం. అదనంగా, ఫ్రిజ్ వెనక భాగం వేడిగా అనిపిస్తే, గ్యాస్ వాసన వస్తే లేదా ఎలక్ట్రిక్ స్పార్కింగ్ వంటివి కనిపిస్తే వెంటనే టెక్నీషియన్‌ను సంప్రదించాలి. ఇంకొంత మంది ఫ్రిజ్‌ను పగటి సమయంలో ఓపెన్ చేస్తూ, రాత్రిళ్లు పూర్తిగా మూసివేస్తూ ఉండటం చూశాం. కానీ దీని వల్ల కంప్రెషర్ నిరంతరం పని చేస్తూ వేడిని ఉత్పత్తి చేస్తుంది. అది ఓవర్ లోడ్ అవడం వల్ల పేలుడు సంభవించే అవకాశం ఉంది. అలాగే ఫ్రిజ్‌లో పదార్థాలను నింపడం వల్ల గాలి ప్రసరణ జరగకపోవడం వల్ల కూడ ఫ్రిజ్ ఓవర్ హీట్ అవుతుంది. ఎప్పటికప్పుడు క్లీనింగ్, సర్వీసింగ్ చేయడం మంచిది. ఈ ఘటనలో మంటలు త్వరగా అదుపులోకి రావడంతో నష్టం తక్కువగా ఉంది. కానీ ఇదే మరొక ఇంట్లో జరిగితే పరిస్థితి భిన్నంగా ఉండేది. ప్రతి ఇంట్లో రిఫ్రిజిరేటర్ ఒక తప్పనిసరి పరికరమైపోయిన ఈ రోజుల్లో, దీన్ని ఎలా వాడాలో తెలుసుకోవడం అత్యవసరం. ఇంట్లో ఉండే చల్లదనం కలిగించే పరికరం.. చెలరేగే మంటలకు కారణమవుతుందా? అనే అనుమానం ఎంత తీవ్రంగా ఉంటుందో.. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అది నిజంగా జరిగే ప్రమాదం. ఫ్రిజ్ వాడకంలో నిర్లక్ష్యం ప్రాణాలకు హానికరమయ్యే ప్రమాదం ఉన్నందున, కుటుంబ సభ్యుల రక్షణ కోసం మేము తీసుకునే ముందు జాగ్రత్తలే మన భద్రతకు బలమైన గోడ. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. చిన్న ఘటనలు, పెద్ద ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. అందుకే అప్రమత్తతే అసలైన రక్ష

## ప్రపంచ పోలీస్ క్రీడల్లో టీటీడీ సెక్యూరిటీ,విజిలెన్స్ అధికారుల అద్భుత విజయం

### దేశానికి బంగారు, కాంస్య పతకాలు టీటీడీకి గర్వకారణం




### విజేతలను అభినందించిన టీటీడీ చైర్మన్, ఈవో

తిరుమల, అమెరికాలోని బర్మింగ్‌హామ్ నగరంలో జరిగిన ప్రపంచ పోలీస్ మరియు ఫైర్ గేమ్స్ - 2025 పోటీల్లో టీటీడీ సెక్యూరిటవిజిలెన్స్ విభాగానికి చెందిన ఇద్దరు అధికారులు అరుదైన క్రీడా ప్రతిభను ప్రదర్శిస్తూ అద్భుత విజయాలు సాధించి జాతీయ మువ్వెన్నల పతాకాన్ని రెపరెపలాడించారు. 45 సంవత్సరాల పైబడిన విభాగం సింగిల్స్ టెన్నిస్ పోటీలో టీటీడీ విజీవో ఎ.సురేంద్ర స్వర్ణ పతకాన్ని గెలుచుకోగా, 55 సంవత్సరాల పైబడిన విభాగం సింగిల్స్ టెన్నిస్ పోటీలో వీజీవో శ్రీ ఎన్టీవీ రామ్ కుమార్ కాంస్య పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, టీటీడీ ఈవో జె.శ్యామలరావు విజేతలను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా 80 దేశాల పోలీస్, ఫైర్ విభాగాల నుంచి 9,000 మంది అథ్లెట్లు పాల్గొన్న ఈ ద్వైవార్షిక పోటీల్లో టీటీడీ అధికారుల విజయాలు దేశానికే గర్వకారణమని, టీటీడీకి ఇది ఒక గొప్ప గౌరవంగా నిలిచిందని కొనియాడారు. అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవో వీ.వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణలు కూడా విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ జాతీయ స్థాయి విజయం టీటీడీ సెక్యూరిటీ, విజిలెన్స్ విభాగం లోని అధికారుల నైపుణ్యాన్ని, నిబద్ధతను చాటిందని, ప్రపంచవ్యాప్తంగా టీటీడీ ప్రతిష్టను మరింత పెంచేలా ఈ విజయం తోడ్పడిందని పేర్కొన్నారు.

## తెల్లదొరల పాలిట సింహ స్వప్నం అల్లూరి

### - ప్రొ. జి. బాలసుబ్రమణ్యం



తిరుపతి, మన్యంలో తెల్లదొరల పాలిట సింహస్వప్నం శ్రీ అల్లూరి సీతారామ రాజు అని అనంతపురం ఎస్.కె.యూనివర్శిటీ తెలుగు విభాగం ఆచార్యులు ప్రొ. జి. బాలసుబ్రమణ్యం తెలిపారు. టిటిడి ఆధ్వర్యంలో తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో శ్రీ అల్లూరి సీతారామ రాజు 128వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన్యం ప్రాంతాలలో తెల్ల దొరల దోపిడిపై అల్లూరి సీతారామ రాజు పోరాటం చేసి యోధుడు అయ్యారని మాట్లాడారు. బడుగు ప్రజల కోసం అల్లూరి తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని, అల్లూరి కుటుంబ సభ్యులు సైతం నేటికి సామాన్య జీవితాన్ని గడపుతున్నారని ఆయన గుర్తు చేశారు. అల్లూరి సీతారామ రాజు త్యాగాలను చెప్పుకుని లబ్ది పొందాలనే ఆలోచన అల్లూరి కుటుంబ సభ్యులకు లేదని, కష్టాన్ని నమ్ముకుని బ్రతకాలని, నిరాడంబరంగా జీవితాన్ని గడపడం వారి గొప్పతనానికి నిదర్శనం అన్నారు. అల్లూరి సీతారామరాజులోని ధాదృత్వం, క్షమాగుణం, దేశభక్తి, ఆధ్యాత్మికత, పోరాడేతత్వంను నవతరం ఆకలింపుచేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా టిటిడి ఎస్టేట్ ఆఫీసర్ శ్రీమతి జి. సువర్ణ మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారా మన్యం ప్రజల హక్కులకు రక్షణగా ఉంటూ చివరి నిమిషం వరకు పోరాడారని చెప్పారు. అల్లూరి సీతారామ రాజు ఆ రోజుల్లో తప్పని పరిస్థితుల్లో తిరుగుబాటు ధోరణితో హక్కుల కోసం పోరాటం చేశారని, నేటి యువత ఆయనలోని ధైర్యాన్ని మననం చేసుకుని జీవితంలో ఒడిదుడుకులను ఎదుర్కోవాలని సూచించారు.

## ఘనంగా అల్లూరి సీతారామరాజు 128వ జయంతి మహోత్సవం

### జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్



తిరుపతి , మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిదాయక జీవితం, అందరికి ఆదర్శమని, వారి త్యాగాలను మరువకుండా తప్పక స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ లోని మీటింగ్ హాలు నందు మన్యం వీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజు 128వ జయంతి మహోత్సవం సందర్భంగా శ్రీ అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి డి ఆర్ ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో కలసి జిల్లా కలెక్టర్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..అల్లూరి సీతారామరాజు గారి జీవితం ప్రతి భారతీయుడికి గర్వకారణమని తెలిపారు. 1897 జూలై 4న సూర్యనారాయణమ్మ, వెంకటరామరాజు దంపతులకు జన్మించారని, అల్లూరి సీతారామరాజుకు చిన్ననాటి నుంచే దైవభక్తి, దానగుణం, నాయకత్వ లక్షణాలతో విలక్షణమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉన్నారన్నారు. నిత్యం ధ్యానం, పూజలతో జీవనశైలి కొనసాగించిన ఆయన, స్వాతంత్ర్య సమరయోధుడిగా అవతరించారని తెలిపారు. మన్యం ప్రాంతంలోని గిరిజనుల బాధలను దగ్గరగా గమనించి, తెల్లదొరల దమన రాజకీయానికి వ్యతిరేకంగా గళమెత్తిన అల్లూరి సీతారామ రాజు, ప్రజల్లో చైతన్యం నింపి, వారికి ధైర్యసాహసాలను కలిగించి పోరాట మార్గాలు నేర్పించారన్నారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అన్నారు. ఇతను జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి, దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడు అని తెలిపారు. కేవలం 27 ఏళ్ళ వయసులోనే చాలా పరిమితవనరులతో బ్రిటీస్ సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొని వీర మరణం పొందిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఆయన త్యాగం భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో ఒక చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోయిందని కలెక్టర్ అన్నారు. ధ్యానం, దైవభక్తి, ధైర్యసాహసాల సమ్మేళనమైన అల్లూరి జీవితచరిత్ర యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని, ఆయన ఆశయాలు, చూపిన మార్గం నేటి తరాలందరికీ మార్గదర్శకంగా ఉండాలని కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, శివ శంకర్ నాయక్, సుధారాణి, రోజ్ మాండ్, జిల్లా అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి.

## సీజనల్ వైద్యుల పై అప్రమత్తంగా ఉండాలి.

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.




**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం) జులై 4 :** మెరుగైన వైద్య సేవలు అందించాలని, సీజనల్ వైద్యుల పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.

శుక్రవారం ఏటూరునాగారం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. అకస్మిక తనిఖీ చేసి, హాస్పిటల్లోని, క్యాజువల్టీ, పి.ఎన్. సి., డెంగు వార్డులను పరిశీలించి, రోగుల యొక్క ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, అందుతున్న వైద్య సేవలు తీరును అలాగే మెనూ ప్రకారంగా అందజేస్తున్న భోజన సౌకర్యాన్ని రోగులను మొదలగు విషయాలను రోగులను అడిగి తెలుసుకున్నారు.

హాస్పిటల్కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆస్పటల్ సూపరింటెంట్ సురేష్ కు తెలిపారు. అలాగే హాస్పిటల్ బిల్డింగును పరిశీలించి కారిడార్లో లీకవుతున్న నీటి తిరును కూడా అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ డాక్టర్ సురేష్ ఆసుపత్రి స్టాఫ్ నర్సులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదర్శ మండల సమాఖ్య సేవలు భేష్

## ఆత్మ నిర్బర్ సంఘాతన్ అవార్డుకు ఎంపికవడం అభినందనీయం

## మహిళా సమాఖ్యకు నిరంతరం ఆదాయం చేకూరేందుకు గ్యాస్ ఏజెన్సీ మంజూరు

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

## కలెక్టర్ ను కలిసిన ఆదర్శ మండల సమాఖ్య సభ్యులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై - 04 (ప్రజాబలం ప్రతినిధి)**ఇల్లంతకుంట మండలము ఆదర్శ మహిళా సమాఖ్య సేవలు భేష్ అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కొనియాడారు. ఈ మండల సమాఖ్య కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆత్మ నిర్బర్ సంఘాతన్ అవార్డుకు ఎంపిక కాగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను మర్యాద పూర్వకంగా కలిసారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్య బ్యాంకు రుణాల అందజేత, రికవరీ, క్రమం తప్పకుండా సమావేశాల నిర్వహణ, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడం పై జిల్లా కలెక్టర్ అభినందించారు.

నిరంతర ఆదాయానికి గ్యాస్ ఏజెన్సీ మంజూరు

ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్యకు నిరంతరం ఆదాయం వచ్చేలా గ్యాస్ ఏజెన్సీ మంజూరు చేయాలని

డీఆర్డీఓ శేషాద్రిని కలెక్టర్ ఆదేశించారు. గ్యాస్ ఏజెన్సీతో మండల సమాఖ్య ఆర్థికంగా మరింత బలపడుతుందని

పేర్కొన్నారు. మండల సమాఖ్య బాధ్యులు ఎస్ హెచ్ జీ సభ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా తీర్చిదిద్దేలా కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

ఈ కార్యక్రమంలో డి.ఆర్డి.ఓ శేషాద్రి, డి.పి.ఎం. వంగ రవీందర్, ఏపీఎం వాణి ఎస్ హెచ్ జీ సభ్యులు, తగితరులు ఉన్నారు.

# రోడ్డు వెడల్పులో నష్టపోతున్న కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి మాజీ జెడ్పిటిసి మధుకర్



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి జులై 4 (ప్రజాబలం)** వికారాబాద్ జిల్లా:వికారాబాద్/మర్పల్లి/అభివృద్ధి మేము అడ్డుకోం కానీ రోడ్డు వెడల్పులో నష్టపోతున్న వారికి ప్రభుత్వం నుండి నష్టపరిహారం ఇవ్వాలని మాజీ జడ్పిటిసి మధుకర్ అన్నారు,శుక్రవారం నాడు మర్పల్లి మండల కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు,అనంతరం మండల తహసిల్దార్ పురుషోత్తం కు వినతి పత్రాన్ని అందజేశారు,ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనులను ఎటు 50 ఫీట్లుగా తీసుకుంటున్న అధికారులు,50 ఫీట్లు తీసుకోవడంతో నివాస గృహాలు,వాణిజ్య దుకాణాలు 10 నుంచి 15 ఫీట్ల వరకు నష్టపోతున్నారని అన్నారు,నష్టపోతున్న వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇవ్వాలని, లేనియెడల మండల కేంద్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వ ఆయంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ లకు కేటాయించి, 200 గజాల ఇంటి స్థలమును ఇవ్వాలన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ పైన తమపై కొందరు నాయకులు చిల్లర ఆరోపణలు చేస్తున్నారని, ఎటు 50 ఫీట్ల రోడ్డు విస్తరణ చేయాలని తామే ప్రతిపాదించామని తప్పుడు ఆరోపణలని అన్నారు. మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ స్థలం లో 50 మంది డబ్బాలను వేసుకొని వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగించేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక బలవంతంగా వారిని ఖాళీ చేయించి వారి బతుకులను రోడ్డుపాలు చేసిందన్నారు. అధికారులు ఇష్టానుసారంగా అనుమతులను ఇవ్వద్దని, ముందస్తు సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. నష్టపోతున్న బాధితులు మాట్లాడుతూ మేము గత 30 నుంచి 35 సంవత్సరాలు నుండి అన్ని అనుమతులను పొంది నిర్మించుకున్నామని, ఇలా సడన్ వచ్చి రోడ్డు మధ్యలో నుండి 50 ఫీట్లకు కట్టుకోవాలని చెప్తే మేము ఎక్కడికి వెళ్లాలని, మరికొందరు వ్యవసాయ భూములను అమ్ముకొని నిర్మించుకున్నామని, ఇలా వ్యాపారం పైనే ఆధారపడి జీవిస్తున్న మరికొందరు రోడ్డు వెడల్పు షాపును కోల్పోతున్నామని అనారోగ్యం పాడిన పడ్డారని వారు తెలిపారు.

## ఈడీ విచారణకు అల్లు అరవింద్..

హైదరాబాద్, జులై 4 ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ప్రశ్నించారు. రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్‌లో అరవింద్‌ను మూడు గంటలపాటు విచారించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. 2018-2019లో జరిగిన బ్యాంక్ స్కామ్‌లో ఈడీ విచారణను కొనసాగిస్తోంది. ఇందులో మనీలాండరింగ్ కోణం ఉందని భావించిన ఈడీ.. ఈసీఐఆర్ నమోదు చేసిన తర్వాత విచారణను చేపట్టింది. గతంలో బ్యాంక్‌కు సంబంధించి అవకతవకలు జరిగాయన్న అభియోగాలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతోంది ఈడీ. ఇప్పటికే అల్లు అరవింద్‌ను విచారించిన అధికారులు.. బ్యాంక్ లావాదేవీలు, ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే వారం మరోసారి విచారణకు రావాలని నిర్మాతను ఈడీ అధికారులు ఆదేశించారు. 2024లో హైదరాబాద్, కర్నూలు, ఘజియాబాద్‌లోని వివిధ ప్రదేశాలలో సోదాలు చేసిన ఈడీ.. రూ.1.45 కోట్లను సీజ్ చేసింది. నిందితులు రూ.101.48 కోట్ల రుణ నిధులను మోసపూరితంగా మళ్లించారన్న ఆరోపణలకు సంబంధించి ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇందులో అకౌంట్ హోల్డర్స్‌గా ఉన్న వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తున్నారు. ప్రధానంగా బ్యాంక్ యాజమాన్యం ఎలాంటి నిబంధనలు పాటించకుండా, ఆర్‌బీఐ నిబంధనలు ఉల్లంఘించి రూ.100 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగాలపై ఈడీ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు.

# వైద్యసేవలో నిర్లక్ష్యం సహించం

## × యాదగిరిగుట్ట పిహెచ్ సి లో ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ హనుమంతరావు

## × ఫార్మసీలో మందుల కొరత లేకుండా చూడాలి

## × ప్రసవాల సంఖ్య పెంచాలి

## × అనధికారికంగా గైర్హాజర్ అయిన ల్యాబ్ టెక్నిషియన్ కు షోకాజ్ నోటీసు

యాదగిరిగుట్ట, జూలై 4: యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు . సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు.ఆసుపత్రి లో ల్యాబ్, ఫార్మసీ, ఎమర్జెన్సీ వార్డు లను పరిశీలించారు.ఆసుపత్రి లోని అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేసి ఎంత మంది సిబ్బంది విధులకు హాజరయ్యారని పరిశీలించారు. డాక్టర్స్, హాస్పిటల్ సిబ్బంది రెగ్యులర్ గా వస్తున్నారా లేదా అని ఆరా తీశారు. సమయ పాలన పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓపి రిజిస్టర్ ని చెక్ చేశారు. ప్రతి రోజూ ఆసుపత్రికి ఎంత మంది రోగులు వస్తున్నారని ఆసుపత్రి సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందుబాటులో ఉండి.. వైద్యం కోసం వచ్చిన వారికి సకాలంలో స్పందించి వైద్యం అందించారు అన్నారు. ఆసుపత్రికి ఎంత మంది గర్భిణి స్త్రీలు వస్తున్నారని, ఎంత మంది చెకప్ చేసుకుంటున్నారని, వాళ్ళకి ట్రీట్మెంట్ సరిగా ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ఫార్మసీలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. అవసరమైన మందులు నిల్వ ఉంచాలన్నారు.ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ సుగుణ రాజు అనధికారిక గైర్హాజరు కారణంగా షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమం లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వైసిపి ప్రభుత్వ హయంలో రాజధాని ,పోలవరం నిర్మాణం గాలికొదిలేశారు

## ముఖ్యమంత్రి చంద్రబాబు సంపద సృష్టించి ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.

## ఏపీలో మరో 20 ఏళ్లు స్థిరమైన ప్రభుత్వాన్ని ఇస్తే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు

## వేరుశనగ పంటలో కూలీలతో కలసి కలుపుతీసిన ఎమ్మెల్యే పల్లె సింధూర

## త్వరలో రైతు ఖాతాలో అన్నదాత సుఖీభవ డబ్బులు జమ

## ఇంటింటికి కూటమి పాలనలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



కొత్త చెరువు:04 గత ఐదేళ్ల వైసిపి పాలనలో అమరావతి రాజధాని పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులను పూర్తిగా గాలికి వదిలేశారని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విమర్శించారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువు మండలం మరుకుంటపల్లి పంచాయతీలో ఇంటింటికి కూటమి ప్రభుత్వ పాలన కార్యక్రమంలో భాగంగా ఎంపీ పార్థసారథి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. మరుకుంట పల్లికి విచ్చేసిన ఎమ్మెల్యే ,ఎంపీ, మాజీ మంత్రి కి గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. పూల వర్షం కురిపిస్తూ ప్రజలు నీరాజనాలు పలికారు. ముందుగా గ్రామంలో బీరప్ప స్వామి ఆలయం వద్ద రూ.10లక్షలతో కమ్యూనిటీ భవనానికి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆర్థికంగా సర్వనాశనం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే అమరావతి రాజధాని పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులు పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు అంతే కాకుండా ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన తల్లికి వందనం పథకం కింద ఇంట్లో చదివే ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ.15 వేలు మంజూరు చేశారని తెలిపారు. అంతేకాకుండా 3వేలు ఉన్న పెన్షన్ రూ. 4 వేలకు పెంచి ప్రతినెల 1వ తారీఖున సాయంకాలం లోపు 64 లక్షల పేద కుటుంబాలకు పింఛన్లు మంజూరు చేసిన ఏకైక ప్రభుత్వం దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దక్కుతుందని తెలిపారు. అప్పుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాడని తెలిపారు. ప్రతి ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు మహిళలకు ఉచితంగా అందజేస్తున్నారు అన్నారు అంతే కాకుండా అతి త్వరలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు పంట పెట్టుబడి సాయం కింద తొలి విడతగా 7000 రూపాయలు అందజేస్తామని తెలిపారు. అంతేకాకుండా ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. మరో 20 ఏళ్లు రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం ఉండాలని చంద్రబాబునాయుడే ముఖ్యమంత్రి గా ఉండాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంతో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటి వద్దకు వెళ్లి తెలియజేస్తామని తెలిపారు. 2019 నుంచి 2004 వరకు రాష్ట్రంలో చీకటి పాలన సాగిందని అన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి వైపు నడిపించే సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నారని పేర్కొన్నారు. జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రం లో ఆర్థిక విధ్వంసం కొనసాగిందని మరో 50 ఏళ్లు అభివృద్ధిలో రాష్ట్ర వెనుకబడిందన్నారు. ఇలాంటి తరుణంలో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. దేశానికే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ఒక రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. రాష్ట్రంలో 204 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసి పేదలకు మూడు పూటలా కడుపునిండా అన్నం తినే భాగ్యాన్ని కూటమి ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువులు రెండు రిజర్వాయర్లను కృష్ణాజిల్లాలతో నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పని చేస్తున్నారని అభినందించారు. వడ్డెర సామాజిక వర్గానికి 80 లక్షలతో ఎంపీ లాండ్స్ ద్వారా ఒక కళ్యాణ మండపాన్ని ఓడి చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేసినందుకు , కురుబలకు కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ 10 లక్షలు మంజూరు చెసిన ఎంపీ పార్థసారథిని మాజీమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ కోసం బాగా కష్టపడిన కార్యకర్తలను గుర్తించి వారికి భవిష్యత్తులో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. హిందూపురం పార్లమెంట్ టిడిపి జిల్లా అధ్యక్షులు అంజనప్ప మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని కొనియాడారు.

కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏపి లో అభివృద్ధి జరుగుతుందని మరో ఐదేళ్లలో అభివృద్ధి ఆంధ్ర ప్రదేశ్ గా మారుతుందన్నారు. అనంతరం ఇంటింటికి కూటమి ప్రభుత్వ పాలన అనే కార్యక్రమంలో భాగంగా మరకుంటపల్లి నుంచి పోతులకుంట గ్రామానికి వెళ్తున్న దారిలో వేరుశనగ పంట పొలంలో కలుపుతీస్తున్న కూలీల దగ్గరికి వెళ్లి ఎమ్మెల్యే ఆప్యాయంగా వారిని పలకరించారు.

వారితోపాటు పొలంలో కలుపు తీసి కొద్దిసేపు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వంలో చేస్తున్న అభివృద్ధి పనులను సంక్షేమ పథకాలను వారికి ఎమ్మెల్యే స్వయంగా వివరించారు. అతి త్వరలో రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా తొలి విడతగా 7000 రూపాయలు డబ్బులు రైతు ఖాతాలో జమ చేయనున్నట్లు రైతులకు శుభవార్త తెలిపారు.

ఈ కార్యక్రమంలో కొత్తచెరువు టిడిపి మండల కన్వీనర్లు రామకృష్ణ వలిపి శ్రీనివాసులు టిడిపి సీనియర్ నాయకులు సాలెక్క గారి శ్రీనివాసులు మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి , పోతుల ఉంటా మాజీ సర్పంచ్ సూర్యనారాయణ ,సామకోటి ఆదినారాయణ, సురేష్ ,సుధాకర్ , బండ్లపల్లి సర్పంచ్ రవి ,లోకేశ్ భాగ్య, అనిల్ కుమార్, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో జూలై 06 నుండి 08 వరకు జ్యేష్ఠాభిషేకం

తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో జూలై 06 నుండి 08వ తేదీ వరకు మూడు రోజుల పాటు జ్యేష్ఠాభిషేకం జరుగనుంది. ప్రతి ఆషాఢ మాసంలో తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారికి జ్యేష్ఠాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.ఇందులో భాగంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మొదటి రోజు జూలై 06న ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి కైంకర్యాలు శతకలశ స్నపనం, మహాశాంతి హోమం చేపడుతారు. ఆలయంలోని కల్యాణమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సమర్పణ, బ్రహ్మఘోష తదితర కార్యక్రమాలు వేడుకగా జరుగనున్నాయి.జూలై 07వ తేదీ రెండో రోజున ఉదయం సాంప్రదాయబద్ధంగా కైంకర్యాలు జరిగాక శాత్తుమొరాయి, ఆస్థానం నిర్వహిస్తారు. సాయంత్రం ఉభయ నాంచారులతో స్వామివారు నాలుగు మాడా వీధులలో విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు.జూలై 08వ తేదీ మూడో రోజున తిరుమంజనం, సమర్పణ, కవచ ప్రతిష్ట తదితర కార్యక్రమాల అనంతరం సాయంత్రం కవచ సమర్పణ చేపడుతారు. సాయంత్రం 5.30 - 6.30 గం.ల వరకు ఉభయ నాంచారులతో శ్రీవారు నాలుగు మాడ వీధులలో విహరిస్తారు.

## జూలై 9న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయండి.

## బోయినపల్లి మండల సిఐటియు కన్వీనర్ గురజాల శ్రీధర్ పిలుపు.




**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, బోయినపల్లి, ( ప్రజాబలం),** పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని బలి చేస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మికుల చట్టాల, హక్కుల పరిరక్షణ కోసం జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల సిఐటియు కన్వీనర్ గురజాల శ్రీధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం రోజున బోయిన పల్లి మండల కేంద్రంలో పవర్లూమ్ కార్మికుల ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్ను విడుదల చేయడం జరిగింది. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక వర్గ హక్కులను కాలరాస్తూ కట్టు బానిసలుగా చేసే విధానాలు ఆలంబిస్తుందని ఆయన మండిపడ్డారు.

కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లుగా తీసుకొచ్చి, కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్ లు గ అమలు అయితే కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు లేకుండా, సమ్మె చేసే హక్కు లేకుండా, పని గంటల పెంపు, శ్రమ దోపిడీ, కార్మికులకు భద్రత లేకుండా పోతుంది అన్నారు.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని రంగాలలో పనిచేస్తున్నటువంటి సంఘటిత, అసంఘటిత రంగల కార్మికులందరూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి ఉదయం 10 గంటలకు తరలివచ్చి సమ్మెను విజయవంతం చేయాలని మండల సిఐటియు కన్వీనర్ గురజాల శ్రీధర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల సిఐటియు కన్వీనర్ గురజాల శ్రీధర్, మరియు మండల పవర్లు అధ్యక్షులు దూస జనార్ధన్, సిఐటియు నాయకులు కుదుకల గిరిబాబు, శ్రీపతి దేవయ్య, దేవసాని శ్రీనివాస్, బిల్లా నర్సయ్య, వాసాల శ్రీనివాస్, మహేష్ ని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బిజెపి సమన్వయంతో బీసీ బిల్లు ఆమోదం కై అఖిలపక్షంతో, ప్రధానిని, రాష్ట్రపతిని కలవాలని విజ్ఞప్తి.

### బీసీ రిజర్వేషన్ల అమలులో తేడా రాకుండా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చట్టబద్ధంగా బిల్లుల ఆమోదంతో ఎన్నికలు జరపాలి.

### బీసీ రిజర్వేషన్ల అమలులో అన్యాయం జరిగితే, రాబోవు రోజుల్లో జరిగే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తీవ్రంగా నష్టపోతాయి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం),** శుక్రవారం రోజున వేములవాడ బీసీ సాధికారిత సంఘం ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన కార్యాలయంలో బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పొలాస నరేందర్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ ముఖ్య నేతలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరుపుటకై, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉభయ సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపిన బీసీ బిల్లుల ఆమోదం పెండింగ్ లో ఉందని, తెలంగాణ హైకోర్టు రిజర్వేషన్లు 30 రోజుల్లో ఖరారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన దృష్ట్యా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మరియు రాష్ట్ర బిజెపి పార్టీ అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావులు సమన్వయంతో సమాలోచనలు చేసి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానిని, రాష్ట్రపతిని కలిసి ఒప్పించి, మెప్పించి,చట్టబద్ధంగా, పటిష్టవంతంగా బిల్లులు ఆమోదం పొందేలా కృషి చేయాలని పొలాస నరేందర్ ఇరు పార్టీలను కోరారు.

తెలంగాణ శాసనసభ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య, ఉద్యోగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం జరిగిందని, ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల 42% రిజర్వేషన్లతో ఎన్నికలు జరిపిస్తామని చాలా సందర్భాల్లో పిసిసి అధ్యక్షులు బొమ్మ. మహేష్ కుమార్ గౌడ్ స్పష్టంగా ప్రకటించారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు చట్టబద్ధంగా, శాస్త్రీయంగా 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరపాలంటే కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లుకు ఆమోదం తెలపడం తప్పనిసరి అని, న్యాయ నిపుణులు, మేధావి వర్గాలు చెబుతున్నందున, చట్టబద్ధంగా బీసీలకు రావాల్సిన 42 శాతం రిజర్వేషన్లు అమలు జరిగేలా ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఎన్నికలు జరపాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను నరేందర్ కోరారు.

బీసీ రిజర్వేషన్లు అమలులో తేడాలు జరిగితే రాబోవు రోజుల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తీవ్రంగా నష్టపోతారని బిసి వర్గాలు క్షమించరని నరేందర్ అన్నరు.

ఈ సమావేశంలో పట్టణ బీసీ సాధికారిత సంఘం ప్రధాన కార్యదర్శి ఇల్లందుల వెంకటేష్, జిల్లా బీసీ నేతలు అంబటి సంతోష్, సిహెచ్. రామస్వామి గౌడ్. ఉయ్యాల భూమయ్య, కుంభం రవి, నిమ్మగడ్డ శ్రీనివాస్, మేన రాజేష్, అన్నారు ఇస్తారి, ఎట్టెం సాయి కృష్ణ, కైరా పరశురాములు, సంసాని శ్రీధర్, గోగికరి శ్రీను, కంసాని వెంకటేష్, మిందికారి సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## ఇంత నిర్లక్ష్యమా....

### ప్రాణాలు పోయే వరకు ఎదురు చూస్తారా...?

### కథనాలు వచ్చిన కదలిక లేదు... మొద్దు నిద్ర వీడండి సారు...

### ప్రజాబలం ప్రత్యేక కథనం



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 4(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా: సింగూర్ ప్రాజెక్టు/ఎవరి ప్రాణాలు ఎవరికి అవసరం అనే విధంగా ఉంది ఆర్ అండ్ బి అధికారుల తీరు,ప్రమాదం పొంచి ఉందని దినపత్రికలో వార్త కథనాలు వచ్చిన కదలిక లేదు,ప్రజలకు బ్రిడ్జి సైడ్ రైలింగ్ సురక్షితంగా లేదని ఎంత చెప్పిన నిమ్మకునీరెత్తినట్లుగా ఉంది వ్యవహారం, ప్రతి సంవత్సరం వర్షాకాలం వచ్చిందంటే సింగూర్ ప్రాజెక్టు చూడటానికి పలు ప్రాంతాల నుండి పర్యాటకులు అధికంగా వస్తుంటారు సింగూర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడు బ్రిడ్జి మీద నుండి చూస్తుంటే చూడముచ్చటగా మనసుకి ఉల్లాసంగా ఉంటుంది,ప్రాజెక్టు దిగువ భాగాన ఉన్న సింగూర్ నుండి సదాశివపేట వెళ్ళే బ్రిడ్జికి దాదాపు 3 మీటర్ల మేర సైడ్ రైలింగ్ కూలిపోయింది,బ్రిడ్జి మీద వేళ్ళే వాహనదారులు రైతులు భయాందోళనకు గురవుతున్నారు,మరమత్తులు చేయించాల్సిన అధికారులు మత్తు నిద్రలో ఉన్నారు,కనీసం ప్రమాద స్థలం అని సూచిక బోర్డు పెట్టలేక సోమరితనం సోకింది,పోయేది మా ప్రాణాలు కాదుగా అని అధికారులు గాఢనిద్రలో ఉన్నారు,ప్రమాదకరంగా ఉన్న స్థలాన్ని మరమత్తులు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని, అధికారుల నిర్లక్ష్యానికి ముక్కున వేలేసుకుంటున్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేసుకొని, వెంటనే ప్రభుత్వ సహాయం పొందండి.

### చెక్ డ్యామ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝ.

### చెక్ డ్యామ్ నిర్మాణానికి లోతు వాగు పరిశీలన.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, గంభీరావుపేట, ( ప్రజాబలం ),** ఇందిరమ్మ ఇండ్లు త్వరగా నిర్మించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం తొందరగా పొందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తెలిపారు. శుక్రవారం రోజున గంభీరావుపేట మండలం గోరంటాల, ఎల్లారెడ్డిపేట మండలం గుండారం, వీర్నపల్లి మండలాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. నిర్ణీత స్థలంలో ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. విడతల వారీగా మొత్తం ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు అధికారులు సహకరించాలని సూచించారు. గోరంటాలలో ఇందిరమ్మ ఇండ్ల పనుల్లో జాప్యం అవుతుండడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. వీర్నపల్లి ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులు పరిశీలించి, అధికారులను ఆయన అభినందించారు.

చెక్ డ్యామ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.

గంభీరావుపేట మండలం గోరంటాలలో లోతు వాగు వద్ద చెక్ డ్యామ్ నిర్మాణానికి స్థలాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పరిశీలించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద లోతు వాగు వద్ద చెక్ డ్యామ్ నిర్మాణానికి సర్వే చేయాలని, నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ పర్యటనలో డిఆర్డిఓ శేషాద్రి, ఎంపీడీవోలు, తహసిల్దార్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాయ మాటలతో మోసం చేసి, బంగారంతో ఊడయించిన బిచ్చగాడు.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, వీర్నపల్లి, ( ప్రజాబలం ),** శుక్రవారం రోజున వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలో ఓ బిచ్చగాడు మాయ మాటలతో మోసం చేసి బంగారంతో ఊడయించిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే అడవి పదిర గ్రామానికి చెందిన నిరక్షరాస్యత తల్లి నమ్మినదే తప్పయింది. తన కుమారుడికి ప్రాణహాని ఉందని బూరడి కొట్టించిన బిచ్చగాడు పావుతుల బంగారాన్ని ఎత్తుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది.

అడవి పదిర గ్రామానికి చెందిన చింతల్ తాన లక్ష్మీ అనే మహిళ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. శుక్రవారం ఉదయం ఇంటి వద్ద పనిచేస్తుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి బిచ్చగాడి ముసుగులో వచ్చి, మీ కుమారుడికి ప్రాణాపాయం ఉంది, దేవుడి ఉపాయం చేస్తే తప్పక కాపాడుతాడు అని మాయ మాటలు చెప్పాడు.

వెంటనే బియ్యం తీసుకొచ్చి ఇవ్వమని కోరాడు. తన మాటలు నమ్మిన లక్ష్మి బియ్యం ఇచ్చింది. ఆ వెంటనే ఓ రసాయనపు బొట్టును ఆమె నుదుటిపై పెట్టడంతో మహిళ తనను తాను తెలుసుకోలేని స్థితిలోకి వెళ్ళింది. ఆ పరిస్థితిని ఉపయోగించుకున్న బిచ్చగాడు ఆమె కూతురు వద్ద ఉన్న పావుతులం బంగారాన్ని కూడా బియ్యంలో కలిపి పెట్టమనడంతో, ఇద్దరూ అతని మాటలకే లోనయ్యారు.

గంట తర్వాత ఆ బియ్యాన్ని చూడమని చెప్పి బిచ్చగాడు అక్కడ నుండి కనిపించకుండా పోయాడు. లక్ష్మీ మేల్కొని చూసేసరికి బంగారం లేదని గుర్తించిన మహిళ పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే ఎస్సై లక్ష్మణ్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్సై ప్రజలకు హెచ్చరిక చేస్తూ, ఇలా మాయ మాటలు చెప్పే అనుమానాస్పద వ్యక్తులు మీ గ్రామాలకు వచ్చినట్లయితే వెంటనే 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, అలాంటి వ్యక్తులను నమ్మి మీ ఆస్తిపాస్తులు కోల్పోకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు.

## అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

### మండల విద్యాధికారికి ఆర్ ఎస్ ఎఫ్ విద్యార్థి నాయకుల వినతి పత్రం అందజేత






**వేములవాడ టౌన్ - జూలై 05 (ప్రజాబలం దినపత్రిక )**వేములవాడ పట్టణంలోని అనుమతి లేని పాఠశాలలు నడుస్తున్నాయని శుక్రవారం రోజున ఆర్ ఎస్ ఎఫ్ విద్యార్థి నాయకులు మండల విద్యాధికారి బన్న జికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ ఎస్ ఎఫ్ విద్యార్థి నాయకులు మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో పుట్టగొడుగుల్ల పుట్టుకస్తున్న అనుమతి లేకుండా పాఠశాలలు నడుస్తున్నాయని వివిధ రకాల పేర్ల నామకరణం తో పాఠశాలలను నడిపిస్తున్నారని విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులతో డబ్బే లక్ష్యంగా సంపాదించడానికి ఈ విధమైన మార్గాన్ని ఎంచుకుంటున్నారని తల్లిదండ్రుల ఆశలను అడియాసలు చేస్తున్న అనుమతి లేని పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకొని విద్య వ్యవస్థను కాపాడి విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు దూస సాయిరాం ఏపూరి విష్ణువర్ధన్ భాష అభిషేక్ తాండ్ర రామ్ చరణ్ సంఘం మోక్షిత్ నవీన్ కీర్తి సాగర్ అభినయ్ తదితరులు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# గంగమ్మ తల్లిని దర్శించుకోవడానికి 15 ఫీట్ల దారి ఇవ్వండి

## మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం ఇచ్చిన గంగపుత్రులు





GANGAPUTHRA SANGAM
VEMULAWADA - 505 302.
Dist. Rajanna Sircilla. (T.S.)
Regd. No. 51/56

గంగపుత్ర సంఘం
వేములవాడ, జి॥ రాజన్న సిరిసిల్ల.
(తెలంగాణ రాష్ట్రం)
రి. నెం. 51/56

తేది: 04-07-2025

శ్రీయుత గౌరవనీయులైన మున్సిపల్ కమీషనర్ వేములవాడ గారికి

అర్యా,

విషయం:- గంగమ్మ గుడికి వెళ్ళడానికి 15 ఫీట్ల దారి వదిలేయుట గూర్చి.

పై విషయం పురస్కరించుకొని తమరితో మనవి చేయునది ఏమనగా వేములవాడ గంగపుత్ర సంఘానికి సంబంధించిన మూలవాగులో కొలువైఉన్న గంగమ్మ తల్లిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు దారి అడ్డుగా కూరగాయల స్టాల్స్ నిర్మాణాలు జరుగుతున్నవి ఆ నిర్మాణంలో భాగంగా గుడికి వెళ్ళడానికి 15 ఫీట్ల దారి వదిలేసి భక్తులకు ఇబ్బందులు కలగకుండా స్టాల్స్ నిర్మాణం చేసుకోగలరని మాయొక్క మనవి.

Office of the Municipality Inward No. 03/07/2025 Vemulawada Dist. Rajanna Sircilla

గంగపుత్ర సంఘం అధ్యక్షులు
వేములవాడ
రాజన్న సిరిసిల్ల జిల్లా
సెల్ నెం. 9182380680

**వేములవాడ జూలై -05 (ప్రజా బలం దినపత్రిక )** వేములవాడ పట్టణంలోని మూల వాగు బ్రిడ్జి వద్ద నెలకొన్న గంగమ్మ తల్లిని దర్శించుకోవడానికి దారి లేదని శుక్రవారం రోజున గంగపుత్రులు మున్సిపల్ కమిషనర్ అన్వేష్ కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల సంవత్సరాల నుండి మేము కుల దైవంగా భావించే గంగమ్మ గుడికి నిత్యం పూజలు జరుపుకుంటూ వస్తున్నాము. అయితే మున్సిపల్ అధికారులు కూరగాయలు అమ్మే విక్రయదారులకు స్టాల్స్ ఏర్పాటు చేసే క్రమంలో గంగమ్మ గుడికి వెళ్లే మార్గాన దారి చిన్నదిగా వదిలేసినారు. అక్కడికి వచ్చే భక్తులకు ఇరుకుగా మారి ఇబ్బందికరంగా ఉందని 15 ఫీట్ల దారి కావాలని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రం ఇవ్వగా వారు స్పందిస్తూ తప్పకుండా చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షులు కూర పర్షయ్య, పంపరి దేవయ్య, కూర జంపయ్య కూర ఎల్లయ్య, పంపరి గోపాల్, పూస రమేష్, కూర దేవేందర్, దివిటీ గణేష్, కూర అనిల్ తదితరులు గంగపుత్ర సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసిన తాడూరి శ్రీనివాస్



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూలై 4:** బీజేపీ పార్టీకి చెందిన ప్రముఖ సీనియర్ నాయకుడు తాడూరి శ్రీనివాస్ ఇటీవల ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామ్‌చందర్ రావు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ప్రత్యేకంగా శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్తు కార్యక్రమాలపై, కార్యకర్తల మధ్య చురుకైన సంబంధాలపై ఈ సందర్భంగా పలు అంశాలు చర్చకు వచ్చాయి.

ఈ సమావేశానికి పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.

# భూభారతి, రేషన్ కార్డులు, ఎల్ ఆర్ ఎస్ పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## అవసరమైన చోట మీ సేవా కేంద్రాల ఏర్పాటు

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి




**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూలై 4:** భూభారతి, రేషన్ కార్డులు, ఎల్ ఆర్ ఎస్ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, అవసరమైన చోట మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి తహసీల్దార్లను, మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు.

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూభారతి, రేషన్ కార్డులు, ఎల్ ఆర్ ఎస్ అంశాల పై నిర్వహించిన సమీక్షా సమావేశానికి అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్ రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టరు మను చౌదరి హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో మండలాల, మున్సిపాలిటిల వారిగా భూభారతి, రేషన్ కార్డులు, ఎల్ఆర్ఎస్ పెండింగ్ కు గల కారణాలను తహాసీల్దార్లను, మున్సిపల్ కమీషనర్లను అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాలకు సంబంధించిన కోర్టు కేసులను, లిటిగేషన్ లో ఉన్న ప్రభుత్వ భూముల ఫిజికల్ పొజిషన్ పరిశీలించి తన దృష్టికి తీసుకురావాలని కలెక్టరు సూచించారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తులను తిరస్కరించేందుకు గల కారణాలను తెలుపుతూ నివేదికలు పంపాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ భూములను కబ్జాకు గురి కాకుండా కాపాడాలని తహాసీల్దార్లను కలెక్టరు ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో ఎక్కువగా పెండింగ్ ఉన్నరేషన్ కార్డుల గురించి కలెక్టర్ ఆరా తీసారు. త్వరితగతిన రేషన్ కార్డులు పరిశీలించి అర్హులైన వారికి మంజూరు చేయాలని కలెక్టరు సూచించారు. జిల్లాలో ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పై సమీక్ష నిర్వహిస్తూ ఎల్ ఆర్ ఎస్ కట్టిన వారికి ప్రొసిడింగ్స్ అందించాలని, అవసరమైన వాటికి క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించాలని సూచించారు. సమస్యాత్మకంగా ఉన్న దరఖాస్తులకు సంబంధించిన వివరాలను తనకు అందించాలని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు కూడా చాలా వరకు పెండింగ్ లో ఉన్నవని వాటిని కూడా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తహాసీల్దార్లను, మున్సిపల్ ఆఫీసర్లను ఆదేశించారు. మండలాల, మున్సిపాలిటిల వారిగా తహాసీల్దార్లకు, మున్సిపల్ కమీషనర్లకు సమస్యలను పరిష్కరించేందుకు తగు సలహాలను సూచనలను కలెక్టరు అందించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్డిఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాంప్రకాష్, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, తహాసీల్దార్లు,మున్సిపల్ కమీషనర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవాలకు లక్ష రూపాయల విరాళం



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జూలై 04 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా: ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ పట్టణములోని తూర్పు గౌని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో, ఈనెల 15వ తేదీన ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను, నిర్వహించేందుకు నిర్ణయించారు, గురువారం సంఘ భవనంలో జరిగిన సమావేశంలో తీర్మానించారు, ఈ ఉత్సవాల నిర్వహణకు పట్టణ 17వ వార్డు మాజీ మున్సిపల్ కౌన్సిలర్, ఆకుల చిట్టిబాబు, లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు, నిర్వహణ బాధ్యతలను, రిటైర్డ్ ఉద్యోగి సంఘ నాయకులు, తిమ్మిగారి పాండు,కు అప్పగించారు, బోనాల ఉత్సవాలకు లక్ష రూపాయల విరాళాన్ని అందజేసిన చిట్టి బాబుకు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు, ముదిరాజ్ కుల బంధువులు, ఇంటికి ఒక బోనం తీయాలని నిర్ణయించారు, మహంకాళి అమ్మవారి ఊరేగింపు, తూర్పు గౌని ముదిరాజ్ సంఘం నుండి, పోచమ్మ గుడి వరకు జరుపబడుతుందని, నిర్వాహకులు తెలిపారు, ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు జుట్టు విట్టల్, ముదిరాజ్ సంఘ నాయకులు కొత్త శీను,కాళయ్య, నర్సింగ్, సాయిబాబా, జంగిల్ వెంకటేశం, అంతం దానయ్య, అంతం శీను, అరిగే వెంకటేశం,అరిగే శ్రీరాములు,ధర్మేందర్,అయ్యప్ప సునీల్, గట్టుకింది ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు....

# విద్యుత్ శక్తి అధికారుల నిర్లక్ష్యం




**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 4 జూలై 2025** మణికొండ మున్సిపాలిటీ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా శుక్రవారం రోజున ఎంప్లాయిస్ కాలనీలో పర్యవేక్షణ సందర్భముగా ప్రభుత్వ పాఠశాల ప్రక్కన గత 6 నెలల క్రితం 11 కెవి విద్యుత్ శక్తి సరఫరా కొరకు స్తంభాలను నాటి కేబుల్ వైర్ వచ్చి ఉన్నను వృధాగా ప్రక్కన వేసి కనెక్షన్ ఇవ్వకుండా ఉండడం విచిత్రంగా ఉన్నదని, పాఠశాలలో చదివే 300 విద్యార్థులకు ప్రమాద పరిస్థితి ఉన్నదని స్థానికులు వాపోయారు.

ఇట్టి పర్యవేక్షణ సందర్భముగా మణికొండ మునిసిపాలిటీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, కుంబగళ్ళ ధనరాజ్, ముఖ్య కార్యదర్శి గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాధ్ రెడ్డి, అందె లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, యాలల కిరణ్, భానుచందర్, మహమ్మద్ ఆరిఫ్, సుమ నళిని, షేక్ ఆరీఫ్, మాల్యాద్రి నాయుడు, ప్రవీణ్, సుమన్, బాబురావు, శ్యామలేట్ రేఖ తదితరులు డిమాండ్ చేస్తున్నారు.

# కార్మికులకి అన్యాయం జరిగితే సహించేది లేదు...

## -బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి




**కూకట్పల్లి (ప్రజబలం) జులై 04** :కూకట్ పల్లి నియోజకవర్గం ప్రశాంత్ నగర్ ఇండస్ట్రీ ఏరియాలో స్నేనేత్ ఎంటర్ ప్రైజెస్ కంపెనీ లో జితేంద్ర కుమార్ అనే కార్మికుడు గత కొన్ని సంవత్సరాల నుంచి కంపెనీ లో పనిచేసేవారు, కొన్ని అనివార్య కారణాలవల్ల స్నేనేత్ ఎంటర్ ప్రైజెస్ లో పనిచేస్తున్న జితేంద్రకుమార్ మానేయడం జరిగింది.జితేంద్ర కుమార్ అనే కార్మికుడికి ఈ సంవత్సరం ఏప్రిల్ నెల వేతనం, రావాల్సి ఉండగా అవి ఇవ్వకపోవడంతో పలుమార్లు కంపెనీ యజమాన్యాన్ని ఎన్నిసార్లు అడిగినా జితేంద్ర కుమార్ పట్ల నిర్లక్ష్యం వహిస్తూ తనను ఏదో రకంగా కంపెనీ యజమాన్యం పట్టించుకోవడం లేదు అని తెలుసుకొని అడిగి అడిగి విసుగు చెందిన కార్మికుడు జితేంద్ర కుమార్ కు ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే కార్మికులకు న్యాయం చేస్తారని తోటి కార్మిక మిత్రుల ద్వారా తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు.వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన స్నేనేత్ ఎంటర్ ప్రైజ్స్ కంపెనీ వద్దకు బయలుదేరి యజమాన్యంతో పలుమార్లు చర్చించి కార్మికుడికి జితేంద్ర కుమార్ కి రావలసిన ఏప్రిల్ నెల వేత్తనం ఇప్పించడం జరిగింది.కార్మికుడు జితేంద్ర కుమార్ మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల సేవలు చిరస్మరణీయం

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

## ఘనంగా రోశయ్య జయంతి, దొడ్డి కొమురయ్య వర్ధంతి



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై - 04 (ప్రజాబలం ప్రతినిధి)** మహనీయుల సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి, వేడుకలను దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ మరియు జిల్లా యువజన క్రీడల శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి

జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

కార్యక్రమాల్లో డి.వై ఎస్ ఓ రాందాస్, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రాజ మనోహర్ రావు,జిల్లా అధికారులు , సిబ్బంది, ఆయా కుల సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే భవిష్యత్తు బాగుంటుంది

## జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూలై 4: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లావిద్యార్థులు కోరిన మేరకు రెసిడెన్షియల్ స్కూల్ లో డ్రైనేజీ, సైన్స్ ల్యాబ్, అదనపు టాయిలెట్లు తప్పకుండా ఇస్తామని, విద్యార్థులు కష్టపడి బాగా చదువుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి విద్యార్థులకు హితవు పలికారు.

శుక్రవారం మేడ్చెల్ మండలంలోని కిష్టాపూర్ లో ఉన్న తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ / జూనియర్ కాలేజీ (బాలికలు)ని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ కృషి, పట్టుదల, క్రమశిక్షణతో బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత చదువులు ఏమి చదవాలి అనే లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆదిశగా ముందుకు వెళ్లాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి విద్యార్థులకు తెలిపారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. స్కూల్లో వసతులు ఏలా ఉన్నాయని, భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనశాలలో టేబుల్లు, కుర్చీలు విద్యార్థులకు సరిపడా ఏర్పాటు చేయాలని కలెక్టరు ప్రిన్సిపల్ కు సూచించారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకొని, మెను చార్టును పరిశీలించారు. ఈరోజు మెనులో ఏమి వండారని అడిగి, వంటలను పరిశీలించారు. స్కూలు కాలేజీ కలిపి మొత్తం ఎంత మంది విద్యార్థులున్నారని ఇంటర్ లో ఏఏ గ్రూపులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. స్టోర్ లోని వంట సామాగ్రి నాణ్యతను పరిశీలించి ఎక్స్పైరీ డేట్ నమోదుకు రిజిష్టరు నిర్వహించాలని కలెక్టరు సూచించారు. రెండవ అంతస్తులో నిర్మాణంలో ఉన్న హాలును కలెక్టర్ పరిశీలించారు.



స్కూల్ ప్రిన్సిపల్ లలిత, జోనల్ ఆఫిసర్ రజిత స్కూలులో ఉన్న మేజర్, మైనర్ రిపేర్లకు నిధులు కావాలని కలెక్టరు దృష్టికి తీసుకురాగా, కలెక్టరు పరిశీలించి కొత్త డ్రైనేజీ పైప్ లైన్, టాయిలెట్లరిపేర్లు, దోమల నివారణకు మెష్, ఫ్లోరింగ్ వంటి పనులకు అయ్యే ఖర్చుల అంచానాల ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కూకట్పల్లి లో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు.. ఎమ్మెల్యే ...



కూకట్పల్లి (ప్రజబలం) జులై 04 :అల్లూరి సీతారామరాజు జయంతి కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముమ్మిడివరం ఎమ్మెల్యే సుబ్బురాజు కెపిహెచ్బి రోడ్ నెంబర్ ఒకటి నందు అల్లూరి సీతారామరాజు స్పోర్ట్స్ గ్రౌండ్ లో ఆయన విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని వెన్నులో వణుకు పుట్టించిన మహా యోధుడు.మన్యం ప్రజల ఆరాధ్య దైవం అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని నేటి యువతరం అందరికీ తెలిసేలా పెద్దలు వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, సీనియర్ నాయకులు శ్యామలరాజు, కిరణ్ వర్మ ,భీమరాజు, ప్రభాకర్ గౌడ్ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో ఆరోగ్య శిబిరం



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూలై 4 :మున్సిపాలిటీ 100 రోజుల కార్యాచరణ కార్యక్రమములో మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు ఆధ్వర్యంలో మందమర్రి మునిసిపాలిటీలో ఔట్సోర్సింగ్ పారిశుద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బందికి మెప్మా స్వయం సహాయక సంఘాల సిబ్బందికి మరియు 24 వార్డుల ఆర్పి లకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని డిస్టిక్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరీష్ రాజు డాక్టర్లు సందర్శించారు. అనంతరం మునిసిపల్ కమీషనర్ తుంగపిండి రాజలింగు మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది ఆరోగ్యం దృష్ట్యా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగింది కార్మికులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. డెంగ్యూ మలేరియా వంటి వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ప్రతినెలా ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీరు శ్రీమతి ఎం. సుమతీ, రెవిన్యూ ఆఫీసర్ పి. కృష్ణ ప్రసాద్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ యం. గోపికృష్ణ మెప్మా ఇన్చార్జి టీఎంసీ ఏనుగు రఘు రామ్, ఆరోగ్య శాఖ సిబ్బంది మెడికల్ ఆఫీసర్ ఆర్ రమేష్, జూనియర్ డాక్టర్లు ఎం. విష్ణు తేజ రెడ్డి, డాక్టర్స్ స్పందన, సూపర్వైజర్ ఎస్. కళావతి, హెల్త్ అసిస్టెంట్ లు సుజాత, రాజేశ్వరి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



# మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందిద్దాం

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 04: ప్రజల సంక్షేమం కోసం విశేష కృషి చేసిన మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు అందిద్దామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి కార్యక్రమాలలో పాల్గొని మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య పాల్గొని పీడిత ప్రజల సంక్షేమం కోసం వీరోచితంగా పోరాడి అమరుడయ్యాడని,ప్రజా ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచారని తెలిపారు.పేద ప్రజల హక్కుల కోసం,సామాజిక సమానత్వం కోసం నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించారని అన్నారు. ఉ మ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా,తమిళనాడు రాష్ట్ర గవర్నర్ గా పని చేసిన కొణిజేటి రోశయ్య గొప్ప ఆర్థికవేత్త అని, రాజకీయ, ప్రజా సేవా రంగాలలో చిరస్మరణీయమైన స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు.ఉమ్మడి రాష్ట్ర ఆర్థిక మంత్రిగా పని చేసిన సమయంలో సంక్షేమ పథకాలకు నిధుల సమీకరణ చేయడంలో కీలక పాత్ర పోషించారని, 16 సార్లు రాష్ట్ర బడ్జెట్ ను సమర్పించారని తెలిపారు. రాజ్యాంగానికి నిబద్ధత చూపుతూ తమిళనాడు గవర్నర్ గా నిష్పక్షపాతంగా ప్రజలకు ఎన్నో సేవలు అందించారని తెలిపారు. మహనీయుల వర్ధంతి, జయంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని,ఇదే స్ఫూర్తితో భావితరాలకు దేశ త్యాగధనుల ఆదర్శాన్ని అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ. పురుషోత్తం,జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి దుర్గాప్రసాద్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి, కుల సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు వినియోగించుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 04 : అన్ని ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తుందని,విద్యార్థులు సౌకర్యాలను సద్వినియోగపర్చుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల,కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాలను సందర్శించి వంటశాల,తరగతి గదులు, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలలో సకల సౌకర్యాలను కల్పించడం జరిగిందని తెలిపారు.ప్రతి పాఠశాలలో త్రాగునీరు,విద్యుత్,మూత్రశాలలు,ప్రహారీగోడ,వంటశాల ఇతర అన్ని మౌళిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించాలని,ఆహారం తయారీ సమయంలో నిబంధనలు పాటించాలని,తాజా కూరగాయలు,నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని,శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు.విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వర్షాకాలం కావడంతో పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని తెలిపారు.పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని,బడి బయట పిల్లలు,మధ్య బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు.కళాశాల విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని,ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ఏకాగ్రతతో కష్టపడి చదివి సాధించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు మరింత వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టిందని,నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణరావు,కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపల్ కవిత,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖర్గే సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జూలై 04 : మంచిర్యాల శాసన సభ్యుడు ప్రేమ్ సాగర్ రావు,డీసీసీ అధ్యక్షురాలు సురేఖ పిలుపు మేరకు హైదరబాద్ ఎల్ బీ స్టేడియం లో నిర్వహించిన గ్రామ స్థాయి అధ్యక్షులు మరియు తాజా మాజీ ప్రజాప్రతి నిధుల సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరైన మండల కాంగ్రెస్ నాయకులు.తరలి వెళ్ళిన వారిలో ఆర్ జీ పి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి,మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చంద్,మాజీ ఎంపీటీసీ లు ముత్యాల శ్రీనివాస్,తోట మోహన్,లతో పాటు అన్ని గ్రామాల అధ్యక్షులు తాజా మాజీ ప్రతినిధులు ఉన్నారు.

# ప్రజల దాహార్తిని తీర్చడానికి 16వ వార్డులో బోరు ప్రారంభం



సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి జులై 04(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:సదాశివపేట/ పట్టణం లోని 16వ వార్డులో మాజీ వైస్ చైర్మన్ చింత గోపాల్ బోరు పనులను ప్రారంభించడం జరిగింది,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వార్డులోని ప్రజల దాహార్తిని తీర్చడానికి జనరల్ ఫండ్ ద్వారా 1,60,000లతో బోరు పనులు ప్రారంభించడం జరిగిందన్నారు,తమ వార్డులోని ప్రజలకు ఈ బోరు వేయడం ద్వారా నీటి సమస్యను కొంతమేరకు తీర్చడం జరుగుతుందన్నారు,ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు విద్యాసాగర్ రెడ్డి, ప్రకాష్, ఇంద్రమోహన్ గౌడ్,ఆకుల శివ,నాయకులు కొత్త గొల్ల కృష్ణ, పిల్లిగుండ్ల వీరేశం,ముబీన్,నసీర్,నాగుల విజయకుమార్, బరాడి శివ, శమీ, కిరణ్, కాజా తదితరులు పాల్గొన్నారు.

# రోశయ్య సేవలు మరువలేనివి అవోపా అధ్యక్షుడు కొత్త కిరణ్ కుమార్



ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జూలై 04 : దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య సేవలు మరువలేనివని లక్షెటిపేట యూనిట్ అవోపా అధ్యక్షుడు కొత్త కిరణ్ కుమార్ అన్నారు. శు క్రవారం స్థానిక విశ్రాంతి భవనంలో రోశయ్య 92వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆర్థిక దిక్సూచి అయిన రోశయ్య రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి పథంలో నడిపారని ఆయన గుర్తు చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం కష్టాలలో ఉన్నప్పుడు గట్టెక్కించిన చరిత్ర ఆయనకు ఉందన్నారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఆర్థిక శాఖ మంత్రిగా ఆరోగ్య శాఖామంత్రిగా ఎన్నోసార్లు సేవలందించారని మరియు తమిళనాడు రాష్ట్రానికి గవర్నర్గా సేవలందించిన చరిత్ర ఆయనది అన్నారు. రోశయ్య వైశ్య సమాజానికే కాకుండా కులమతాల భేదం లేకుండా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని ఆయన సేవల వలన ఎంతోమంది లబ్ధి పొంది ఉన్నత శిఖరాలకు అధిరోహించారన్నారు అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మరియు ఉద్యోగులకు బిస్కెట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అవపా రాష్ట్ర కార్యదర్శి గుండ ప్రభాకర్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఉజ్జల రాజమౌళి జిల్లా కోశాధికారి అక్కెనపల్లి రవీందర్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాచర్ల సత్యనారాయణ యూనిట్ గౌరవాధ్యక్షుడు పాలకుర్తి సుదర్శన్ అవోపా నాయకులు జిల్లా సత్తయ్య నరేంద్ర భీమన్న దొంతుల చంద్రశేఖర్ రావుల ప్రసాద్ కాసం కుమారస్వామి బొద్దుకూరి సత్తయ్య వజ్జల కృపాకర్ గుండ జగదీశ్వర్ గుండా సంతోష్ పుత్తూరు జయం తదితరులు పాల్గొన్నారు.

# మంత్రిని కలిచిన కాంగ్రెస్ నాయకులు



ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జూలై 04 హైద్రాబాద్ ఎల్ బీ స్టేడియంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు,నాయకులతో సమ్మళన కార్యక్రమంలో భాగంగా మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు,మంచిర్యాల జిల్లా నాయకులు గడ్డం త్రిమూర్తి,దండేపల్లి మండలం మాజీ యూత్ అధ్యక్షులు ఆకుల దుర్గ ప్రసాద్,మ్యాదరిపేట తాజా మాజీ ఎంపీటీసీ కొంగల నవీన్,చుంచు నగేష్,తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి జీఎం కు టిడబ్ల్యూజేఎఫ్ యూనియన్ వినతి



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్, జులై 4,వర్కింగ్ జర్నలిస్టులకు సింగరేణి క్వార్టర్లు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) మంచిర్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మిట్టపల్లి మధు, సత్యగౌడ్ ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి దేవేందర్ కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మధు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులు అహర్నిశలు ప్రజా సమస్యలపై పోరాడుతూ, తమ సమస్యలను పరిష్కరించలేకపోతున్నా జర్నలిస్ట్ లకు సింగరేణి సంస్థ క్వార్టర్లు కేటాయించాలని కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ లు శ్రీనాథ్, మడ్డి వేణు గోపాల్ గౌడ్, జిల్లా జాయింట్ సెక్రటరీ సుమన్, కోశాధికారి భాస్కర్, సెక్రటరీ సురేష్, పట్టణ జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై పై ఎల్లారెడ్డిపేట రెవిన్యూ శాఖ కొరడా.

**ప్రభుత్వ అనుమతి 10 కి, ఉదయం 7 కే ఇసుక తరలింపు.**

**13 ట్రాక్టర్ల పట్టివేత,20 ట్రాక్టర్లు పరారీ.**

**మొదటిసారి పట్టుబడితే ఫైన్,2,3, అయితే కేసు నమోదు.**

**ఎల్లారెడ్డిపేట తాసిల్దార్ సుజాత.**



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట,( ప్రజాబలం ), రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో ఇసుక అక్రమ రవాణా పై ఎల్లారెడ్డిపేట రెవెన్యూ అధికారులు విరుచుపడ్డారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మాత్రమే ఇసుక రవాణాకు అనుమతి ఉండగా, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి, అక్రమ ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ యాజమాన్యాలు ఉదయం 7 గంటల సమయంలోనే ట్రాక్టర్లు వెంకటాపూర్ వాగులోకి దిగి ఇసుకను సర్దాపూర్ కు తరలించేందుకు ప్రయత్నించారు.

సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి ట్రాక్టర్లను వెంబడించారు. ఈ దాడిలో 33 ట్రాక్టర్లు సమయానికి అంటే ముందే వాగులోకి దిగాయి, వాటిని తరలించే సమయంలో 20 ట్రాక్టర్లు తప్పించుకొని పోయినట్లు, 13 ట్రాక్టర్లును పట్టుకొని ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ కు తరలించారు. మిగతా 20 ట్రాక్టర్లను గుర్తించే పనిలో అధికారులు ఉన్నారని ట్రాక్టర్ల పూర్తి వివరాలు రెవెన్యూ అధికారుల వద్ద ఉన్నాయని తెలిపారు. మొత్తం 33 ట్రాక్టర్లలో సమయానికంటే ముందే దిగిన వాటిలో మొదటిసారి అయితే ఫైన్ వేయబడుతుందని, రెండవసారి, మూడవసారి అయితే కేసులు నమోదు చేయబడుతుందని హెచ్చరించిన తహసిల్దార్ సుజాత.

# కాంగ్రెస్ సభ పేరును సామాజిక అన్యాయ సమరభేరిగా మార్చుకోండి.

**50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీ కైనా ప్రధాని పదవి ఇచ్చారా?**

**అర్ధ శతాబ్ద కాంగ్రెస్ పాలనలో ఏనాడైనా బీసీని సీఎం చేశారా?**

**జనాభాలో సగం ఉన్న బీసీలకు క్యాబినెట్లో ఎన్ని మంత్రి పదవులు ఇచ్చారు?**

**కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్.**









రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, కోనరావుపేట, ( ప్రజాబలం ), వేములవాడ నియోజకవర్గంలోని కొనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలో గల ఏకలవ్య పాఠశాలలో 5 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఎంపీ నిధులతో సోలార్ ప్లాంట్, డిజిటల్ బోర్డులను కూడా ఏర్పాటు చేస్తానని కేంద్ర మంత్రి హామీ ఇవ్వడం జరిగింది.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏం ఉద్ధరించిందని సామాజిక న్యాయ సమరభేరి సభను నిర్వహిస్తున్నారని కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. ఈ దేశాన్ని, ఈ రాష్ట్రాన్ని అర్ధ శతాబ్దానికి పైగా పాలించిన కాంగ్రెస్ పార్టీ ఇన్నేళ్లలో ఒక్కసారైనా బీసీని ప్రధానమంత్రిని, ముఖ్యమంత్రిని చేయలేదని, దళిత, బడుగు, బలహీన వర్గాలు అత్యధికంగా లబ్ధి పొందే అవకాశం ఉన్న ఆరు గ్యారెంటీలను కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని, మరి ఏ ముఖం పెట్టుకొని సభను నిర్వహిస్తున్నారు అని, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే ప్రజలకు సమాధానం చెప్పాలని, లేకుంటే ఆ సభకు సామాజిక అన్యాయ సమరభేరి అని పేరు మార్చుకోవాలని బండి సంజయ్ పేర్కొన్నారు.

మర్రిమడ్ల ఏకలవ్య పాఠశాల విద్యార్థులు మంత్రికి వినూత్న రీతిలో ఘన స్వాగతం పలికారు. గిరిజన నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, అధికారులు, జిల్లా బిజెపి నేతలతో కలిసి పాఠశాలను సందర్శించిన బండి సంజయ్ అన్ని తరగతి గదును పరిష్కరించారు. విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల సమస్యలపై అధ్యాపకులు, విద్యార్థులను అడిగి ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ల్యాబ్, ఇతర సౌకర్యాలను కల్పిస్తానని దీంతో పాటు ఎంపీ నిధులతో సోలార్ ప్లాంట్, డిజిటల్ బోర్డును కూడా ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 20 వేలకు పైగా గిరిజన జనాభా ఉన్న మండలాల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తున్నామని, 728 స్కూల్స్ లక్ష్యం కాగా, దాదాపు 500 స్కూల్స్ ప్రారంభమైనాయని,1.5 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు అని పేర్కొన్నారు.

సమాజంలో పూర్తిగా వెనుకబడ్డ ఆదివాసి, గిరిజనులకు నవోదయ స్థాయిలో విద్యను అందించడం ద్వారా సమాజంలోని అసమానతలం తొలగించే విద్యలో సమానత్వం సాధించాలన్నది ఈ ఏకలవ్య స్కూల్స్ వ్యవస్థ ప్రధాన లక్ష్యం అన్నారు. చదివే కాకుండా క్రీడా, కళ, సాంస్కృతిక రంగాల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించడంతోపాటు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులు స్కూల్స్ ద్వారా సిద్ధం చేస్తున్నామన్నారు. ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు సీబీఎస్ఈ విధానంలో అత్యున్నతమైన నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నామన్నారు. ఉచిత వసతి, భోజనం, డ్రెస్, పాఠ్యపుస్తకాలను అందిస్తున్నామన్నారు.

ఏకలవ్య పాఠశాలల పథకాన్ని నిర్వహించేందుకు మొత్తం దాదాపు 25 వేల కోట్లు (24614.88 లక్షలు) రూపాయలను కేంద్రం ఖర్చు చేస్తుందన్నారు. ఈ పాఠశాలలో దాదాపు లక్ష 40,000 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 23 పాఠశాలల్లో సుమారు పదివేల మంది విద్యార్థులు ఉన్నారన్నరు. మొత్తం మూడు లక్షల 50 వేల మంది గిరిజన, ఆదివాసి విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకొని ఆ దిశగా చర్యలు తీసుకుంటుంది అన్నారు.

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లలో ఐఐటి - జేఈఈ %డ% ఎన్ ఈ ఈ టి ఆన్లైన్ కోచింగ్ ఇస్తున్నారన్నారు. గిరిజన బిడ్డలకు అర్థం కావడం కోసం ప్రాంతీయ భాషలో నేర్పేందుకు సంబంధిత భాషా బోధకులను నియమిస్తున్నామన్నారు. ఇక్కడ నుండి మెడిసిన్, ఇంజనీరింగ్, ఐటి లాంటి తదితర కోర్సులకు గ్రాడ్యుయేషన్ / పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదవాలి అనుకునే విద్యార్థులకు జాతీయ స్కాలర్షిప్ స్కీం కింద సాయం చేస్తున్నామన్నారు. ఎం. ఫిల్, పీహెచ్డీ వంటి కోర్సులు చదవాలనుకునే ఎస్టీ విద్యార్థులకు నేషనల్ ఫెలోషిప్ అందిస్తున్నామన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యా చదవాలనుకునే వాళ్లకు నేషనల్ ఓవర్సీస్ స్కాలర్షిప్ ను అందిస్తున్నామన్నారు.

సామాజిక న్యాయ సమరభరి పేరును మార్చుకోవాలని సూచిస్తున్నానన్నారు. దాని స్థానంలో సామాజిక అన్యాయ సమరభేరి పెట్టుకుంటే మంచిది అన్నారు. కాంగ్రెస్ సీఎం ఉద్ధరించిందని సబర్ పెడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ దేశాన్ని అధ్యక్ష శతాబ్దానికి పైగా కాంగ్రెస్ పాలించింది ఇన్నేళ్లలో ఒక్కసారైనా బీసీని ప్రధానమంత్రి చేశారా, బిజెపి బిసిని ప్రధానిని చేసిందని, దళిత వర్గానికి చెందిన రామ్నాథ్ కోవింద్ ను ఆదివాసి బిడ్డ ద్రౌపతి ముర్మును మైనార్టీ కి చెందిన అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా చేసిన ఘనత కూడా బిజెపిని అన్నారు. ఎన్నడూ లేని విధంగా 27 మంది ఓబీసీలను, 12 మంది దళితులను, ఆరుగురు దళితులను, 8 మంది మహిళలను కేంద్ర క్యాబినెట్లో చోటు కల్పించిన చరిత్ర బిజెపిది అన్నారు. బీసీనైన నన్ను కేంద్రమంత్రిగా చేసింది, పార్టీ పరంగా నాతోపాటు లక్ష్మణ్, దత్తాత్రేయులకు అనేక పదవులు ఇచ్చింది బిజెపి అని, బీసీకి చెందిన మోడీని ప్రధాని అయితే చాయ్ బాలా అంటూ హేళన చేసిన పార్టీ కాంగ్రెస్ అన్నారు.

తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తే బీసీ సీఎం అవుతారని ప్రకటించిన నేత మోడీ అన్నారు.

అట్లాగే 50 శాతానికి పైగా బీసీ జనాభా ఉందని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్యాబినెట్లో ఎంతమంది బీసీలకు అవకాశం ఇచ్చారు, బీసీ నేత పొన్న ప్రభాకర్ పదవి ఇస్తే బీసీల గొంతు వినిపించారు. మరింత మంది బీసీలకు ఇస్తే న్యాయం జరిగేది కదా, మరి ఏ ముఖం పెట్టుకొని సామాజిక న్యాయ సమరభేరి సభ పెడుతున్నారు, బీసీల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్కు లేనేలేదని అన్నారు.

మహిళలకు ప్రతినెల 2500 రూపాయలు, 4000 ఆసరా పెన్షన్లు, 4000 నిరుద్యోగ భృతి, విద్యార్థులకు 5 లక్షల భరోసా కార్డు, ఎకరానికి ఇంకా రైతు భరోసా కింద 21 వేల బకాయి, బోనస్ బకాయిలు ఎందుకు ఇవ్వలేదు, ఇచ్చిన 6 గ్యారంటీలో చపాతీ మ్యానుఫ్యాస్ట్ లోని 420 హామీలను ఎందుకు అమలు చేయలేకపోయారు, శుక్రవారం రోజు జరిగే సామాజిక న్యాయ సమరభ బీరులో వీటిపై ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున కార్గే సమాధానం చెప్పాలన్నారు.

యూరియా కొరతపై కాంగ్రెస్, బి ఆర్ఎస్ పార్టీలు కావాలనే కేంద్రాన్ని బధనం చేస్తున్నాయని, లోకల్ బాడీ ఎన్నికలలో బిజెపికి పట్టం కట్టానికి ప్రజల సిద్ధమవుతుంటే ఓర్వలేక బదనాం చేస్తున్నారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుభవజ్ఞులు అధికారులు ఆయనను తప్పుదోవ పట్టిస్తున్నారు. వాస్తవాలు గ్రహించాలని కోరుతున్నాం అన్నారు. తెలంగాణకు కథ సీజన్లో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే కేంద్రం 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చిందని, అదనంగా దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చింది. ఈ సీజన్లో కూడా కోరినంత యూరియా ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది కానీ గత సీజన్లో అదనంగా కేటాయించిన యూరియా ఎటు పోయింది, వాటిని ఏం చేశారో లెక్కలు చెప్పకుండా కేంద్రాన్ని బదనాం చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో అడ్డదారులు పడితే తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభ్యర్థనను కూడా కేంద్రం సానుకూల ధోరణితో పరిశీలించేందుకు సిద్ధంగా ఉంది అన్నారు. ఇప్పటికైనా ప్రజలకు వాస్తవాలు చెప్పాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com